



www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక







Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
Navabhoomi daily follows..

హైదరాబాద్ | 03 గురువారం | జులై 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 288

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur


## గుండెపోటు మరణాలు



- ఒకే జిల్లాలో నెల రోజుల్లో 20కి పైగా
- విచారణకు ఆదేశించిన సీఎం

3

## పాశమైలారం పేలుడు ఘటనపై ప్రభుత్వం కీలక నిర్ణయం


పాశమైలారం పేలుడుపై ప్రభుత్వ విచారణ శాస్త్రవేత్తల నేతృత్వంలో 4గురు సభ్యుల కమిటీ



2

## మధ్యతరగతి ప్రజలకు జీఎస్టీ రిలీఫ్

ఆ వస్తువులపై పన్ను తగ్గించే యోచనలో కేంద్రం..?



3

## బీజేపీ ఎంపీ డీకే అరుణకు పార్టీలో మరో కీలక పదవి



2 బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా నియామకం

## ఏపీ కేడర్ ఐపీఎస్ అధికారి సిద్ధార్థ్ కౌశల్ రాజీనామా!



2 వ్యక్తిగత కారణాల వల్లే రాజీనామా చేశానని వెల్లడి

## బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు 6 నెలల జైలు




2 కోర్టు ధిక్కరణ కేసులో అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ తీర్పు

# భారత్‌కు అమెరికా ఆంక్షలు

- రష్యా చమురుపై ఆధారపడితే 500% దిగుమతి టాక్స్
- ఉక్రెయిన్ యుద్ధానికి వ్యతిరేకంగా ఆర్థిక జెండా
- ట్రంప్ మద్దతుతో బిల్లు -గ్రాహమ్ ప్రతిపాదన
- ఔషధాలు, ఐటీ సేవలపై భారీదిగుమతి పన్నుల ముప్పు
- అమెరికాతో ట్రేడ్ డీల్‌కు ఆటంకాల సూచనలు
- ఔషధాలు నుంచి ఐటీ సేవల వరకు ఎగుమతులపై ప్రభావం
- అమెరికాతో ట్రేడ్ డీల్ ప్రయోజనాలకు ముప్పు

2




**వాషింగ్టన్-నవభూమి ప్రతినిధి**

ఇప్పుడు ప్రపంచంలో రాజకీయ పరిస్థితులు వేడెక్కుతున్నాయి. అమెరికా తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు అంతర్జాతీయ వాణిజ్యంపై తీవ్రమైన ప్రభావం చూపేలా ఉన్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా దాడి నేపథ్యంలో, రష్యాను ఆర్థికంగా బలహీనపరచాలన్న ఉద్దేశంతో అమెరికా గట్టిగా వ్యవహరిస్తోంది. ఈ క్రమంలో భారత్ లేదా చైనా లాంటి దేశాలు రష్యాతో బిజినెస్ చేస్తుంటే, అక్కడి నుంచి వచ్చే సరుకులపై 500% దిగుమతి ట్యాక్స్ వేయాలనే ఆలోచనతో ముందుకెళ్తోంది. ఇది అమలైతే, గ్లోబల్ ట్రేడ్ బ్యాలెన్స్ పూర్తిగా మారిపోయే అవకాశం ఉంది. అమెరికా ప్రభుత్వం ఇటీవల ఒక కీలకమైన బిల్లు ప్రతిపాదించింది. ఈ బిల్లు ప్రకారం, రష్యాతో వ్యాపారం చేస్తున్న దేశాలపై ప్రత్యేకంగా భారత్, చైనా నుంచి వచ్చే ఉత్పత్తుల పై 500% దిగుమతి ట్యాక్స్ వేయాలని ఆలోచిస్తుంది. అసల ఎందుకు ఈ బిల్లుపెడతుందంటే రష్యా ఉక్రెయిన్‌పై యుద్ధం ప్రారంభించిన తర్వాత కూడా, భారత్, చైనా వంటి దేశాలు రష్యా నుంచి పెద్ద ఎత్తున చమురు, ఇతర వస్తువులు కొనుగోలు చేస్తున్నాయి. రష్యా యుద్ధ ఆర్థిక వ్యవస్థను బలహీనపరిచేందుకు, అలాగే ఉక్రెయిన్‌కు మద్దతుగా ఉండని దేశాలను ఒత్తిడి చేయడమే లక్ష్యం. భారత్, చైనా ప్రధానంగా ఈ బిల్లులో లక్ష్యంగా ఉన్న దేశాలు. ఈ రెండు దేశాలు కలిపి రష్యా చమురు ఎగుమతుల్లో దాదాపు 70% కొనుగోలు చేస్తున్నారు. అమెరికా సెనేట్ సభ్యుడు లిండ్సే గ్రాహమ్, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మద్దతుతో, ఈ బిల్లును ప్రతిపాదించారు. అమెరికా అధ్యక్షుడికి టారిఫ్ అమలుపై మినహాయింపు ఇచ్చే అధికారం కూడా ఈ బిల్లులో ఇవ్వబడింది. ఈ చర్యల ప్రధాన లక్ష్యం రష్యా యొక్క యుద్ధ సామర్థ్యాన్ని ఆర్థికంగా బలహీనపరచడం,

# వికాసం వైపు అడుగులు

- దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా కుప్పాన్ని తయారు చేస్తాం
- కుప్పం రూపు రేఖలు మార్చేందుకు అద్భుతమైన ప్రణాళికలు
- కుప్పంలో తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పిస్తాం
- ఎయిర్‌పోర్ట్ అంటేనే అభివృద్ధి..కుప్పంలో ఎయిర్‌పోర్ట్ రాబోతోంది

2



**చిత్తూరు-నవభూమిబ్యూరో**

బ్రాండ్ కుప్పం ఎస్టాబ్లిష్ చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. గతంలో బ్రాండ్ కుప్పం అనేది లేదన్నారు. కానీ ప్రస్తుతం ఆ దిశగా కుప్పంలో తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పిస్తామని స్పష్టం చేశారు. బుధవారం కుప్పంలో సీఎం చంద్రబాబు పర్యటించారు. స్వర్ణ కుప్పం ప్రాజెక్టులో భాగంగా పలు అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలకు సీఎం చంద్రబాబు శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం కుప్పంలో ప్రజావేదిక పేరుతో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఎయిర్‌పోర్ట్ అంటేనే అభివృద్ధన్నారు. కుప్పంలో ఎయిర్‌పోర్ట్ రాబోతోందని తెలిపారు. రూ. 850 కోట్లతో కుప్పం ఎయిర్‌పోర్ట్‌ను నిర్మిస్తామని చెప్పారు. అయితే ఈ ఎయిర్‌పోర్ట్‌కు భూములు ఇవ్వవద్దని కొందరు రెచ్చగొట్టే ప్రయత్నం చేశారన్నారు. ఎయిర్‌పోర్ట్‌కు భూములు ఇచ్చిన వారికి మెరుగైన ప్యాకేజీ ఇస్తామని స్పష్టం చేశారు. రాజధాని అమరావతికి భూములిచ్చారని.. వారందరికి ప్యాకేజీ ఇచ్చామని గుర్తు చేశారు.

కుప్పంలో ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెల్ ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ సోలార్ ప్యానెల్ పెట్టుకునేంత వరకు తాను.. మీ వెంట పడతానని పేర్కొన్నారు. ఇళ్లపై రూఫ్ టాప్ ద్వారా మనమే సొంతంగా విద్యుత్ తయారు చేసుకోవచ్చునని ప్రజలకు ఈ సందర్భంగా ఆయన వివరించారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగానే పీఎం సూర్య ఘర్

# రెంటపాళ్ల సీన్ రివర్స్?



- రెంటపాళ్ల సింగయ్య మృతి కేసు..తుస్సు..!
- జగన్ రెంటపాళ్ల ఎపిసోడ్‌లో భారీ ట్విస్ట్‌లు..!
- 2 ఘటనలకు సంబంధించి బాధితులూ రివర్స్..?
- సింగయ్య ఘటన తర్వాత బతికే ఉన్నాడని, అంబులెన్స్‌లో ఏదో జరిగిందని భార్య ఆరోపణ
- రూ.10 లక్షల సాయం అందించిన జగన్

2



**అమరావతి-నవభూమిబ్యూరో**

ఏపీలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. వైసీపీ అధినేత వైఎస్ జగన్ తాజాగా నిర్వహించిన రెంటపాళ్ల పర్యటన సందర్భంగా చనిపోయిన ఇద్దరు బాధితులు సింగయ్య, జయవర్ధన్ రెడ్డి కుటుంబాలు ఇవాళ ఆయన్ను కలిశాయి. వైసీపీ నుంచి వారికి ప్రకటించిన సాయాన్ని అందుకున్నాయి. అనంతరం ప్రభుత్వంపై విమర్శలకు దిగాయి. దీంతో ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. జగన్ రెంటపాళ్ల పర్యటనకు వెళ్తుండగా గుంటూరు సమీపంలో కారు కింద పడి చనిపోయిన సింగయ్య కుటుంబం ఇవాళ ముందుగా ఆయన్ను తాడేపల్లి కార్యాలయంలో కలిసింది. సింగయ్య కుటుంబానికి ఇప్పటికే వైసీపీ రూ.10 లక్షల సాయం అందించింది. ఈ సందర్భంగా జగన్ తమకెంతో భరోసా ఇచ్చారని, తమ కుటుంబానికి అండగా ఉంటామన్నారని సింగయ్య భార్య లూర్దు మేరీ తెలిపారు. యాక్సిడెంట్ తర్వాత కూడా తన భర్త సింగయ్య మాట్లాడారని, తన పేరు, ఊరు, కుటుంబ సభ్యుల వివరాలు చెప్పారని ఆమె తెలిపారు. ప్రమాదంలో ఆయనకు తగిలిన దెబ్బలు చిన్నవేనని, అంత బాగా ఉన్న ఆయన ఎలా చనిపోయారని ప్రశ్నించారు. అంబులెన్సులో కచ్చితంగా ఏదో జరిగి ఉంటుందని అనుమానాలు వ్యక్తం చేశారు. తన భర్త సింగయ్య చనిపోయాక ఇంటికి పోలీసులు వచ్చి యాక్సిడెంట్ వీడియోలు చూపారని, ఆ తర్వాత దాదాపు 50 మంది టీడీపీ మనుషులు కూడా వచ్చి లోకేష్ పంపారని చెప్పారన్నారు. మేం కూడా మీ కులస్తులం, ఎస్సీలమే అని చెప్పారన్నారు. ఇంకా ఏవేవో మాట్లాడి ప్రలోభపెట్టాలని చూశారని, అందుకే తమకు అనుమానాలు వస్తున్నాయన్నారు.

# మెడికల్ టూరిజం హబ్‌గా తెలంగాణ



- మెడికల్ టూరిజానికి హైదరాబాద్ హబ్‌గా మారిందన్న సీఎం
- ఫార్మా సూటికల్స్ రంగంలో హైదరాబాద్ ఇప్పటికే
- అత్యుత్తమ నగరంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు
- 4 కోవిడ్ వ్యాక్సిన్లు ఇక్కడే తయారయ్యాయి
- 66 దేశాల నుంచి వ్యాధిగ్రస్తులు ట్రీట్మెంట్ కోసం
- హైదరాబాద్‌కు వస్తుండటం మన రాష్ట్రానికే గర్వకారణం

2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

మెడికల్ టూరిజానికి హైదరాబాద్ హబ్‌గా మారిందన్న సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మెడికల్ టూరిజానికి తెలంగాణ కేంద్రంగా మారిందన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో కొత్తగా నిర్మించిన ఏఐజీ ఆసుపత్రి భవన సముదాయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. వైద్యరంగంలో ప్రభుత్వం సాధించిన పురోగతిని వివరించారు. మెడికల్ టూరిజానికి హైదరాబాద్ హబ్‌గా మారిందని పేర్కొన్నారు. ఫార్మా సూటికల్స్ రంగంలో హైదరాబాద్ ఇప్పటికే అత్యుత్తమ నగరంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు సాధించిందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నాలుగు కోవిడ్ వ్యాక్సిన్లు ఇక్కడే తయారయ్యాయనీ గుర్తు చేశారు. 1961లో అప్పటి కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో ఐడిపిఎల్ ఏర్పాటు చేసిందని, దాని వల్లే ఫార్మారంగంలో హైదరాబాద్ అగ్రస్థానానికి ఎదిగిందని అన్నారు. దాదాపుగా 66 దేశాల నుంచి వ్యాధిగ్రస్తులు ట్రీట్మెంట్ కోసం హైదరాబాద్‌కు వస్తోన్నారని రేవంత్ రెడ్డి అన్నారు. వచ్చే వందేళ్లల్లో తెలంగాణ సాధించాల్సిన పురోగతిపై ఓ విజన్ డాక్యుమెంట్ తయారు చేయనున్నామని, ఇందులో హెల్త్ టూరిజానికి అధిక ప్రాధాన్యత ఇస్తోన్నామని చెప్పారు. ఈ హెల్త్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడంలో భాగంగా డాక్టర్ నోరి దత్తాత్రేయు డిని హెల్త్ అడ్వైజర్‌గా అపాయింట్ చేశామని ఆయన పేర్కొన్నారు. హెల్త్ విజన్ డాక్యుమెంట్‌కు రూపకల్పన చేయ

# ఉచిత వైఫై సేవలకు గ్రీన్ సిగ్నల్..

- టీఎస్ఆర్టీసీకి డిజిటల్ మేకోవర్
- బస్సుల్లో ఉచిత వైఫైకు తొలి అడుగు
- స్టేషన్లలోనూ వైఫై సేవలు అందుబాటులోకి
- తొలి దశలో సినిమాలు, పాటల వినోదం
- ప్రకటనల ద్వారా ఆర్టీసీకి ఆదాయ వనరులు
- ప్రయాణికుల మెరుగుపరచే ప్రయోగం
- ప్రైవేట్ ఇంటర్నెట్ సంస్థతో భాగస్వామ్యం

2




**హైదరాబాద్-నవభూమి బ్యూరో**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) ప్రయాణికుల అనుభవాన్ని మెరుగుపరచడానికి ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటోంది. బస్సు ప్రయాణాలను, స్టేషన్లలో వేచి ఉండే సమయాన్ని మరింత ఆహ్లాదకరంగా మార్చేందుకు వైఫై సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ నూతన సేవను బస్సులతో పాటు బస్ స్టేషన్లలో కూడా అందించడానికి యాజమాన్యం శరవేగంగా చర్యలు చేపడుతోంది. టీటీఎస్ఆర్టీసీ ఇప్పటికే ఒక ప్రైవేట్ ఇంటర్నెట్ సంస్థతో చర్చలు జరిపింది. ఈ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆర్టీసీ అధికారులు ఈ ప్రణాళికపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రజెంటేషన్‌తో సంతృప్తి చెందిన మంత్రి పొన్నం, వైఫై సౌకర్యం అమలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో ఆర్టీసీ యాజమాన్యం తమ ఈ వినూత్న ప్రణాళికను వేగవంతం చేయడానికి చర్యలను ముమ్మరం చేసింది. మొదటి దశలో.. అన్ని రకాల బస్సులు, బస్ స్టేషన్లలో వైఫై సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రయాణికులు తమ మొబైల్ ఫోన్లలో ముందుగా ఎంపిక చేసిన సినిమాలు, పాటలను



# నిర్లక్ష్యం వల్లే సిగాచి ప్రమాదం

- ఇప్పటి వరకు మృతుల సంఖ్య 40
- మృతుల కుటుంబాలకు యాజమాన్యం కోటి పరిహారం
- ఫ్యాక్టరీలో తగిన భద్రతా ప్రమాణాలు పాటించలేదు
- ప్రమాద స్థలానికి చేరేందుకు సరైన మార్గాలు లేవు
- ఫ్యాక్టరీలో మెషినరీ పాతది..ఆధునీకరించలేదు
- ఎఫ్ఐఆర్‌లో సంచలన విషయాలు

2

**అమరావతి-నవభూమిబ్యూరో**

సంగారెడ్డి జిల్లా పఠాన్‌చెరు మండలం పాశమైలారంలోని సిగాచి కెమికల్ ఫ్యాక్టరీలో జూన్ 30న సంభవించిన భారీ పేలుడు పెను విషాదాన్ని మిగిల్చింది. సంగారెడ్డి జిల్లా పఠాన్‌చెరు మండలం పాశమైలారంలోని సిగాచి కెమికల్ ఫ్యాక్టరీలో జూన్ 30న సంభవించిన

# వల్లభనేని విడుదల



- నకిలీ ఇళ్ల పట్టాల కేసులో బెయిల్‌పై విడుదల
- షరతులతో బెయిల్: 2 ష్యూరిటీలు, వారంలో 2 సార్లు హాజరు
- మొత్తం 11 కేసుల్లో బెయిల్ పొందిన వంశీ
- 140 రోజుల అనంతరం జైలు బయటకు వచ్చిన వంశీ
- వైసీపీ శ్రేణుల గ్రాండ్ వెల్కమ్.. జైలు వద్ద అభిమానుల సందడి

2

**అమరావతి-నవభూమిబ్యూరో**

గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ విజయవాడ జైలు నుంచి విడుదలయ్యారు. నకిలీ ఇళ్ల పట్టాల కేసులలో వంశీకి న్యూజివీడు సెకండ్ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. లక్ష రూపాయలకు 2 ష్యూరిటీలు, వారానికి రెండుసార్లు స్టేషన్‌కి రావాలంటూ కోర్టు షరతులు పెట్టింది. 2019 ఎన్నికల్లో గన్నవరం నియోజకవర్గంలో ఓటర్లను ప్రభావితం చేసేందుకు నకిలీ ఇళ్లపట్టాలు పంపిణీ చేసిన ఆరోపణలతో.. అదే ఏడాది అక్టోబర్ 18న హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వంశీతో సహా 9 మందిపై ఎఫ్ఐఆర్ ఫైల్ చేశారు. " ఈ కేసుతో పాటు ఇప్పటి వరకూ ఆయనపై నమోదైన భూకబ్జా, గన్నవరంలో టీడీపీ కార్యాలయంపై దాడి, సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులతో సహా అన్ని కేసుల్లో బెయిల్ రావడంతో కాసేపటి క్రితం విజయవాడ డిస్ట్రిక్ట్ జైలు నుంచి విడుదలై బయటకు వచ్చారు. కాగా వల్లభనేని వంశీపై 11 మొత్తం కేసులు నమోదు అయ్యాయి. ఫిబ్రవరి 16న ఏపీ పోలీసులు వల్లభనేనిని హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు. నాటి నుంచి దాదాపు 140 రోజుల పాటు జైలులో ఉన్నారు వంశీ. వంశీ సతీమణి పంకజ శ్రీ, వైఎస్సార్సీపీ కృష్ణ జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, మాజీ

నవ వార్త




## వారు బతికుండే అవకాశాలు చాలా తక్కువ : మంత్రి దామోదర



**హైదరాబాద్-నవభూమి** పాశమైలారం పేలుడు ఘటనలో ఆచూకీ గల్లంతైన వారు బతికే అవకాశాలు తక్కువగా ఉన్నాయని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. బుధవారం ఆయన సంఘటన స్థలాన్ని సందర్శించి సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సిగాచి పరిశ్రమలో సంభవించిన పేలుడులో 11 మంది కార్మికుల ఆచూకీ దొరొకడం లేదన్నారు. ఇప్పటి వరకు 36 మంది మరణించారన్నారు. అలాగే 18 మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు జరుగుతున్నాయని రాజనర్సింహ తెలిపారు. దవాఖానల్లో చికిత్స పొందుతున్న కార్మికుల పరిస్థితి నిలకడగా ఉందన్నారు.కాగా, సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో సోమవారం ఉదయం చోటు చేసుకున్న ప్రమాదం తెలుగు రాష్ట్రాల్లో విషాదం నింపింది. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే ఇది అతిపెద్ద ప్రమాదం. శిథిలాలను తొలగిస్తున్న కొద్దీ కార్మికులు, సిబ్బంది మృతదేహాలు వెలికి వస్తూనే ఉన్నాయి. ప్రమాదంలో 36 మంది మరణించినట్లు మంగళవారం సాయంత్రం అధికారులు ప్రకటించారు. ఇప్పటి వరకు 14 మందిని గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మిగతా వారిని గుర్తించాల్సి ఉన్నది.

## భూ సమీకరణకు కొత్త చట్టం.. సరికొత్త నిబంధనలతో రూపకల్పన



**హైదరాబాద్-నవభూమి:** భూ సమీకరణ పథకం (ల్యాండ్ పూలింగ్ స్కీమ్)కు మరిన్ని సంస్కరణలను జోడించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. విస్తరిత హెచ్ఎండీఏ పరిధిలో అమలు చేయనుంది. భూ సమీకరణ పథకం-2017తో ఆశించిన ప్రయోజనాలు నెరవేరకపోవడంతో ఆస్థానంలో సరికొత్త చట్టాన్ని తీసుకురావాలని భావిస్తోంది. సరికొత్త నిబంధనలు, మార్గదర్శకాలతో ల్యాండ్ పూలింగ్ ఏరియా డెవలప్‌మెంట్ (ఎల్‌పీఏడీ) అనే ముసాయిదా చట్టాన్ని తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకు అవసరమైన మార్గదర్శకాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయడానికి ఓ కన్సల్టెన్సీని నియమించేందుకు హెచ్ఎండీఏ టెండర్లను ఆహ్వానించింది.అభివృద్ధి అనేది ఒకే ప్రాంతానికి పరిమితమవ్వకుండా ఔటర్ అవతల మినీ నగరాలు, టౌన్‌షిపలను తీసుకొచ్చేందుకు అప్పటి ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ స్కీమ్-2017 తీసుకువచ్చింది. అయితే దానికి ఆశించిన స్పందన రావడం లేదు. ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌ను 733 ఎకరాలతో ల్యాండ్ పూలింగ్ స్కీమ్‌లో భాగంగా ఉమ్మడి రాష్ట్రంలో చేపట్టగా, అదే తరహాలో స్వరాష్ట్రంలోనూ ఎనిమిదేళ్ల క్రితం తీసుకొచ్చారు. నాటి చట్టం ప్రకారం ఇన్ముల్ నర్వ (95 ఎకరాలు), లేమూరు (84 ఎకరాలు)లో లే అవుట్‌లు అభివృద్ధి చేయగా, ప్రతాపసింగారం (110 ఎకరాలు)లో పనులు చేపట్టాల్సి ఉన్నది. ఈ స్కీమ్ వచ్చిన ఎనిమిదేళ్లలో మూడు ప్రాంతాల్లో 289 ఎకరాలే సేకరించారు. 2017లో ఉన్న కొన్ని నిబంధనలు ప్రభుత్వానికి, రైతులకు ఇబ్బందికరంగా మారాయి. కేవలం పట్టా భూములకే అవకాశం కల్పించారు. అసైన్డ్, సీలింగ్ భూములు సేకరించే అవకాశం లేదు.దేశంలోని పలు నగరాల్లోని డెవలప్‌మెంట్ అథారిటీలకు ల్యాండ్ పూలింగ్ స్కీమ్ వరంగా మారింది. ప్రధానంగా మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్(తదితర రాష్ట్ర ప్రభుత్వాలు ల్యాండ్ పూలింగ్ స్కీమ్‌కు నోటిఫికేషన్ వేయగానే రైతులు స్వచ్ఛందంగా భూములిచ్చి పరిహారంగా మరోచోట అభివృద్ధి చేసిన మరింత భూమిని తీసుకుంటున్నారు. అక్కడి ప్రభుత్వానికి, స్థానిక సంస్థలకు పెద్దఎత్తున ల్యాండ్ బ్యాంకు అందుబాటులోకి వస్తోంది. ఆయా రాష్ట్రాల్లో ల్యాండ్ పూలింగ్ స్కీమ్‌కు రైతులు, ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తుండడంతో 2017లో రాష్ట్ర ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ స్కీమ్‌ను తెలంగాణలో అమలు చేసేందుకు మార్గదర్శకాలతో ఉత్తర్వులిలిచ్చింది. కానీ ఇప్పటి వరకు కేవలం హెచ్ఎండీఏ పరిధిలో మినహా రాష్ట్రంలో ఎక్కడా ల్యాండ్ పూలింగ్ స్కీమ్‌ను అమలు చేయలేదు. హెచ్ఎండీఏ పరిధిలో కూడా ఆశించిన ప్రయోజనాలు నెరవేరలేదు.రాష్ట్రం మొత్తం కాకుండా విస్తరించిన హెచ్ఎండీఏ పరిధి 10,472 చదరపు కిలోమీటర్లలో ల్యాండ్ పూలింగ్ స్కీమ్‌ను పకడ్బందీగా అమలు చేయడానికి అధికారులు సరికొత్త సంస్కరణలను తీసుకొస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ల్యాండ్‌పూలింగ్ ఏరియా డెవలప్‌మెంట్ (ఎల్‌పీఏడీ) ముసాయిదా చట్టాన్ని తీసుకురావాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. హెచ్ఎండీఏ పరిధిలో జాతీయ, రాష్ట్రీయ రహదారులతో పాటు ప్రధాన ప్రాంతాల రహదారుల వెంట ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి తీసుకురావాలని భావిస్తోంది.ఈ చట్టానికి అవసరమైన నియమాలు, మార్గదర్శకాలు రూపొందించడానికి ఓ కన్సల్టెన్సీని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం హెచ్ఎండీఏకు ఆదేశాలిచ్చింది. విస్తరించిన హెచ్ఎండీఏ పరిధిని ఆధారంగా చేసుకొని ల్యాండ్‌పూలింగ్ ఏరియా డెవలప్‌మెంట్ ముసాయిదా చట్టం ఉండాలని, ఈ చట్టానికి దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న మార్గదర్శకాలు, నియమాలను జోడించాలని సూచించినట్లు తెలిసింది.ముసాయిదా చట్టానికి అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయడానికి హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో కన్సల్టెన్సీ నియామకానికి చర్యలు చేపట్టారు. ఆరు నెలల్లో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని టెండర్ నోటిఫికేషన్‌లో నిర్ణయించారు. శివారు ప్రాంతాల్లో ల్యాండ్ బ్యాంక్ పెంచడానికి, టౌన్‌షిపలను తీసుకురావడానికి ల్యాండ్ పూలింగ్ ఏరియా డెవలప్‌మెంట్ (చట్టం) ఉపయుక్తంగా మారుతుందని హెచ్ఎండీఏ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

## సిగాచి పరిశ్రమలో నిలిచిన సహాయక చర్యలు



**సంగారెడ్డి-నవభూమి:** పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో సహాయక చర్యలు నిలిచిపోయాయి. రాత్రి కురిసిన వర్షానికి సహాయక చర్యలకు ఆటంకంగా మారింది. మూడంతస్తుల భవనం శిథిలాల తొలగింపు పనులు ప్రారంభం కాలేదు.గల్లంతైన వారు ఈ శిథిలాల కింద ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఉన్నతాధికారులు వచ్చాకే సహాయక చర్యల పై ఒక క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.కాగా, సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో సోమవారం ఉదయం చోటు చేసుకున్న ప్రమాదం తెలుగు రాష్ట్రాల్లో విషాదం నింపింది. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే ఇది అతిపెద్ద ప్రమాదం. ప్రమాదంలో మృతి చెందిన వారి సంఖ్య 51కి పెరిగింది. శిథిలాలను తొలగిస్తున్న కొద్దీ కార్మికులు, సిబ్బంది మృతదేహాలు వెలికి వస్తూనే ఉన్నాయి. ప్రమాదంలో 36 మంది మరణించినట్టు మంగళవారం సాయంత్రం అధికారులు ప్రకటించారు. ఇప్పటి వరకు 14 మందిని గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మిగతా వారిని గుర్తించాల్సి ఉన్నది.

## మేడారం సమ్మక్క, సారలమ్మ మహా జాతర తేదీలను ఖరారు చేసిన పూజారులు



**ములుగు-నవభూమి:** తెలంగాణ కుంభమేళగా పేరుగాంచిన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర తేదీలు ఖరారు అయ్యాయి. మేడారంలో సమ్మక్క, సారాలమ్మ మహా జాతర తేదీలను అక్కడి పూజారుల సంఘం ప్రకటించింది. 2026 జనవరి 28వ తేదీన(బుధవారం) శ్రీ సారాలమ్మ దేవత, 29న సమ్మక్క దేవతలు (గురువారం) వారివారి గద్దెల మీదకు చేరుకుంటారు. 30వ తేదీన (శుక్రవారం) మొక్కులు చెల్లించుట, 31వ తేదీన (శనివారం) సమ్మక్క, సారలమ్మ వనదేవతలు, గోవింద రాజు, పగిడిద్దరాజు దేవుళ్ల వన ప్రవేశం చేయడం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పూజారులు నిర్ణయించారు.

## బీజేపీ ఎంపీ డీకే అరుణకు పార్టీలో మరో కీలక పదవి



**మహబూబ్‌నగర్-నవభూమిబ్యూరో:** బీజేపీ ఎంపీ డీకే అరుణకు పార్టీలో మరో కీలక పదవి దక్కింది. ఆమె బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా నియమితులయ్యారు. ప్రస్తుతం ఆమె పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా, ఫుడ్ కార్పొరేషన్ తెలంగాణ ఛైర్మన్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. ఆమెతో పాటు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జి. పద్మజారెడ్డి కూడా జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా ఎంపికయ్యారు. వీరు మూడేళ్ల పాటు ఈ పదవుల్లో కొనసాగుతారు. మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ డీకే అరుణకు పార్టీలో మరో కీలక పదవి దక్కింది. ఇప్పటికే ఆమె ఫుడ్ కార్పొరేషన్ తెలంగాణ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా పార్టీ పరంగా మరో కీలక పదవి దక్కింది. బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా డీకే అరుణ నియమితుల య్యారు. ఆమెతో పాటుగా ప్రస్తుత రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జి. పద్మజారెడ్డి బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా నియమితులయ్యారు. ఈ నియామకాలను హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన రాష్ట్ర సమావేశంలో ఎన్నికల కన్వీనర్ యెండల లక్ష్మీనారాయణ ప్రకటించారు. ఈ పదవులలో వారు మూడేళ్ల పాటు కొనసాగుతారు. డీకే అరుణ ఇప్పటికే బీజేపీలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆమె ప్రస్తుతం పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా, ఫుడ్ కార్పొరేషన్ తెలంగాణ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఆమె జాతీయ కౌన్సిల్‌కు ఎంపిక కావడం ద్వారా పార్టీలో ఆమె ప్రాధాన్యత మరింత పెరిగింది.

**జి. పద్మజారెడ్డి రాజకీయ నేపథ్యం**

జి. పద్మజారెడ్డి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన సీనియర్ బీజేపీ నాయకురాలు. ఆమె కార్యకర్త స్థాయి నుండి అంచెలంచెలుగా ఎదిగారు. ఆమె గతంలో 2014-16 వరకు మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలిగా, మహిళా మోర్చా జాతీయ కార్యదర్శిగా, 2016-19 వరకు పార్టీ జిల్లా అధ్యక్షురాలిగా పనిచేశారు. ఎన్నికల విషయానికి వస్తే ఆమె 1994లో కొల్లాపూర్, 2009, 2018లో మహబూబ్‌నగర్ అసెంబ్లీ స్థానం నుండి బీజేపీ తరపున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆమెకు లభించిన ఈ జాతీయ స్థాయి పదవి జిల్లాలోని పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది.మహబూబ్‌నగర్ జిల్లా నేతలకు జాతీయ స్థాయిలో పదవులు లభించడంపై పార్టీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్‌కుమార్, కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇతర నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నియామకాలు తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేస్తాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక తెలంగాణ బీజేపీ నూతన అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ నేత ఎన్. రాంచందర్‌రావు నియమితులైన సంగతి తెలిసిందే. అధ్యక్ష పదవికి ఆయన ఒక్కరే నామినేషన్ వేయటంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవం అయింది. మంగళవారం అధ్యక్షుడిగా ఆయన బాధ్యతలు సైతం స్వీకరించారు.

# వికాసం వైపు అడుగులు

**(1వపేజీ తరువాయి)**పథకం కింద సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. బీసీలకు రాయితీ కింద సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. సూర్య ఘర్ పథకాన్ని పూర్తిగా వినియోగించు కుంటే కరెంటు కోతల పరిస్థితి ఉండదని.. అలాగే విద్యుత్ ఛార్జీలు కట్టే పరిస్థితి కూడా ఉండదన్నారు.

కుప్పంలో ఏసీల అవసరం ఉండదు కానీ.. అవసరమైతే ఏసీలకు సోలార్ విద్యుత్ పెట్టుకో వచ్చునని ఈ సందర్భంగా ప్రజలకు ఆయన సూచించారు. ఇళ్లకే కాదు వ్యవసాయానికి సైతం సోలార్ విద్యుత్ వినియోగించుకోవాలన్నారు. వ్యవసాయ మోటార్లకు సోలార్ ప్యానెళ్లు బిగించుకోవచ్చునని.. కేంద్ర ప్రభుత్వ పథకం కింద మోటార్లకు సోలార్ ప్యానెళ్లు బిగిస్తామని వివరించారు.

ఇక కుప్పం రైల్వేస్టేషన్ ఆధునీకరిస్తామన్నారు. చెన్నై, బెంగళూరు వెళ్లే వారికి ఇది మరింత సౌకర్యంగా ఉంటుందన్నారు. పలమనేరు నుంచి కృష్ణగిరి వరకు నాలుగు లేన్ల రహదారి నిర్మిస్తున్నామని తెలిపారు. కుప్పం నుంచి హొసూర్ వరకూ మరో సమాంతర రహదారి నిర్మిస్తామని ఆయన ప్రకటించారు. కృష్ణగిరి, బెంగళూరు, కోలార్, చెన్నైలకూ మధ్య కేంద్రంగా కుప్పం మారబోతుందని వివరించారు. కుప్పంలో బ్రహ్మాండమైన అభివృద్ధి జరగబోతోందన్నారు. కుప్పం రూపురేఖలు మార్చేందుకు ఒక అద్భుతమైన ప్రణాళిక తయారు చేశామని సీఎం చంద్రబాబు ప్రకటించారు.

గత వైసీపీ ప్రభుత్వం విధ్వంసం చేసిన రాష్ట్రాన్ని వికాసం వైపుగా నడుపుతున్నామన్నారు. సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా మీ ముందుకు వచ్చానని వివరించారు. దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా కుప్పాన్ని తయారు చేస్తామని స్పష్టం చేశారు. రూ. 3,890 కోట్ల వ్యయంతో హంద్రీనీవా పనులు పూర్తి చేస్తున్నామన్నారు. కుప్పంలో చివరి ఆయకట్టు వరకూ నీళ్లు తీసుకు వస్తామని ప్రజలకు ఆయన భరోసా ఇచ్చారు.

ఈ ఏడాదిలోనే కుప్పం నియోజకవర్గానికి హంద్రీనీవా నీళ్లు పారిస్తామన్నారు. అభివృద్ధి చేసే వారికి మాత్రమే సంక్షేమం గురించి మాట్లాడే హక్కు ఉంటుందని తెలిపారు. అప్పు చేసి సంక్షేమం చేస్తామనటం ఏం పరిపాలన..? అని ప్రశ్నించారు. అప్పు తెచ్చి అభివృద్ధి చేసి.. దీని ద్వారా వచ్చిన ఆదాయాన్ని సంక్షేమానికి ఖర్చు చేయటమే నిజమైన ఆర్థిక వ్యవస్థ అని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు అభివర్ణించారు.

## నిర్లక్ష్యం వల్లే సిగాచి ప్రమాదం

**(1వపేజీ తరువాయి)**భారీ పేలుడు పెను విషాదాన్ని మిగిల్చింది. ఈ ఘటనలో ఇప్పటివరకు మృతుల సంఖ్య 40కి చేరినట్లు సిగాచి కంపెనీ స్వయంగా ప్రకటించింది. మరో 33 మందికి గాయాలైనట్లు వెల్లడించింది. ఈ దుర్ఘటనతో పారిశ్రామిక భద్రతా ప్రమాణాలపై మరోసారి తీవ్ర చర్చ మొదలైంది. కంపెనీ కీలక ప్రకటన: సిగాచి కంపెనీ ఈ ఘటనపై స్పందిస్తూ కీలక ప్రకటన చేసింది. తమ కార్యకలాపాలను 90 రోజుల పాటు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. అలాగే, ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. కోటి ఎక్స్ గ్రేషియా చెల్లించనున్నట్లు కంపెనీ సెక్రటరీ వివేక్ కుమార్ తెలిపారు. గాయపడిన వారికి పూర్తి వైద్య సేవలు అందిస్తామని, అన్ని బీమా క్లెయిమ్‌లను చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అయితే, ప్రమాదానికి రియాక్టర్ పేలుడు కారణం కాదని, ప్రభుత్వ దర్యాప్తు నివేదిక కోసం వేచి చూస్తున్నామని కంపెనీ పేర్కొంది. ఈ ప్రమాదంపై పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో పలు కీలక అంశాలు వెలుగుచూశాయి. ఫ్యాక్టరీలో తగిన భద్రతా ప్రమాణాలు పాటించలేదని పోలీసులు పేర్కొన్నారు. అగ్నిమాపక సిబ్బంది ప్రమాద స్థలానికి చేరేందుకు సరైన మార్గాలు లేకపోవడం సహాయ చర్యలకు ఆటంకం కలిగించిందని తెలిపారు. ఫ్యాక్టరీలో వాడుతున్న మెషినరీ పాతదిగా, కాలానుగుణంగా ఆధునీకరించకపోవడమే ప్రమాదానికి దారితీసిందని ఎఫ్ఐఆర్ వివరించింది. ఉద్యోగులు ఈ ప్రమాద భయాన్ని యాజమాన్య దృష్టికి తీసుకెళ్లినా, వారు ఉద్దేశపూర్వకంగా పట్టించుకోలేదని ఎఫ్ఐఆర్‌లో పేర్కొనడం గమనార్హం. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రమాద స్థలాన్ని పరిశీలించి, మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. అంతేకాకుండా, ప్రమాదంపై అత్యున్నత కమిటీతో విచారణ జరిపిస్తామని, నిపుణులతో పూర్తి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని, మృతులు, గాయపడిన వారి పిల్లల చదువుల బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. పారిశ్రామిక భద్రతా ప్రమాణాలపై రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు చేపట్టాలని కూడా ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం.లెక్కల్లో గందరగోళం.. అయోమయంలో కుటుంబాలు: సిగాచి పరిశ్రమ, అధికారుల మధ్య మృతుల సంఖ్య, ఇతర వివరాలపై గందరగోళం నెలకొంది. కంపెనీ 162 మంది కార్మికులు డ్యూటీలో ఉన్నారని చెప్పగా, అధికారులు 143 మందే ఉన్నారని పేర్కొన్నారు. మృతుల సంఖ్యపై కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కంపెనీ 40 మంది మృతిచెందారని ప్రకటించగా, కొన్ని నివేదికలు మృతుల సంఖ్య 46కు, మరికొన్ని 51కు చేరిందని సూచిస్తున్నాయి. ఈ లెక్కల్లో తేడాతో బాధిత కుటుంబాల్లో అయోమయం నెలకొంది.

## బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు 6 నెలల జైలుశిక్ష

- **కోర్టు ధిక్కరణ కేసులో అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ తీర్పు**

**ఢాకా-నవభూమిబ్యూరో**

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, అవామీ లీగ్ అధినేత్రి షేక్ హసీనాకు కోర్టు ధిక్కరణ కేసులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో ఆమెను దోషిగా తేల్చిన బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ (ఐసీటీ), బుధవారం ఆమెకు ఆరు నెలల జైలు శిక్ష విధించింది. దాదాపు ఏడాది క్రితం దేశంలో తీవ్ర నిరసనల మధ్య ఆమె ప్రభుత్వం కూలిపోయి, దేశం విడిచి వెళ్లిన తర్వాత ఒక కేసులో ఆమెకు శిక్ష పడటం ఇదే మొదటిసారి.ఢాకా ట్రిబ్యూన్ పత్రిక కథనం ప్రకారం, జస్టిస్ ఎండీ గోలాం మొర్తజా మొజుందర్ నేతృత్వంలోని అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్-1కు చెందిన ముగ్గురు సభ్యుల ధర్మాసనం ఈ సంచలన తీర్పును వెలువరించింది. ఇదే కేసులో సంబంధం ఉన్న గైబంధా ప్రాంతానికి చెందిన షకీల్ ఆకంద్ బుల్బుల్‌కు కూడా రెండు నెలల జైలు శిక్ష విధించినట్లు ట్రిబ్యునల్ స్పష్టం చేసింది.

షేక్ హసీనా ప్రస్తుతం కేవలం కోర్టు ధిక్కరణ కేసులోనే కాకుండా, అంతకంటే తీవ్రమైన ఆరోపణలను కూడా ఎదుర్కొంటున్నారు. గత ఏడాది తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన భారీ నిరసనల సమయంలో అమానవీయ రీతిలో నేరాలకు పాల్పడ్డారంటూ ఆమెపై అధికారికంగా అభియోగాలు నమోదయ్యాయి. నిరసనకారులపై షేక్ హసీనా 'పద్ధతి ప్రకారం దాడులు' చేయించారని ఐసీటీ చీఫ్ ప్రాసిక్యూటర్ మహమ్మద్ తాజుల్ ఇస్లాం ఆరోపించారు.

ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కార్యాలయం నివేదిక ప్రకారం, 2024 జూలై 15 నుంచి ఆగస్టు 15 మధ్య జరిగిన ఆ హింసాత్మక ఘటనల్లో సుమారు 1,400 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అంచనా. అయితే, తనపై మోపిన అన్ని ఆరోపణలను షేక్ హసీనా మొదటి నుంచి ఖండిస్తూ వస్తున్నారు. ఈ ఆరోపణలపై వాదనలు వినిపిస్తామని ఆమె తరఫు న్యాయవాది అమీర్ హుస్సేన్ మీడియాకు తెలిపారు. 2024 ఆగస్టులో దేశవ్యాప్త ఆందోళనలతో అవామీ లీగ్ ప్రభుత్వం అనూహ్యంగా కూలిపోవడంతో షేక్ హసీనా బంగ్లాదేశ్ విడిచిపెట్టి భారతదేశానికి చేరుకున్నట్టు కథనాలు వచ్చాయి.

## జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో శంషాబాద్ యువకుల సత్తా

- **2 కాంస్య పథకాలు, ఒకటి రజతం పతకాలు కైవసం**

**రాజేంద్రనగర్, జూలై 02 (నవభూమి):** ఇటీవల కర్ణాటక రాష్ట్రం దవనగిరిలో జరిగిన 53వ పురుషుల, 43వ మహిళ సీనియర్, 47వ పురుషులు, 32వ మహిళల జూనియర్, 26వ బాలుర, బాలికల సబ్ జూనియర్ జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలలో శంషాబాద్ కు చెందిన యువకులు సత్తా చాటారు మూడు పథకాలను కైవసం చేసుకున్నారు.

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ లోని యాదవ్ ఫిట్నెస్ జోన్ శంషాబాద్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన ముగ్గురు యువకులు కర్ణాటకలో జరిగిన జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొని శంషాబాద్ కు చెందిన దన్నాడ ప్రవీణ్ యాదవ్ సీనియర్ పోటీల్లో 83 కిలోల పవర్ లిఫ్టింగ్ లో విజయం సాధించారు కాంస్య పథకం, స్క్వాట్, రజతం కైవసం చేసుకున్నారు. జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీలో 93 వెయిట్ ఎత్తి గాజుల భరత్ కాంస్య పథకం సాధించారు. సబ్ జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని 93 కిలోలు బరువు ఎత్తి నవరతన్ కాలియా అనే యువకుడు బ్రాంచ్ రజత పథకం సాధించారు.జాతీయస్థాయిలో పవర్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొని పథకాలు సాధించిన ముగ్గురు విజేతలను యాదవ్ ఫిట్నెస్ జోన్ శంషాబాద్ జిమ్ తరఫున అభినందించారు.



## ఏపీ కేడర్ ఐపీఎస్ అధికారి సిద్ధార్థ్ కౌశల్ రాజీనామా!

**సర్వీస్ ఉండగానే ఐపీఎస్‌కు గుడ్‌బై చెప్పిన సిద్ధార్థ్ కౌశల్**

**డీజీపీకి రాజీనామా లేఖ పంపిన ఐపీఎస్ అధికారి**

**వ్యక్తిగత కారణాల వల్లే రాజీనామా చేశానని వెల్లడి**

**అమరావతి-నవభూమిబ్యూరో:** ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి సిద్ధార్థ్ కౌశల్ తన సర్వీసుకు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. రెండు దశాబ్దాలకు పైగా పోలీస్ శాఖలో అందించిన సేవలకు ఆయన ముగింపు పలికారు. ఇది పూర్తిగా తన వ్యక్తిగత నిర్ణయమని, ఎలాంటి ఒత్తిళ్లు లేవని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.చాలాకాలంగా ఆలోచించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నానని సిద్ధార్థ్ కౌశల్ తన ప్రకటనలో తెలిపారు. తన భవిష్యత్ జీవిత లక్ష్యాలకు, కుటుంబ సభ్యుల ఆకాంక్షలకు అనుగుణంగానే సర్వీసు నుంచి వైదొలగుతున్నట్లు వివరించారు. కొన్ని మీడియా మాధ్యమాల్లో వస్తున్నట్లుగా వేధింపులు లేదా బాహ్య ఒత్తిళ్ల కారణంగా తాను రాజీనామా చేశానన్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. "ఈ వార్తలు పూర్తిగా నిరాధారమైనవి, తప్పుదారి పట్టించేవి. నా నిర్ణయం పూర్తిగా స్వతంత్రమైనది, వ్యక్తిగతమైనది, స్వచ్ఛందమైనది" అని ఆయన స్పష్టం చేశారు.ఆంధ్రప్రదేశ్‌లో పనిచేయడం ఒక గౌరవంగా భావిస్తున్నానని కౌశల్ పేర్కొన్నారు. "ఐపీఎస్ అధికారిగా పనిచేయడం నా జీవితంలో అత్యంత సంతృప్తినిచ్చిన, విలువైన ప్రయాణం. నేను ఈ రాష్ట్రాన్ని ఎప్పుడూ నా సొంతిల్లుగానే భావించాను. ఇక్కడి ప్రజలు ఎప్పటికీ నా హృదయంలో ప్రత్యేక స్థానంలో ఉంటారు" అని ఆయన అన్నారు. తన వృత్తి జీవితంలో తనకు సహకరించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, సీనియర్ అధికారులకు, సహోద్యోగులకు, సిబ్బందికి, రాష్ట్ర ప్రజలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. "మీ మద్దతు, విశ్వాసమే నన్ను ఒక అధికారిగా, వ్యక్తిగా తీర్చిదిద్దాయి" అని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ కొత్త మార్గాల్లో సమాజానికి సేవ చేస్తానని సిద్ధార్థ్ కౌశల్ ఆశాభావం వ్యక్తం చేశారు. 2012 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన సిద్ధార్థ్ కౌశల్, గతంలో కృష్ణా, ప్రకాశం, వైస్సార్ కడప జిల్లాల ఎస్పీగా, రాష్ట్ర లా అండ్ ఆర్డర్ ఐజీగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన తన అధికారిక ప్రకటనలో భవిష్యత్ ప్రణాళికల గురించి ఏమీ ప్రస్తావించనప్పటికీ, ఢిల్లీ కేంద్రంగా ఒక కార్పొరేట్ సంస్థలో చేరవచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే ఈ వార్తలపై ఎలాంటి అధికారిక సమాచారం లేదు.

## రెంటపాళ్ల సీన్ రివర్స్?

**(1వపేజీ తరువాయి)**ప్రమాదం తర్వాత సింగయ్యను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు వైసీపీ నాయకులు సిద్ధమైతే, పోలీసులు బలవంతంగా అంబులెన్సు వచ్చే వరకు ఆపారని, ఆటో లేదా మరే వాహనంలో సింగయ్యను ఆస్పత్రికి తీసుకుపోవద్దని, కచ్చితంగా అంబులెన్సులోనే తీసుకెళ్లాలని పోలీసులు బలవంతం చేశారన్నారు. అందుకే ఆ అంబులెన్సులోనే ఏదో జరిగిందని అనుమానాలు వస్తున్నాయని లూర్దుమేరీ ఆరోపించారు. అనంతరం జగన్ టూర్ లో గుండెపోటుకు గురై చనిపోయిన సత్తెనపల్లికి చెందిన పాపసాని వెంకట జయవర్ధన్ రెడ్డి తల్లిదండ్రులు సావిత్రి, భాస్కర్ రెడ్డి, సోదరుడు మణికంఠ రెడ్డి, కుటుంబ సభ్యులు కలిశారు. జయవర్ధన్ కుటుంబానికి ఇప్పటికే వైసీపీ రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించింది. జగన్‌ను కలిసిన జయవర్ధన్ కుటుంబం.. తమ కుమారుడి మరణంపై తప్పుడు కథనాలు వద్దని కోరింది. జగన్నను చూసేందుకే తమ కుమారుడు అక్కడికి వెళ్లాడని, అక్కడ ఉద్వేగానికి లోనై గుండెపోటుకు గురయ్యాడని తండ్రి భాస్కర్ రెడ్డి వెల్లడించారు. ఇది ఎవరి తప్పిదం కాదని, తప్పుడు కథనాలు రాయొద్దని కోరారు.

## మెడికల్ టూరిజం హబ్‌గా తెలంగాణ

**(1వపేజీ తరువాయి)**డంలో సహకరించాలని, ఇందులో భాగస్వామ్యు లు కావాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి.. డాక్టర్ నాగేశ్వర్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించాలనే ఉద్దేశంతో గతంలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రవేశపెట్టిం దని రేవంత్ గుర్తు చేశారు. పేదల వైద్యానికి తమ ప్రభు త్వం వెనుకాడట్లేదని, తమ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత 1,400 కోట్ల రూపాయలకు పైగా మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి విడుదల చేశామని అన్నారు. మహిళలు అధికంగా క్యాన్సర్ బారిన పడుతున్న నేపథ్యంలో- దీన్ని పరిష్కరించడానికి కొన్ని నిర్ణయాలు తీసుకున్నామని రేవంత్ రెడ్డి చెప్పారు. స్వయం సహాయక గ్రూపుల్లో ఉండే మహిళలందరికీ హెల్త్ ప్రొఫైల్‌ను తయారు చేయనున్నామని అన్నారు. మారుమూల గ్రామాల్లో ఉండే మహిళలు సైతం ఈ యూనిక్ కార్డు ద్వారా కార్పొరేట్ వైద్యాన్ని పొందగలుగుతారని చెప్పారు. గతంలో ఆ మహిళ ఎలాంటి ట్రీట్మెంట్ తీసుకుంది?, ఫ్యామిలీ హెల్త్ హిస్టరీ ఏమిటీ?, ఇప్పుడు అందించాల్సిన వైద్యం ఎలాంటిది? అనేది తెలుసుకోవడం డాక్టర్లకు సులభతరమౌతుందని అన్నారు. హెల్త్ ప్రొఫైల్ కార్డుల వల్ల నాణ్యమైన వైద్యాన్ని తక్కువ ఖర్చుతో అందించవచ్చని చెప్పారు. చావడానికే ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్తున్నామనే అభిప్రాయాల నుంచి ప్రజలను దూరం చేయాలనేదే తమ ప్రభుత్వ ఉద్దేశమని రేవంత్ రెడ్డి అన్నారు. విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోన్నామని, విద్యకు రూ. 21,500 కోట్లు, వైద్యానికి 11,500 కోట్ల రూపాయల బడ్జెట్ ను కేటాయించామని వివరించారు. ' సామాజిక బాధ్యతగా డాక్టర్లు సంవత్సరంలో ఒక్క నెల అయినా ప్రభుత్వ ఆసుపత్రుల్లో విధులు నిర్వర్తించాలని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా వారికి విజ్ఞప్తి చేశారు. 11 నెలలు తమకు ఇష్టమైన చోట, ఇష్టమైన జీతాన్ని తీసుకోవచ్చని, మిగిలిన ఆ ఒక్క నెల మాత్రం రాష్ట్రంలో ఏదైనా ఒక ప్రభుత్వ ఆసుపత్రిని ఎంపిక చేసుకుని, అక్కడికి వెళ్లి పేదలకు వైద్యాన్ని అందించాలని కోరారు. విదేశాల్లో నివసించే తెలంగాణకు చెందిన డాక్టర్లు.. ఇక్కడికి వచ్చినప్పుడు ఒక్క వారం రోజులైనా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి సేవలను అందించాలని రేవంత్ రెడ్డి సూచించార. దీనికి అవసరమైన ఏర్పాట్లు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచలను ఇవ్వొచ్చనీ చెప్పారు. వైద్యరంగంలో ఎంతో సేవలను అందిస్తూ వచ్చిన డాక్టర్ నాగేశ్వర్ రెడ్డికి కేంద్ర ప్రభుత్వం పద్మ విభూషణ్ అవార్డు ఇచ్చి సత్కరించిందని, ఆయనకు భారతరత్న పురస్కారాన్ని అందజేయాల్సిన అవసరం ఉందని రేవంత్ రెడ్డి చెప్పారు. డాక్టర్ నాగేశ్వర్ రెడ్డికి భారతరత్న పురస్కారం కోసం ఒక ముఖ్యమంత్రిగా, ప్రభుత్వం తరఫు నుంచి అవసరమైన ప్రయత్నాలు చేస్తానని అన్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 హైదరాబాద్ గురువారం 03। జూలై। 2025

## రూల్స్‌కు విరుద్ధంగా ఉన్న ఆ కారు నాకొద్దు, ఫైన్ వేయండి.. పోలీస్ కమిషనర్‌కు మంత్రి లేఖ



**న్యూఢిల్లీ-నవభూమి:** చాలామంది ఓపికపట్టలేక ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తారు. ఆపైన చలాన్‌లు ఎగ్గొట్టడానికి ప్రయత్నిస్తారు. అయితే యూపీకి చెందిన ఓ మంత్రి మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించారు. తనకు కేటాయించిన ఓ కారు నిబంధనలకు అనుగుణంగా లేకపోవడంతో ఆ కారులో వెళ్లేందుకు నిరాకరించారు. అంతేగాక ఆ కారుకు జరిమానా విధించాలని పోలీసులను కోరారు. ఈ మేరకు ఏకంగా వారణాసి పోలీస్ కమిషనర్ కే లేఖ రాశారు. వివరాల్లోకి వెళ్తే.. ఉత్తర్‌ప్రదేశ్ సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి అసిమ్ అరుణ్ ఇటీవల వారణాసిలో పర్యటించారు. ప్రొటోకాల్ ప్రకారం ఈ పర్యటన కోసం అధికారులు ఆయన ఇన్నోవా కారును కేటాయించారు. ఆ కారుపై నిబంధనలకు విరుద్ధంగా బుగ్గ లైట్ ఉండటంతో మంత్రి ఆ కారులో వెళ్లేందుకు నిరాకరించారు. విషయాన్ని వారణాసి పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. రూల్స్‌కు వ్యతిరేకంగా ఉన్న ఆ కారుపై జరిమానా విధించాలని కోరుతూ లేఖ రాశారు.'రూల్స్ ప్రకారం కారుపై నీలం రంగు బుగ్గ లైట్లు ఉండకూడదు. వాటిపై కోర్టు నిషేధం ఉంది. అయినప్పటికీ చాలామంది తమ దర్పతి చూపించుకోవడానికి ఇలాంటి లైట్లు, స్టిక్కర్లు వినియోగిస్తున్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలి' అని మంత్రి తన లేఖలో కోరారు. వారణాసిలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన ఓ సదస్సులో పాల్గొనడానికి మంత్రి వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మంత్రి అరుణ్ మాజీ ఐపీఎస్ అధికారి. ఆయన తండ్రి కూడా గతంలో యూపీ డీజీపీగా బాధ్యతలు నిర్వహించారు.

## మధ్యతరగతి ప్రజలకు జీఎస్టీ రిలీఫ్..

### ఆ వస్తువులపై పన్ను తగ్గించే యోచనలో కేంద్రం..?



**న్యూఢిల్లీ-నవభూమి:** ఈ ఏడాది ఆరంభంలో ఆదాయ పన్నులో రాయితీలతో వేతన జీవులకు కొంత ఊరట కల్పించిన కేంద్ర ప్రభుత్వం తాజాగా మరో శుభవార్త చెప్పేందుకు సిద్ధమవుతోంది. నిత్యావసర వస్తువులపై వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) భారాన్ని తగ్గించాలని యోచిస్తున్నట్లు తెలిసింది. మధ్యతరగతి తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలు ఎక్కువగా వినియోగించే వస్తువులపై ప్రస్తుతం 12 శాతంగా ఉన్న జీఎస్టీ శ్లాబును పూర్తిగా తొలగించడం లేదా ఈ శ్లాబులోని పలు వస్తువులను 5 శాతం శ్లాబులోకి మార్చడం వంటి ప్రతిపాదనలను కేంద్రం పరిశీలిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి.

టూత్‌పేస్ట్, టూత్ పౌడర్, గొడుగులు, కుట్టు మిషన్లు, ప్రెజర్ కుక్కర్లు, వంట పాత్రలు, గీజర్‌లు, తక్కువ సామర్థ్యం కలిగిన వాషింగ్ మెషీన్లు, ఎలక్ట్రిక్ ఐరన్ బాక్స్‌లు, సైకిళ్లు, రూ.1,000 కంటే ఎక్కువ ధర ఉన్న రెడీమేడ్ దుస్తులు, రూ.500 నుంచి రూ.1,000 మధ్య గల చెప్పులు, స్టేషనరీ వస్తువులు, వ్యాక్సిన్‌లు, సిరామిక్ టైల్స్, వ్యవసాయ ఉపకరణాలు వంటివి జీఎస్టీ తగ్గింపు జాబితాలో ఉన్నట్లు సదరు వర్గాలు తెలిపాయి. ఈ నిర్ణయం అమలైతే ప్రతిపాదిత జాబితాలోని వస్తువులు తక్కువ ధరకే అందుబాటులోకి రానున్నాయి. ఈ కారణంగా పేద, మధ్య తరగతి కుటుంబాలపై కొంత భారం తగ్గనుంది. ఈ మార్పుల వల్ల ప్రభుత్వ ఖజానాపై సుమారు రూ. 40,000 కోట్ల నుంచి రూ. 50,000 కోట్ల భారం పడొచ్చని అంచనా. అయినప్పటికీ, ధరలు తగ్గితే వినియోగం పెరిగి, దీర్ఘకాలంలో పన్ను వసూళ్లు పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది. జీఎస్టీ రేట్లను హేతుబద్ధీకరిస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా ఇటీవలే పరోక్షంగా సంకేతాలిచ్చిన విషయం తెలిసిందే. రాబోయే 56వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఈ నెల చివర్లో జీఎస్టీ సమావేశం జరగొచ్చని సదరు వర్గాలు సూచిస్తున్నాయి.

## భారీ వర్షాలకు హిమాచల్ అతలాకుతలం.. 51 మంది మృతి



**సిమ్లా-నవభూమి:** హిమాచల్ ప్రదేశ్‌లో గత కొన్ని రోజులు గా భారీ వర్షాలు కురుస్తున్నా యి. ఈ వర్షాలకు ఆకస్మిక వరదలు సంభవించాయి. ఎక్కడికక్కడ కొండ చరియలు విరిగిపడుతున్నాయి. రాష్ట్రం లోని ప్రధాన నదులకు వరద ప్రవాహం పెరిగింది. పలు లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీట మునిగాయి. అనేక రోడ్లు ధ్వంసమయ్యాయి. ఈ వర్షాకాల సీజన్‌లో ఇప్పటి వరకూ 51 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తాజాగా వెల్లడించారు. హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వ రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలోని స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ జూన్ 20 నుంచి జులై 2 వ తేదీ వరకూ రాష్ట్రంలో వర్షాల కారణంగా జరిగిన నష్టంపై ఓ నివేదిక విడుదల చేసింది. ఆ నివేదికలో రాష్ట్రంలోని 12 జిల్లాల్లో ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలను వెల్లడించింది. 'ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం, పిడుగులు పడటం వంటి వర్షాల కారణంగా సంభవించిన ప్రమాదాల్లో 51 మంది మరణించారు. దాదాపు 22 మంది గల్లంతయ్యారు. మండి జిల్లాలో అత్యధికంగా 10 మంది మరణించారు. వర్షాలకు సంబంధించిన ఘటనల్లో 103 మంది గాయపడ్డారు' అని సదరు నివేదికలో వెల్లడించింది.

## పేపర్ చదువుతూ కూర్చోగా మీదపడ్డ చెట్టు..

### ఇద్దరు మున్సిపల్ ఉద్యోగులు మృతి



**హౌరా-నవభూమి:** మున్సిపల్ కార్యాలయం ముందున్న చెట్టు కింద కూర్చుని ముగ్గురు ఉద్యోగులు పేపర్ చదువుతుండగా.. ఆ చెట్టు ఒక్కసారిగా కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని హౌరా మున్సిపల్ కార్యాలయం లో బుధవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. హౌరా మున్సిపల్ కార్పోరేషన్ చైర్మన్ సుజోయ్ చక్రవర్తి ప్రమాదంపై మాట్లాడుతూ.. మా ఉద్యోగులు ముగ్గురు చెట్టు కింద పేపర్ చదువుతూ కూర్చోగా ఆ చెట్టు కూలిపోయిందని, ఇద్దరు అక్కడికక్కడే మరణించారని, మరో వ్యక్తికి గాయాలయ్యాయని చెప్పారు. ఇది చాలా దురదృష్టకరమైన ఘటన అని సుజోయ్ చక్రవర్తి అన్నారు. మృతుల కుటుంబాలకు తాము అండగా ఉంటామని చెప్పారు. వారికి కావాల్సిన ఆర్థిక సాయం అందజేస్తామని తెలిపారు.

## అమ్మాయిపై లైంగిక దాడి.. యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నం.. లవర్ అరెస్టు

**న్యూఢిల్లీ-నవభూమి:** ఢిల్లీలోని వసంత్ కుంజ్‌కు చెందిన ఓ అమ్మాయి.. యాసిడ్ తాగి ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించింది. రిలేషన్‌లో ఉన్న వ్యక్తి ఆమెపై లైంగిక దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు మహమ్మద్ రెహాన్‌ను అరెస్టు చేశారు. పెళ్లి చేసుకుంటానని చెప్పి అమ్మాయిపై అతను లైంగిక దాడి చేశాడు. అభ్యంతరకరమైన ఫోటోలను పంపుతూ బ్లాక్‌మెయిల్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. జూన్ 18వ తేదీ అమ్మాయి ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. యాసిడ్ తాగిన ఆ అమ్మాయిని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. అయితే స్టేట్మెంట్ ఇచ్చేందుకు అప్పుడు ఆమె అన్‌ఫిట్‌గా ఉండడంతో.. నేరం జరిగిన ప్రాంతాన్ని పోలీసులు సీజ్ చేశారు. ఆ అమ్మాయి ఇంటి నుంచి యాసిడ్ బాటిల్‌ను రికవరీ చేశారు. రిహాన్‌తో రిలేషన్‌లో ఉన్న ఆ అమ్మాయి మానసిక వత్తిడికి లోనైనట్లు డీసీపీ అమిత్ గోయల్ తెలిపారు. అమ్మాయి మొబైల్ ఫోన్‌ను ఆమె తండ్రి తమకు అప్పగించినట్లు పోలీసులు చెప్పారు. దాంట్లో వాయిస్ రికార్డులు ఉన్నాయి.

## బోయింగ్ విమానంలో సాంకేతిక లోపం.. 36 వేల అడుగుల నుంచి కిందికి



**టోక్యో-నవభూమి:** అహ్మదాబాద్ విమాన ప్రమాదం యావత్ దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈప్రమాదంలో 241 మంది ప్రయాణికులు, సిబ్బందితో పాటుగా మరి కొందరు బయటి వ్యక్తులు కూడా మరణించారు. ప్రమాదం జరిగి సుమారు నెల రోజులు కావొస్తున్నా.. జనాలు ఇంకా ఆ భయం నుంచి బయటపడలేదు. పైగా విమానయానం అంటేనే భయంతో వణికిపోతున్నారు. అదలా ఉంచితే అహ్మదాబాద్ విమాన ప్రమాదం చోటు చేసుకున్న నాటి నుంచి నేటి వరకు విమానాల్లో సాంకేతిక లోపాలు తలెత్తి.. వాటిని అర్ధాంతరంగా ల్యాండ్ చేస్తున్న ఘటనలు పెరిగిపోతున్నాయి. తాజాగా మరో భయానక ఘటన వెలుగు చూసింది. సుమారు 36 వేల అడుగుల ఎత్తు నుంచి అకస్మాత్తుగా కిందకు దిగింది. దీంతో ప్రయాణికులు భయంతో ఉక్కిరి బిక్కిరి అయ్యారు. ఆ వివరాలు..ఈ సంఘటన రెండు రోజుల క్రితం అనగా జూన్ 2న చైనా, షాంగై నుంచి జపాన్ , టోక్యో వెళ్తున్న జపాన్ ఎయిర్‌లైన్స్ విమానం (జెఎల్8696) బోయింగ్ 737లో సాంకేతిక లోపం తలెత్తడంతో.. సుమారు 36 వేల అడుగుల ఎత్తు నుంచి కిందకు దిగింది. దీంతో విమానంలో ఉన్న ప్రయాణికులు తీవ్రంగా భయపడ్డారు. విమానం కూలిపోతుందని భావించిన ప్రయాణికులు తమ ఆస్తిపాస్తులు, బ్యాంక్ అకౌంట్ వివరాలు, విల్లులకు సంబంధించిన సమాచారాన్ని తమ కుటుంబ సభ్యులకు మెసేజ్ చేశారు. అయితే పైలెట్ చాకచక్యంగా వ్యవహరించడంతో ఎలాంటి ప్రమాదం జరగకుండా.. విమానం సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. ఈ విమానం జూన్ 30న షాంగై పుడోంగ్ విమానాశ్రయం నుంచి టోక్యో నరితా ఎయిర్‌పోర్టుకు బయలుదేరింది. ఈ విమానం జపాన్ ఎయిర్‌లైన్స్, దాని అనుబంధ సంస్థ స్ప్రింగ్ జపాన్ మధ్య కోడ్‌షేర్ ఒప్పందం ప్రకారం నడుస్తుంది. సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ ప్రకారం, సంఘటన చోటు చేసుకున్న సమయంలో విమానంలో 191 మంది ఉన్నారు. ప్రెస్ నివేదిక ప్రకారం.. విమానం రోజు వారి రోటిన్‌లో ప్రయాణం మొదలుపెట్టింది. అయితే గాల్లోకి ఎగిరిన కాసేపటి తర్వాత అనగా సాయంత్రం 6.53 గంటల సమయంలో విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో విమానం ఉన్నట్లుండి 36 వేల అడుగుల ఎత్తు నుంచి 10,500 అడుగుల కిందకు దిగింది. అది కూడా కేవలం 10 నిమిషాల వ్యవధిలోనే. ప్రమాదాన్ని గుర్తించిన పైలెట్ వెంటనే అప్రమత్తపై ఒసాకా, కన్సాయ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి పరిస్థితి గురించి సమాచారం అందించాడు.

విమానం కిందకు దిగుతున్న సమయంలో క్యాబిన్ ఒత్తిడి తగ్గడంతో, ఆక్సిజన్ మాస్క్‌లు అందించారు. ఫ్లైట్ అటెండెంట్ సూచనలు చేస్తుండగా.. ప్రయాణికులు ఆక్సిజన్ మాస్క్‌లు ధరించి ప్రాణాలు అర చేతిలో పట్టుకుని.. బిక్కుబిక్కుమంటూ కూర్చోవడం వీడియోలో స్పష్టంగా కనిపిస్తుంది. భయాందోళనల నడుమ రాత్రి 8:50 గంటలకు విమానం ఒసాకాలో సురక్షితంగా ల్యాండ్ అయింది. ఈఘటనలో ఎవరూ గాయపడలేదని అధికారులు తెలిపారు. విమానం ల్యాండ్ అయిన తర్వాత ప్రయాణికులకు విమానాశ్రయంలో వసతి కల్పించిన సిబ్బంది.. ఆ తర్వాత వారిని వేరే విమానాల్లో వారి వారి గమ్యస్థానాలకు చేర్చినట్లు అధికారులు వెల్లడించారు. సాంకేతిక లోపం తలెత్తడానికి గల కారణాలపై అధికారులు విచారణ చేపట్టారు.

## సైనికుడి మృతదేహంపై తలవాల్చి కన్నీరు పెట్టుకున్న అధినేత



**తూర్పు ప్యాంగ్‌యాంగ్-నవభూమి:** ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ పేరు చెబితేనే జాలి, దయ ఏమాత్రం లేని వ్యక్తిగా చాలా మందిలో ఒక అభిప్రాయం పాతుకుపోయింది. భయంకరమైన నియంతగా పేరు తెచ్చుకున్నారు. ఆయన చేసే అరాచకాలు, విధించే భయంకరమై శిక్షలు, నియంతృత్వ పోకడల గురించి నిత్యం మీడియాలో రకరకాల కథనాలు ప్రసారం అవుతుంటాయి. ఓవైపు తన దేశంలో ప్రజలు ఆకలితో అలమటిస్తున్నా.. అవేవి పట్టించుకోకుండా క్షిపణి పరీక్షల మీదనే దృష్టి సారించి విమర్శల పాలవుతుంటారు. ఇదిలా ఉంటే ఇప్పటి వరకు కిమ్ కఠినత్వాన్నే చూసిన వారు.. తాజాగా ఆయన కంటతడి పెట్టడం చూసి ఆశ్చర్యపోతున్నారు. మరి ఈ అరుదైన సంఘటన ఎప్పుడు చోటు చేసుకుంది.. కిమ్‌ని అంతలా కదిలించిన సంఘటన ఏదంటే..ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ .. రష్యా తరపున యుద్ధంలో పాల్గొని.. కన్నుమూసిన సైనికుడి మృతదేహాన్ని చూసి భావోద్వేగానికి గురయ్యారు. రష్యా, ఉత్తర కొరియా మధ్య సైనిక ఒప్పందం జరిగి సంవత్సర కాలం పూర్తయిన సందర్భంగా తూర్పు ప్యాంగ్‌యాంగ్‌లో ఒక కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో చనిపోయిన సైనికులను శవపేటికలను ప్రదర్శించారు. ఉత్తర కొరియా జాతీయ జెండా కప్పిన ఆరు శవపేటికలను చూసి చూసి కిమ్ చలించిపోయారు. ఆ సైనికుల మృతదేహాలపై చేతులు వేసి నివాళులు అర్పించారు. యుద్ధంలో మరణించిన సైనికులను తలచుకుని ఆయన తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. కంటతడి పెట్టుకున్నారు.

ఇక ఈ కార్యక్రమంలో సైనికులు తమ రక్తంతో రాసిన నోట్‌బుక్ ఫోటోలను కూడా ప్రదర్శించారు. దీన్నిచూసి ఆ హాల్‌లో ఉన్న రష్యా, ఉత్తర కొరియా అధికారులు కన్నీళ్లు పెట్టుకున్నారు. ఇదే సమయంలో కిమ్, ఆయన కుమార్తె కూడా అదే హాల్‌లో ఉన్నారు. ప్రసారం అవుతన్న దృశ్యాలను చూసి కిమ్ కూడా తీవ్ర భావోద్వేగానికి గురైనట్లు వీడియోలో స్పష్టంగా కనిపిస్తుంది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సైనికులు నోట్ బుక్‌లో తమ రక్తంతో.. నిర్ణయాత్మక సమయం వచ్చేసింది. మనపై నమ్మకం ఉంచిన సుప్రీం కమాండర్ కోసం ధైర్యంగా పోరాడాలి అని రాసుకున్నట్లు ఉంది. అయితే ఈ కార్యక్రమం ఎప్పుడు జరిగింది అనే దానిపై స్పష్టత లేదు. కానీ వీడియోలో కిమ్ జోంగ్ ఉన్, అతడి సోదరి కిమ్ యో జోంగ్ విదేశాంగ మంత్రి చోయ్ సోన్ హుయ్ సహా ఇతర అధికారులు చలికాలం దుస్తులు ధరించి ఉన్నారు. దీన్ని బట్టి చూస్తే.. సైనికుల మృతదేహాలను చాలా రోజుల క్రితమే ఉత్తర కొరియాకు పంపినట్లు అర్థం అవుతుంది. అయితే గత కొన్ని నెలలుగా ఉత్తర కొరియా తమ సైనికులు రష్యా యుద్ధంలో లేరని చెబుతూ వస్తోంది. కానీ ఇప్పుడు విడుదలైన ఈ వీడియోతో ఉక్రెయిన్ యుద్ధంలో ఉత్తర కొరియా కూడా మాస్కోకు సపోర్ట్ చేస్తున్నట్లు వెల్లడైంది. అంటే, ఉత్తర కొరియా సైనికులు కూడా ఉక్రెయిన్‌లో రష్యా తరపున పోరాడుతున్నారని అర్థం చేసుకోవచ్చు.

## ఒకే జిల్లాలో నెల రోజుల్లో 20కి పైగా గుండెపోటు మరణాలు.. విచారణకు ఆదేశించిన సీఎం



**బెంగుళూరు-నవభూమి:** కర్ణాటకను హార్ట్ ఎటాక్ భయపెడుతుంది. గత కొన్ని రోజులుగా వరుసగా యువత గుండెపోటుతో మృతి చెందడం స్థానికంగా కలకలం రేపుతుంది. కర్ణాటక యువతలో పెరుగుతున్న గుండెపోటు మరణాల పట్ల ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య ఆందోళన వ్యక్తం చేశారు. వీటికి కారణాలు గుర్తించి.. ఈ సమస్య పరిష్కారం కోసం ఒక కమిటీని కూడా నియమించారు. గత నెలలో అనగా జూన్‌లో ఒక్క హసన్ జిల్లాలోనే ఇరవై మందికి పైగా గుండెపోటు కారణంగా మరణించడం చర్చనీయాంశంగా మారింది. మంగళవారం నాడు కూడా 27 ఏళ్ల సంజయ్ అనే యువకుడు గుండెపోటుతో చనిపోయాడు. ఈ గుండెపోటు మరణాలకు గల కారణాలు, ఇందుకు పరిష్కారం చూపాలంటూ సీఎం సిద్ధ రామయ్య జయదేవ హృద్రోగ ఆసుపత్రుల డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాథ్‌ను ఆదేశించారు. ఆయన నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీని నియమించారు. పదిరోజుల్లో నివేదిక ఇవ్వాలని సీఎం ఆదేశించారు. దీని గురించి ఎక్స్ వేదికగా సిద్ధ రామయ్య పోస్ట్ చేశారు. యువకుల్లో ఆకస్మిక మరణాలపై సమగ్ర అధ్యయనం చేయాలని ఫిబ్రవరిలోనే ఆదేశాలు జారీ చేశామని సీఎం సిద్ధరామయ్య ఈ సందర్భంగా తెలిపారు. గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారిని పరీక్షించి, సమస్యలను విశ్లేషించాలని కమిటీకి సూచించారు.

కొవిడ్ టీకాల ప్రభావం, గుండె సంబంధిత సమస్యలపై అధ్యయనం కొనసాగుతోందని సీఎం వెల్లడించారు. హసన్ జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఆకస్మిక మరణాల వెనుక గల కారణాలను గుర్తించి.. వాటిని నివారించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమస్యలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని బీజేపీ నేతలపై ఆయన మండిపడ్డారు. ప్రజారోగ్యాన్ని పరిరక్షించేందుకు తమ ప్రభుత్వం హృదయ జ్యోతి, గృహ ఆరోగ్య వంటి పథకాలను అమలు చేస్తోందన్నారు.

చిన్నారులు, యువత, అమాయక ప్రజల జీవితాలు తమకు చాలా ముఖ్యమని సీఎం సిద్ధరామయ్య ఈ సందర్భంగా స్పష్టం చేశారు. హసన్ జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఈ తరహా ఆకస్మిక మరణాల వెనుక ఉన్న అసలు కారణాలను గుర్తించడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. వాటిని నివారించడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. డాక్టర్ రవీంద్రనాథ్ మార్గదర్శకత్వంలోని నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని సీఎం తెలిపారు. ఛాతిలో నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు ఉంటే వెంటనే దగ్గరలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కర్ణాటకలో ఒక్కసారిగా ఇన్ని గుండెపోటు మరణాలు నమోదు కావడం పట్ల జనాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ప్రయాణికులకు షాక్.. ఆటో ఛార్జీలను భారీగా పెంచిన ప్రభుత్వం..



**బెంగుళూరు-నవభూమి:** ఇప్పటికే పెరుగుతున్న ధరలతో సామాన్యులు అల్లాడుతుంటే.. ప్రభుత్వం ఆ భారాన్ని మరి కాస్త పెంచింది. ప్రయాణికుల జేబుకు చిల్లు పెట్టే నిర్ణయం తీసుకుంది. ఆటో ఛార్జీలను భారీగా పెంచింది. ప్రస్తుతం ఉన్న ఛార్జీల మీద ఏకంగా 20 శాతం పెంచి ఆటో డ్రైవర్లకు శుభవార్త.. సామాన్యులకు బ్యాడ్ న్యూస్ చెప్పింది ప్రభుత్వం. బస్సుల్లో ఉండే రద్దీ నేపథ్యంలో చాలా మంది క్యాబ్ కన్నా కూడా ఆటోనే బెస్ట్ అనుకుంటారు. అలాంటి వారికి ఇది భారీ షాక్ అనే చెప్పవచ్చు. అయితే మరి ఇంతకు ఆటో ఛార్జీల పెంపు ఎక్కడ జరిగింది.. ఎంత పెంచారనే వివరాలు తెలియాలంటే ఇది కర్ణాటక ప్రభుత్వం ఆటో ఛార్జీల పెంపుకు రెడీ అయ్యింది. కొన్ని నెలలుగా దీనిపై తర్జనభర్జనలు జరుగుతుండగా.. చివరకు ఆటో ఛార్జీల పెంపుకే ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీనిలో భాగంగా మొదటి 1.9 కిలోమీటర్లకు బేస్ ఛార్జీని రూ.30 నుండి రూ.36కి పెంచాలని భావిస్తుంది. ఆ తర్వాత కిలోమీటరుకు గతంలో ఉన్న రూ.15ల ఛార్జీని ఇకపై రూ.18కి పెంచాలని భావిస్తుంది. అంటే గతంలో ఉన్న ఛార్జీల మీద మొత్తంగా 20 శాతం పెంచడానికి ప్రభుత్వం రెడీ అవుతోంది. నాలుగేళ్ల తర్వాత బెంగళూరులో ఆటో ఛార్జీలు పెరగనున్నాయి. గతంలో 2021లో చివరగా ఆటో ఛార్జీలను పెంచారు. పెరిగిన ఛార్జీలు బెంగళూరులోనే అమలవుతాయని తెలిపారు. ఆటో ఛార్జీల పెంపుకు సంబంధించి జిల్లా రవాణా అథారిటీ(డీటీఏ) సమర్పించిన ఈ ప్రతిపాదనకు కర్ణాటక రవాణా మంత్రి రామలింగారెడ్డి నుండి అనుమతి లభించింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య దీన్ని ఆమోదిస్తే.. పెరిగిన ఛార్జీలు అమల్లోకి వస్తాయి. త్వరలోనే దీనిపై సీఎం సంతకం చేస్తారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. డీటీఏ నియమించిన ఐదుగురు సభ్యుల కమిటీ వివరణాత్మక అధ్యయనం తర్వాత ఛార్జీల సవరణపై సిఫార్సు చేశారు. ఈ ప్యానెల్.. ప్రయాణీకుల డిమాండ్, కార్యాచరణ సవాళ్లు, నగర ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించింది. అలానే ఈ ఏడాది మార్చి నెల ప్రారంభంలో ప్రధాన వాటాదారులతో ఛార్జీల పెంపుపై సంప్రదింపులు జరిపింది. నగరంలోని ప్రముఖ యూనియన్లు, ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ (ఏఆర్‌డీయూ), ఆదర్శ్ ఆటో, టాక్సీ డ్రైవర్స్ యూనియన్ (ఏఏటీడీయూ)లు ఆటోఛార్జీలకు సంబంధించి బేస్ ధర రూ. 40 ఆ తర్వాత ప్రతి కిలోమీటరుకు రూ. 20 పెంచాలని డిమాండ్ చేశాయి. అయితే డీటీఏ ఇంత భారీ పెంపుకు ఆమోదం తెలపలేదు. మధ్యే మార్గంగా బేస్ ధరను రూ.36కి ఆ తర్వాత ప్రతి కిలోమీటరు రూ.18 పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది జూన్ 16 నుండి ఇక్కడ బైక్ ట్యాక్సీలను నిషేధించిన సంగతి తెలిసిందే.

## సంప్రదాయం కొనసాగుతుంది..


### చైనా పాత్రను కొట్టిపారేసిన దలైలామా



**న్యూఢిల్లీ-నవభూమి:** బౌద్ధ మత గురువు దలైలామా కీలక ప్రకటన చేశారు. దలైలామా సంప్రదాయం తన తర్వాత కూడా కొనసాగనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. తనతో దలైలామా వ్యవస్థ ఆగిపోదన్నారు. ప్రస్తుతం ఉన్న 14వ దలైలామా అసలు పేరు టెంజిన్ గ్యాస్టో. టిబెట్ ఆయన స్వంత దేశం. తన తదనంతరం కాబోయే దలైలామా ఎంపికలో డ్రాగన్ దేశం చైనా పాత్ర ఏమాత్రం ఉండబోదని ఆయన అన్నారు. భవిష్యత్తు పట్టాభిషేకాన్ని దలైలామాకు చెందిన గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్టు చూసుకుంటుందన్ని ఆయన తెలిపారు.

దలైలామా వ్యవస్థ అంశంలో జోక్యం చేసుకునే అధికారం ఎవరికీ లేదని ఆయన ఆఫీసు ఓ ప్రకటనలో పేర్కొన్నది. హిమాచల్ ప్రదేశ్‌లోని మెక్‌లియోడ్‌గంజ్‌లో జరిగిన బౌద్ధ మతస్థుల మూడు రోజుల కాన్ఫరెన్స్‌లో ఈ ప్రకటన చేశారు. ఈ సమావేశానికి ఎంతో మంది బౌద్ధ మత ప్రముఖులు, విద్యావేత్తలు హాజరయ్యరయ్యారు. దలైలామా వ్యవస్థ కొనసాగుతుందని విశ్వాసం వ్యక్తం చేస్తున్నట్లు టెంజిన్ తెలిపారు. ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన బౌద్ధ సంఘాలు చేసిన విజ్ఞాపన మేరకు దలైలామా ఈ నిర్ణయం తీసుకున్నారు. గత 14 ఏళ్ల నుంచి దీనిపై ఎటువంటి బహిరంగ చర్చ జరగలేదన్నారు. 2011, సెప్టెంబర్ నుంచి దలైలామాకు ఇదే రకమైన మెసేజ్‌లు వస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత దలైలామాకు 90 ఏళ్లు నిండిన నేపథ్యంలో.. అధికార మార్పు అంశంపై బౌద్ధ వర్గాల్లో చర్చజరుగుతోంది. గ్రెగోరియన్ క్యాలెండర్ ప్రకారం జూలై ఆరో తేదీన దలైలామాకు 90 ఏళ్లు పూర్తి కానున్నాయి. టిబెట్ క్యాలెండర్ ప్రకారం మాత్రం ఆయనకు జూన్ 30వ తేదీనే 90 ఏళ్లు నిండాయి. తనకు 90 ఏళ్లు నిండిన తర్వాత టిబెట్‌లోని బౌద్ధ సంప్రదాయానికి చెందిన లామాలను సంప్రదిస్తానని, టిబెట్ బుద్ధిజంతో లింకున్న ప్రతి ఒక్కరితో దలైలామా వ్యవస్థ గురించి చర్చించనున్నట్లు ఆయన చెప్పారు. భవిష్యత్తు దలైలామాకు చెందిన నియామక ప్రక్రియ గురించి 2011, సెప్టెంబర్ 24వ తేదీన జారీ చేసిన స్టేట్మెంట్‌లో ఆ విధానం క్లియర్‌గా ఉందన్నారు. కొత్త దలైలామా నియమాక అధికారాలు.. గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్టులో ఉన్న సభ్యుల వద్ద ఆ బాధ్యత ఉన్నట్లు తెలిపారు. దలైలామా వారసత్వంలో ఉన్న ధర్మ రక్షకులను కలుసుకుని దీనిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రాచీన సంప్రదాయానికి తగినట్లు శోధించి .. భవిష్యత్తు దలైలామా ప్రకటన చేయాలన్నారు. కాబోయే దలైలామాను ఎంపిక చేసే అధికారం కేవలం గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్టుకు మాత్రమే ఉందని, మరెవరికీ దీంట్లో జోక్యం చేసుకునే వీలులేదన్నారు. దలైలామా సంప్రదాయ కొనసాగింపు అంశంలో.. చైనా నుంచి ఎవర్నీ ఎంపిక చేయరాదు అన్న నిబంధన కూడా ఉన్నది. 2011, సెప్టెంబర్ 24 నాటి ప్రకటనలో ఈ విషయం ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ ప్రక్రియ నుంచి చైనాను దూరం పెట్టాలని అమెరికా, భారత్ భావిస్తున్నాయి. కానీ 1949 నుంచి చైనా ఆక్రమణలో టిబెట్ ఉన్న విషయం తెలిసిందే.


## ఆకస్మిక మరణాలకు కొవిడ్ వ్యాక్సిన్లు కారణం కాదు : కేంద్రం



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలో ఇటీవలే ఆకస్మిక మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. చిన్న పిల్లల నుంచి యుక్త వయసువారు, వృద్ధులు ఇలా వయసుతో సంబంధం లేకుండా అకస్మాత్తుగా ప్రాణాలు కోల్పోతున్నారు. డ్యాన్స్ చేస్తూ, ఆటలు ఆడుతూ ఇలా అప్పటి వరకూ బాగానే ఉన్న వాళ్లు.. ఒక్కసారిగా కళ్లముందే కుప్పకూలి ప్రాణాలు వదులుతున్నారు. ఎక్కువగా గుండెపోటుతోనే మరణాలు సంభవిస్తున్నాయి. ముఖ్యంగా కొవిడ్ అనంతరం ఈ మరణాలు అధికమయ్యాయి. దీంతో కొవిడ్ వ్యాక్సిన్ల వల్లే ఈ మరణాలు సంభవిస్తున్నాయంటూ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అనుమానాలపై కేంద్రం తాజాగా స్పష్టతనిచ్చింది. ఆకస్మిక మరణాలకు కొవిడ్ వ్యాక్సిన్లతో ఎలాంటి సంబంధం లేదని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

ఆకస్మిక మరణాలకు కొవిడ్ టీకాలే కారణమంటూ సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్), ఢిల్లీ ఎయిమ్స్ సంయుక్తంగా లోతైన అధ్యయనాన్ని చేపట్టాయి. ఈ పరిశోధనలో భాగంగా కొవిడ్ నుంచి కోలుకున్న తర్వాత మరణించిన పలు కేసులను శాస్త్రవేత్తలు క్షుణ్ణంగా విశ్లేషించారు. వారి ఆరోగ్య నేపథ్యం, వ్యాక్సినేషన్ వివరాలు, ఇతర వైద్య సంబంధిత అంశాలను పరిశీలించారు. ఈ అధ్యయనంలో ఆకస్మిక మరణాలకు ప్రధాన కారణం బాధితులకు ముందు నుంచే ఉన్న అనారోగ్య సమస్యలే అని తేలింది. దాదాపు నెలరోజులపాటూ జరిపిన ఈ అధ్యయనంలో జన్యుపరమైన లోపాలు, తీవ్రమైన అనారోగ్య సమస్యలే కారణమని నిర్ధరణ అయ్యింది. వ్యాక్సిన్ల వల్ల కలిగే దుష్ప్రభావాల కారణంగా ఈ మరణాలు సంభవిస్తున్నాయనడానికి ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లభించలేదని నివేదిక పేర్కొంది.

## పార్లమెంట్‌లో భద్రతా ఉల్లంఘన.. ఇద్దరు నిందితులకు బెయిల్ మంజూరు



**న్యూఢిల్లీ-నవభూమి:** 2023 డిసెంబర్‌లో పార్లమెంట్‌లోని లోక్‌సభలోకి ఇద్దరు ప్రవేశించి భద్రతా ఉల్లంఘన(కు పాల్పడిన విషయం తెలిసిందే. ఆ కేసులో నిందితులు నీలం ఆజాద్, మహేశ్ కుమావత్‌లకు ఢిల్లీ హైకోర్టు ఇవాళ బెయిల్ మంజూరీ చేసింది. జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్, హరీశ్ విద్యనాథన్ శంకర్‌లతో కూడిన ధర్మాసనం నీలం, మహేశ్‌లకు ఊరట కల్పించింది. ఇద్దరికీ 50వేల పూచీకత్తుపై బెయిల్ కల్పించారు. పార్లమెంట్ దాడి ఘటన గురించి మీడియాకు ఇంటర్వ్యూలో ఇవ్వరాదు అని కోర్టు ఆదేశించింది. సోషల్ మీడియాలో పోస్టులు కూడా చేయవద్దు అని ధర్మాసనం పేర్కొన్నది. ట్రయల్ కోర్టు ఇచ్చిన బెయిల్‌ను సవాల్ చేస్తూ నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. 2001 నాటి పార్లమెంట్ దాడి ఘటనను వ్యతిరేకిస్తూ.. కొందరు నిరసనకారులు పార్లమెంట్ బిల్డింగ్‌లోకి ప్రవేశించారు. లోక్‌సభ సమావేశాలు జరుగుతున్న సమయంలో స్మోక్ కానిస్టర్లను స్ప్రే చేశారు. విజిటర్స్ గ్యాలరీ నుంచి కిందకు దూకి స్మోక్ స్ప్రే చేశారు. ఆజాద్‌ను 2023, డిసెంబర్ 13వ తేదీన అరెస్ట్ చేశారు. అతనితో పాటు సాగర్ శర్మ, మనోరంజన్ డీ, అన్మోల్ షిండేలను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఘటన జరిగిన రోజున ఆజాద్, షిండేలు పార్లమెంట్ ఆవరణలో నిరసన చేపట్టారు. లోక్‌సభ చాంబర్‌లోకి శర్మ, మనోరంజన్ ప్రవేశించారు. ఈ కుట్రలో భాగమైన ప్రధాన నిందితుడు లలిత్ ఝా, మరో నిందితుడు మహేశ్ కుమావత్‌లను కూడా పోలీసులు

## సిగాచి ప్రమాదం: భద్రత లేని బతుకులు

**పా**శ మైలారం సిగాచి ఫార్మాస్యూటికల్ ఫ్యాక్టరీలో సంభవించిన విషాద సంఘటన భారతదేశ పారిశ్రామిక భద్రతపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తింది. జూలై 1, 2025న తెల్లవారుజామున హైదరాబాద్ సమీపంలోని పాశలారం పారిశ్రామిక ప్రాంతంలోని సిగాచి ఫార్మా యూనిట్‌లో రియాక్టర్ పేలుడు సంభవించి కనీసం 45 మంది మరణించారని అధికారికంగా ప్రకటించారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సమాచారం. ఘటన చోటు చేసుకున్న సమయంలో 100 మందికి పైగా కార్మికులు పనిచేస్తుండగా, దాదాపు అరవై మందికిపైగా గాయపడినట్లు తెలిపారు. ఇప్పటికీ కొన్ని మృతదేహాలు శిలల కింద చిక్కుకుపోయి ఉండవచ్చన్న అనుమానంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటన తీవ్రత మానవ సంబంధిత బాధను మాత్రమే కాక, పారిశ్రామిక పాలన పట్ల ఉన్న అనాసక్తిని కూడా వెలుగులోకి తీసుకొచ్చింది. సిగాచి పేలుడు మనకు పారిశ్రామిక అభివృద్ధి పేరుతో మనం ఎటువంటి ప్రమాదాల వైపు దూసుకుపోతున్నామో స్పష్టం చేస్తోంది. ఒకవైపు ఉద్యోగావకాశాలు, రాష్ట్ర సంపద, స్థానిక వృద్ధి వంటి అంశాలను ప్రభుత్వాలు ప్రచారపెట్టగా, మరోవైపు కార్మికుల ప్రాణభద్రతలను నిర్వాకంగా మానుకుంటున్న తీరును ఈ సంఘటన మళ్లీ తేటతెల్లం చేసింది. పాశలారం వంటి పారిశ్రామిక వాడలలో గత పది ఏళ్లలో ఇది పదో ప్రధాన ప్రమాదం కావడం ఆ ప్రాంతంలో పరిశ్రమల నిర్వహణపై పెరిగిన అనుమానాలను సమర్థించగలగుతుంది. ప్రభుత్వ పర్యవేక్షణ యంత్రాంగాల విచక్షణారహిత తీరే ఈ విధమైన ఘోరాలను పునరావృతం చేయడానికి దోహదపడుతోంది. ప్రమాదం తర్వాత వెలుగులోకి వచ్చిన ఓ శోచనీయమైన వాస్తవం ఈ ఫ్యాక్టరీకు అంతర్జాతీయ ప్రమాణాలు గల ఐఎస్ఓ ధృవీకరణ ఉండటం. అంటే కాగితాలపై భద్రతా నిబంధనలు ఉన్నాయనిపించవచ్చు. కానీ వాస్తవంగా మాత్రం వాటి అమలులో ఘోర విఫలం జరిగినదే. ప్రమాదం జరిగిన కొద్ది రోజుల ముందు అధికార యంత్రాంగం తనిఖీలు నిర్వహించి "అన్ని సురక్షితంగా ఉన్నాయి" అన్న ధృవీకరణ కూడా ఇచ్చిందట. ఇక ఇది అనుమానాస్పదమే కాదు అవినీతిపరమైన వ్యవస్థ కుళ్లిపోయిన తీరు ఏ మేరకు వ్యాపించిందో చెప్పకనే చెప్పే ఉదాహరణ. సాంకేతికతను అభివృద్ధిచేస్తూ, రియాక్టర్ వంటి ప్రాణాంతకమైన యంత్రాల యాజమాన్యంలో సున్నితంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. కానీ మన పరిశ్రమలు ఇప్పటికీ శ్రామికుల ప్రాణాలను తక్కువగా పరిగణించేవిధంగానే పనిచేస్తున్నాయి. ఈ పేలుడు నుండి బయటపడిన చాలా మంది కార్మికులు దుర్మరణం నుంచి తప్పించుకున్నప్పటికీ, వారు చావు గాపరంగా నిలిచారు. చాలా మందికి శరీరంపై మగ్గినగాయాలు, ఊపిరితిత్తులపై ప్రభావాలు, అనేకమందికి శాశ్వతంగా పని చేయలేని స్థితి. మరికొంతమంది అశోకవనంలో మృత్యువును ఎదుర్కొన్నారు. పేలుడుతో భవనం మూడు అంతస్తులుగా కూలిపోయినదనే నిజం, పరిసరాల్లోని ఇతర భవనాలకు కలిగిన దెబ్బ, శిలల కింద చిక్కుకుపోయిన శవాలు చూస్తే ఇది కేవలం ప్రమాదం కాదు, విధ్వంసం. ప్రాణాలు పోగొట్టుకున్నవారిలో చాలామంది ఇతర రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులు కూడా ఉన్నారు గుజరాత్, బీహార్, ఒడిశా, జార?ండ్, ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రాల వారు. వారికెవరూ పెద్దగా గుర్తింపులు లేకపోవడం, డీఎన్ఏ పరీక్షల అవసరం రావడం మృతదేహాలను గుర్తించడంలో కూడా ప్రభుత్వాన్ని అయోమయానికి నెట్టింది. ఈ ఘటన పట్ల ప్రభుత్వ స్పందన, ముఖ్యంగా పరిశ్రమల శాఖ, కార్మిక శాఖల వైఖరి అసాధారణంగా తేలికపాటి వగ్గె ఉండటమే కాదు నిర్లక్ష్యపు ప్రతిబింబంగా నిలిచింది. ఈ దుర్ఘటన జరిగిన తర్వాతే అధికారులు రంగంలోకి దిగినట్లయ్యారు. పరిశ్రమలకు అనుమతులు ఇచ్చే సమయంలో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్న పాఠం ఇప్పటికీ పాలకులకు తెలినట్టుంది. హైదరాబాద్ పరిసరాల్లో పటాన్‌చేరు, పాశలారం, బాలానగర్, జీడి మెట్, కూకట్‌పల్లి వంటి ప్రాంతాల్లో గతంలో ఎన్నో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. సగటున ఏడాదికి 200 ప్రమాదాలు సంభవిస్తున్నాయని పరిశ్రమల శాఖ వెల్లడించిన గణాంకాల ప్రకారం, ఈ ప్రమాదాలు 1500 మందికి పైగా ప్రాణాలు తీసినట్లు సమాచారం. కానీ ఇప్పటికీ పరిశ్రమల యాజమాన్యాలపై చర్యలు లేవు. ఆడిటింగ్ పేరుతో జరిగే తనిఖీలు కేవలం అధికారులకి లాభసాటిగా, యాజమాన్యాలకు పాస్‌గా మారి, కార్మికులకి మాత్రం మృత్యుపాశంగా పరిణమిస్తున్నా యి. పారిశ్రామిక అభివృద్ధి అనేది ఖచ్చితంగా అవసరమే. దేశానికి విదేశీ పెట్టుబడులు, ఉత్పత్తి సామర్థ్యం పెరగడం, ఆర్థికవృద్ధికి మార్గం కావడం అన్నీ ప్రాధాన్య అంశాలే. కానీ అభివృద్ధి పేరుతో కార్మికుల ప్రాణాలను పణంగా పెట్టడం అభివృద్ధి కాదు. అది నిరంకుశత్వం. సిగాచి ఫార్మా వంటి సంస్థలకు ఐఎస్ఓ సర్టిఫికేట్ ఇచ్చిన ప్రమాణాల సమీక్షను కేంద్ర స్థాయిలో చేపట్టాలి. ప్రమాదం జరిగిన తరువాత గుర్తొచ్చే భద్రత అనే పదం ముందుగానే దృక్పథంగా ఉండాలి. ఇప్పటికీ రాష్ట్ర పరిశ్రమల శాఖ, రక్షణ వ్యవస్థ, స్థానిక పాలన రంగాల్లో సమన్వయం లేకపోవడం వల్లే ఇదంతా. ఈ అనుసంధానం లేకపోవడమే కార్మికుల ప్రాణాలను అంతులేని ప్రమాదాల్లోకి నెట్టింది. శ్రమ పరిరక్షణ చట్టాలు ఈ దేశంలో ఉన్నప్పటికీ, వాటి అమలు మాత్రం పుస్తకాలకే పరిమితమైపోయింది. ఏ ఫ్యాక్టరీలో ఎంత మంది కార్మికులు పనిచేస్తున్నారు? వారికి ప్రాథమిక భద్రతా పరికరాలు ఉన్నాయా? ప్రమాద సమయంలో అప్రమత్తమయ్యే అలారం వ్యవస్థలు అందుబాటులో ఉన్నాయా? ప్రమాద సమయంలో వారిని ఖచ్చితంగా బయటకు చేర్చే ప్రణాళికలు ఉన్నాయా? ఇవన్నీ ప్రభుత్వ తనిఖీల్లో ప్రశ్నలుగా నిలవాలి. కానీ వాస్తవంగా చూసినపుడు, కార్మికులకు వైద్య బీమా ఉండదు, ప్రాథమిక భద్రత ఉండదు. అలాంటప్పుడు ఇది బహిరంగ శవపేటికలు కాక మిగిలేంటని ప్రశ్నించాల్సిందే. ఇప్పుడు వెలుగులోకి వస్తున్న నిజాల ప్రకారం, పేలుడు జరిగిన రియాక్టర్ కొద్ది రోజులుగా లీక్ అవుతుందని ఉద్యోగులు చెప్పినట్లు తెలుస్తోంది. ఆ సమస్యను మేనేజ్‌మెంట్ దాటవేసినట్లుగా భావిస్తున్నారు. అంటే నైతిక బాధ్యత మేనేజ్‌మెంట్‌పై ఉంది. కానీ సాంకేతిక తనిఖీల నిర్వహణ బాధ్యత పరిశ్రమల శాఖపైనుంది. మానవ జీవితాలను లెక్కచేయకుండా పని చేయడమే కాక, అప్పుడు ఏం జరిగిందో తెలియకుండానే ప్రజలకు తప్పుడు ధృవీకరణలు ఇవ్వడం రెండు వైఫల్యాలు కలిసి ఈ ఘోరాన్ని కారణమయ్యాయి. ఈ నేపథ్యంలో భద్రతా ప్రమాణాలను ఉల్లంఘించిన పరిశ్రమలకు భారీ జరిమానాలు విధించడమే కాక, మేనేజ్‌మెంట్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సిన అవసరం ఉంది. ప్రమాదంలో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు తగిన న్యాయం జరగాలంటే, కేవలం పరిహారం ఇచ్చి మర్చిపోకుండా, శాశ్వత భద్రతా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాల్సిన అవసరం ఉంది. పరిశ్రమల పాలనలో పారదర్శకత తీసుకురావాలి. పరిశ్రమలకు పర్మిషన్ ఇచ్చే ముందే ఒక కమిషన్ ద్వారా భద్రతా ఆడిటింగ్ నిర్వహించాలి. తప్పుడు నివేదికలు సమర్పించే అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలి. పరిశ్రమలు బాగా నడవాలి, ఉత్పత్తులు పెరగాలి కానీ ప్రజల మృతదేహాల మీదుగా కాదు. ఇది పాలకులు, పరిశ్రమల యాజమాన్యాలు గుర్తుపెట్టుకోవాల్సిన నిజం.

# మాటల మాంత్రికుడు - డాక్టర్ బీవీ పట్టాభిరామ్



**తె**లుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన వ్యక్తి డాక్టర్ బీవీ పట్టాభిరామ్. ఆయన పేరు వినగానే గుర్తొచ్చేది మాటల మాంత్రికత్వం, వ్యక్తిత్వ వికాసం, మానసిక నిపుణత్వం, సైకాలజీ శాస్త్రంలో ప్రావీణ్యం, హిప్నాటిజం, మ్యాజిక్ కళ, రచనా పటిమ, వక్తృత్వ శక్తి. తెలుగు పత్రికా ప్రపంచం నుంచి సామాన్య జనజీవితానికి అన్ని స్థాయిల వారికీ స్ఫూర్తినిచ్చిన మహనీయుడు. నాటకీయతతో కాదు, సత్యాన్వేషణతో. వ్యక్తిగత మనోభావాలనే కాదు, సామాజిక సమస్యలను కూడా తూటాల్లా చీల్చి చెప్తూ – మార్గనిర్దేశం చేసిన జీవన శిల్పి. ఒకే వ్యక్తిలో ఈన్ని కోణాలు ఎలా ఒకే సమయానికి ప్రతిఫలించగలిగాయో – అనేదే ఒక చరిత్రాంశం.

నందమూరి తారకరామారావుతో ఆయనకు ఉన్న అనుబంధం ఒక విశేష ఘట్టం. 1980ల చివర్లో లలితకళాతోరణంలో జరిగిన మ్యాజిక్ షోలో పట్టాభిరామ్ ప్రదర్శన చూసిన నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ కడుపుబ్బ నవ్విన సందర్భాన్ని ఇప్పటికీ తెలుగు ప్రజలు మరచిపోలేరు. షో ముగిసిన అనంతరం పట్టాభిరామ్‌ను గుండెలకు హత్తుకున్న ఎన్టీఆర్, కళారూపమైన మ్యాజిక్‌ను ప్రభుత్వ ప్రచారానికి కూడా వినియోగించాలన్న ఆలోచన చేయగలగడం – పట్టాభిరామ్ ప్రదర్శనలో దాగి ఉన్న సామర్థ్యానికి నిదర్శనం. ఇది పట్టాభిరామ్ జీవనయానానికి ఒక బలమైన మలుపు. ఈ సంఘటన అనంతరం పత్రికల్లో వచ్చిన ఫోటోలు, వార్తలు ఆయనకు సామాజిక గుర్తింపును పెంచాయి. కాసు బ్రహ్మానందరెడ్డి నుంచి, అనంతరం వచ్చిన అన్ని ముఖ్యమంత్రులు, రాష్ట్రపతిగా ఉన్న అబ్దుల్ కలాం, ప్రధానిగా పనిచేసిన రాజీవ్ గాంధీ వంటి ప్రముఖులంతా పట్టాభిరామ్ ప్రతిభను చూసి ఆశ్చర్యపోయారు. దేశంలోని వివిధ ముఖ్యరాష్ట్రాల్లో, విదేశాల్లో కూడా పట్టాభిరామ్ మ్యాజిక్, హిప్నాటిజం, మానసిక శాస్త్ర ప్రదర్శనలతో ప్రజలను ఆకట్టుకున్నారు. అమెరికా, ఆస్ట్రేలియా, థాయిలాండ్, సింగపూర్, మలేషియా వంటి దేశాల్లో శ్రద్ధగా విన్న, మెచ్చుకున్న ప్రేక్షకులు ఆయన్ను గౌరవించారు. ఫ్లోరిడా విశ్వవిద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేట్ ఇచ్చింది. అమెరికాలో నాష్ విలీ, న్యూఆర్లియన్స్ నగరాల మేయర్లు పట్టాభిరామ్ షోలను చూశాక ఆయన్ను గౌరవ పౌరసత్వంతో సత్కరించారు. దేశవిదేశాల్లో ఇంత గౌరవాన్ని పొందిన తెలుగువాడు అరుదు. అయితే పట్టాభిరామ్ జీవితవెన్నెముక వ్యక్తిత్వ వికాసమే. పుస్తక రచనల ద్వారా ప్రజలను మానసికంగా మెరుగుపర్చే దిశగా ఆయన చేసిన కృషి అపూర్వం. "కష్టపడకండి, ఇష్టపడి చదవండి" అనే ఆయన నమ్మకం, రచనా శైలి వ్యాసం రాస్తే బోధనలా ఉండేది కాదు, కథలా వినిపించేది. "మాటే మంత్రం", "పతనానికి దారితీసే 11 చెడు అలవాట్లు", "విజయం మీదే", "నాయకత్వ లక్షణం విజయానికి తొలిమెట్టు", "బద్ధకం పోవాలంటే ఇది ఒక్కటి పాటించండి చాలు", "ఆనందానికి 10 చిట్కాలు" వంటి రచనలు ఒక్కో ఇంట్లో ఒక పుస్తకంలా మారాయి. ఈ రచనలు కేవలం విద్యార్థులకే కాదు ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, ఉద్యోగస్తులకు, చిన్న వ్యాపారులకు కూడా మార్గదర్శకంగా నిలిచాయి. ఆయన్ను "సైకాలజీ గురువు"గా ముద్దుగా పిలిచేవారు.

ఇంత విలువైన రచనలు కేవలం తెలుగులోనే కాకుండా, ఇంగ్లీషు, తమిళం, కన్నడ, మరాఠీ భాషల్లోనూ వెలువడ్డాయి. ఆయన రచనల పట్ల ప్రజల ఆసక్తిని చూస్తే లక్షల కాపీలు అమ్ముడుపోవడం, వారానికి ఒక్క వ్యాసం రాయడం ఓ పద్ధతిగా మారడం, సోషల్ మీడియాలో పెద్ద సంఖ్యలో అభిమానులు ఉండటం సహజంగా కనిపిస్తుంది. ఆయన ఫేస్‌బుక్ ఖాతాకు 45 వేల మంది ఫాలోవర్లు ఉండగా, ఆయన పేరుతో యూట్యూబ్‌లో నిర్వహిస్తున్న చానెల్‌కు 4.8 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ఆ చానెల్ ద్వారా 804 వీడియోలు ప్రసారం కావడం కూడా ఆయన ప్రవచనాలకు ఉన్న ఆదరణను బలంగా తెలియజేస్తుంది.

పట్టాభిరామ్ వక్తృత్వం ఒక వేరు స్థాయిలో ఉంటుంది. ఒక్క ఉపన్యాసం కూడా ప్రేక్షకుల్లో ఉత్సాహాన్ని నింపేది. ఉపన్యాసం ఎట్లా ప్రారంభించాలో, ఎట్లా కొనసాగించాలో, ఎట్లా ముగించాలో ఆయనకు అద్వితీయంగా వచ్చేది. చెప్పదలచిన విషయం ఎంత క్లిష్టమైనదైనా సరేపట్టాభిరామ్ నోటిమాటల్లో పటాపంచలవుతుంది. ఏ ముద్దులోనైనా, ఏ వయస్సులోనైనా, ఏ స్థితిలోనైనా ఆయన మాటలు కాస్త తాకితే మార్పు తప్పదు.

ఆయన రచయితగా, వక్తగా, మానసిక నిపుణుడిగా వెలుగొందడమే కాదు వ్యవస్థాత్మకంగా సేవలందించేందుకు 1991లోనే "ప్రశాంతి కౌన్సిలింగ్ అండ్ హెచ్.ఆర్.డి సెంటర్" ను స్థాపించారు. ఈ కేంద్రం ద్వారా పిల్లలకు, తల్లిదండ్రులకు, వివాహితుల మధ్య సమస్యలు ఎదుర్కొన్నవారికి మానసిక దిశానిర్దేశం ఇచ్చారు. ఇది కేవలం సైకాలజీ క్లినిక్ కాదు జీవితాన్ని గమనించే మార్గదర్శిని. ఆయన సతీమణి కూడా ఈ సంస్థ సేవల్లో భాగమయ్యారు. ఇటువంటి కుటుంబ అనుబంధంలో సాక్షాత్ సేవా ధర్మాన్ని జీవించిన వారే పట్టాభిరామ్. పట్టాభిరామ్ జీవితాన్ని నిర్వచించాలంటే "జీవితం ఒక ఉత్సవం" అనే పేరుతో వచ్చిన ఆయన జీవితకథకంటే గొప్ప నిర్వచనం ఉండదు. 2024లో ఆవిష్కరించిన ఆ గ్రంథం ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తున్నా మానసికంగా ఎంతో ఉత్సాహంగా ఉండే పట్టాభిరామ్‌ను మన ముందుకు తీసుకువచ్చింది. అక్షరాల్లో ఆయన చూపిన జీవితం ఒక పాఠం కాదు ఒక పాఠశాల. వ్యాసాలను చదవడం కాదు మార్పును అనుభవించడం. ఆయన ప్రతి పుస్తకం ఒక వ్యక్తిగత సంభాషణలా ఉండేది. చదువరుని బాధను ఊహించి, దానికి సమాధానం చెప్పేలా ఉండేది. ఆయన రచనలు, ప్రసంగాలు, కౌన్సిలింగ్ శిబిరాలు %-% అన్నీ కూడా సమాజాన్ని మంచి దిశగా మలచాలనే లక్ష్యంతో జరిగాయి. విద్యార్థుల మానసిక ఆరోగ్యానికి సంబంధించిన అంశాలపై ఆయన పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడినవి. ఒత్తిడి, నిరాశ, జంకు, బహిష్కరణ భయాలు ఇవన్నీ తరచూ విద్యార్థులను తొలగిస్తుంటే, పట్టాభిరామ్ వాటికి పరిష్కారాలు చూపించారు. "విద్యార్థుల్లో ఒత్తిడికి 7 కారణాలు", "ఈ 8 విషయాలు పాటిస్తే ఒత్తిడికి లోనుకారు" వంటి రచనలు విద్యార్థి జీవితాన్ని రక్షించేందుకు ఒక కవచంలా మారాయి. ఆయన ప్రాచుర్యం పొందిన పుస్తకాల్లో 'చాణక్య తంత్రం', 'మ్యాజిక్ ఆఫ్ మహాత్మా' లాంటి రచనలు రాజకీయ చాతుర్యం, మానవతా భావం, ధర్మ విజ్ఞానానికి నిదర్శనంగా నిలిచాయి. ఎవరైనా నాయకుడు కావాలనుకునే వ్యక్తికి పట్టాభిరామ్ పుస్తకాలు నిఘంటువుల్లా మారాయి. ఒక వ్యక్తి తన ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతే పట్టాభిరామ్ పుస్తకమే దిక్సూచి. ఒక కుటుంబం సంక్షోభంలో చిక్కుకుంటే ఆయన ఉపన్యాసమే ధైర్యం. ఒక విద్యార్థి తన లక్ష్యం కోల్పోతే ఆయన మాటలే ప్రేరణ. ఇలాంటి మానవతా ధర్మంతో మానవ జీవితాన్ని మెరుగుపర్చేందుకు పట్టాభిరామ్ చేసిన కృషి నిరూపితమవుతుంది. డాక్టర్ బీవీ పట్టాభిరామ్ మాటల మాంత్రికుడే కాదు, మార్గదర్శి కూడా. అద్భుతంగా మాట్లాడగలిగే వ్యక్తి కాదు అర్థవంతంగా బ్రతకమని ప్రేరేపించే వ్యక్తి. తన జీవితాన్ని సామాజిక సేవకు అంకితమిచ్చిన వ్యక్తి. మానవ జీవితంలోని మలినాలను వదిలించి, మంచి మార్గం చూపించాలన్న ఆవేశం ఉన్న మేధావి. మాటతో మంత్రం చేయగలిగిన మానవత్వపు జాదూగాడు. ఆయన లేని లోటు వ్యక్తిగతమైనదే కాదు సమాజానికి తీరనిది. చరిత్ర ఒక వ్యక్తిని మర్చిపోవచ్చు. కానీ వ్యక్తిత్వ వికాసం కోసం మానవ జీవితాన్ని అంకితం చేసిన పట్టాభిరామ్‌ను ఈ సమాజం మాత్రం మరచిపోదు.

–సహాయ మీడియా
9246213493

# ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఎస్బీఐ కీలక భూమిక



**200 సంవత్సరాల చరిత్ర కలిగిన బ్యాంక్**
**ఎస్బిఐగా ఏర్పడి 70 సంవత్సరాలు**
**ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో ప్రారంభమై ఎస్బిఐగా మారిన బ్యాంకు**

భారతదేశ స్వతంత్రం కంటే ముందే బ్రిటిష్ పాలకుల పరిపాలన సమయంలోనే భారతదేశంలో బ్యాంకులో ఏర్పడ్డాయి. రకరకాలుగా రూపాంతాలు చెంది భారతదేశంలో ఎస్బిఐ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ నడిపే బ్యాంకుగా ఏర్పడింది . 1806 లో జాన్ థామస్ చైర్మన్గా ప్రారంభమైన బ్యాంకులో ప్రస్తుతం తెలంగాణ వ్యక్తి చల్లా శ్రీనివాస్ శెట్టి చైర్మన్ గా కొనసాగుతున్నారు . ఎన్నో ఆధునిక సవాళ్లని ఎదుర్కొని అత్యంత శక్తివంతమైన బ్యాంకుగా భారతదేశంలో పాటు గ్లోబల్ మార్కెట్లో అనేక దేశాల్లో సేవలందిస్తున్న ఏకైక బ్యాంక్ ఎస్బిఐ. ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గా ప్రా రంభమైన బ్యాంక్ 1955లో ఎస్బిఐగా రూపాంతరం చెంది 70 సంవత్సరాలు పూర్తి చేసుకుం టుంది . నేటికీ ముంబై కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్నది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మూలాలు 19వ శతాబ్దం మొదటి దశాబ్దంలో ఉన్నాయి, ఆ సమయంలో బ్యాంక్ ఆఫ్ కలకత్తా తరువాత బ్యాంక్ ఆఫ్ బెంగాల్ గా పేరు మార్చబడింది 2 జూన్ 1806న స్థాపించబడింది. బ్యాంక్ ఆఫ్ బెంగాల్ మూడు ప్రెసిడెన్సీ బ్యాంకులలో ఒకటి, మిగిలిన రెండు బ్యాంక్ ఆఫ్ బాంబే 15 ఏప్రిల్ 1840న స్థాపించబడింది, బ్యాంక్ ఆఫ్ మద్రాస్ 1 జూలై 1843న స్థాపించబడింది, మూడు ప్రెసిడెన్సీ బ్యాంకులు జాయింట్ స్టాక్ కంపెనీలుగా విలీనం చేయబడ్డాయి రాయల్ చార్టర్ల ఫలితంగా ఉన్నాయి . ఈ మూడు బ్యాంకులు 1861 వరకు పేపర్ కరెన్సీని జారీ చేసే ప్రత్యేక హక్కును పొందాయి, ఆ హక్కును భారత ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ప్రెసిడెన్సీ బ్యాంకులు 27 జనవరి 1921న విలీనం అయ్యాయి పునర్వ్యవస్థీకరించబడిన బ్యాంకింగ్ సంస్థ దాని పేరు ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాగా మారింది . ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జాయింట్-స్టాక్ కంపెనీగా మిగిలిపోయింది కానీ ప్రభుత్వ భాగస్వామ్యం లేకుండానే కొనసాగింది. భారతదేశానికి స్వాతంత్రం తరువాత కూడా ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గానే కొనసాగింది.

1 జులై 1955 భారతీయ స్టేట్ బ్యాంక్ గా ఏర్పాటు :

నాటి ప్రధానమంత్రి నెహ్రూ కాలంలో పంచవర్ష ప్రణాళికలో భాగంగా ఇంపీరియర్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేరును స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాగా మార్చా రు. 1955 నాటి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టంలోని నిబంధనల ప్రకారం, భారతదేశ కేంద్ర బ్యాంకు అయిన రిజర్వ్ బ్యాంక్ , ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో నియంత్రణ వాటాను పొందింది. 1 జూలై , 1955 న, ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గా మారింది. 1959లో, ప్రభుత్వం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుబంధ బ్యాంకులు చట్టాన్ని ఆమోదించింది. దీని ద్వారా రాచరిక రాష్ట్రాలకు చెందిన ఎనిమిది బ్యాంకులను ఎస్బిఐ అనుబంధ సంస్థలుగా మార్చారు. ఇది గ్రామీణ భారతదేశ అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చిన మొదటి పంచవర్ష ప్రణాళిక సమయంలో జరిగింది. గ్రామీణ ప్రాంతాలను విస్తరించడానికి ప్రభుత్వం ఈ బ్యాంకులను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వ్యవస్థలో విలీనం చేసింది. ముంబై ప్రధాన కార్యాలయంగా కార్యక్రమాల నిర్వహణ ముంబై ప్రధాన కార్యాలయంగా ప్రపంచవ్యాప్తంగా అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయాలు నిర్వహిస్తుంది ఎస్బిఐ భారతదేశం విదేశాలలో దాని శాఖల నెట్‌వర్క్ ద్వారా అనేక రకాల బ్యాంకింగ్ ఉత్పత్తులను అందిస్తుంది, వీటిలో ప్రవాస భారతీయులను లక్ష్యంగా చేసుకున్న ఉత్పత్తులు ఉన్నాయి. స్థానిక ప్రధాన కార్యాల యాలు అని పిలువబడే 17 ప్రాంతీయ కేంద్రాలను కలిగి ఉంది, వీటి కింద 57 పరిపాలనా కార్యాల యాలు ఉన్నాయి, ఇవి భారతదేశం అంతటా ముఖ్యమైన నగరాల్లో ఉన్నాయి, వీటి కింద ప్రాంతీయ వ్యాపార కార్యాలయాలు అని పిలువబడే పరిపాలనా ఉప కార్యాలయాలు కూడా ఉన్నాయి, ప్రతి RBO దాని ప్రత్యక్ష పరిపాలనా నియంత్రణలో 40 నుండి 50 శాఖలను కలిగి ఉంటుంది. దేశవ్యాప్తంగా 22,542 శాఖలు, 63,580 ఏటీఎంలో కలిగి ఉన్న బ్రాంచ్ ఎస్ బి ఐ ప్రపంచ గ్లోబల్ మార్కెట్లో ఎస్బిఐ అగ్రస్థానం

2024-25 నాటికి, బ్యాంకుకు 36 దేశాలలో 241 విదేశీ కార్యాలయాలు ఉన్నాయి, ఇవి భారతీయ బ్యాంకులలో విదేశీ మార్కెట్లలో అతిపెద్ద ఉనికిని కలిగి ఉన్నాయి. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, చైనా, దక్షిణాఫ్రికా, సింగపూర్, మాస్కో, మారిషస్, బహ్రెయిన్, నేపాల్, ఇండోనేషియా, శ్రీలంక, దక్షిణ కొరియా వంటి దేశాల్లో ఎస్బిఐ తన సేవల ద్వారా భారతీయ వలస ప్రజలకు, విదేశీ పెట్టుబడిదారులకు, వాణిజ్య సంస్థలకు బ్యాంకింగ్ సేవలను అందిస్తూ, భారతదేశానికి విదేశీ మారకద్రవ్య ప్రవాహాన్ని పెంచడంలో గణనీయమైన పాత్ర పోషిస్తోంది.. ఎస్బిఐ కెనడా బ్యాంక్ బ్యాంక్ చట్టం కింద జాబితా చేయబడిన షెడ్యూల్ కెనడియన్ బ్యాంక్ కెనడా డిపాజిట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌లో సభ్యుడు. ఎస్బిఐ చైనా, ్రూ బ్యాంక్ ఎస్బిఐ ఇండోనేషియా ఎస్బిఐ2006లో బ్యాంక్ ఇండో మోనెక్స్‌లో 76 శాతం వాటాను $6 మిలియన్లకు కొనుగోలు చేసింది. 2009లో, బ్యాంకు పేరును PT బ్యాంక్ ఎస్బిఐ ఇండోనేషియాగా మార్చారు. ఎస్బిఐ(మారిషస్) లిమిటెడ్ ఎస్బిఐ 1989లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇంటర్నేషనల్ (మారిషస్) లిమిటెడ్ అనే ఆఫ్‌షోర్ బ్యాంక్‌ను స్థాపించింది. ఇది తరువాత ది ఇండియన్ ఓషన్ ఇంటర్నేషనల్ బ్యాంక్ 1979 నుండి మారిషస్‌లో రిటైల్ బ్యాంకింగ్ చేస్తోంది)తో కలిసి ఎస్బిఐమారిషస్) లిమిటెడ్‌గా ఏర్పడింది. నేడు, ఎస్బిఐ (మారిషస్) లిమిటెడ్ 14 శాఖలను కలిగి ఉంది – 13 రిటైల్ శాఖలు మారిషస్‌లోని ఎబెన్‌లో 1 గ్లోబల్ బిజినెస్ శాఖలు ఉన్నాయి. నేపాల్ ఎస్బిఐ బ్యాంక్ లిమిటెడ్ ఎస్బిఐలో 55 శాతం వాటాను కలిగి ఉంది, అయితే ప్రభుత్వ యాజమాన్యంలోని ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆఫ్ నేపాల్ 15శాతం వాటాను కలిగి ఉంది మిగిలిన 30 శాతం సాధారణ ప్రజల వద్ద ఉంది. నేపాల్ ఎస్బిఐ బ్యాంక్ లిమిటెడ్ దేశవ్యాప్తంగా శాఖలను కలిగి ఉంది. కమర్షియల్ ఇండో బ్యాంక్ ఎస్బిఐ, మాస్కో, ఎస్బిఐ కెనరా బ్యాంక్ మధ్య 60:40 జాయింట్ వెంచర్‌గా స్థాపించబడింది . 2022లో, ఎస్బిఐ కెనరా బ్యాంక్ యొక్క 40 శాతం వాటాను 14.67 మిలియన్లకు కొనుగోలు చేసింది.

ఎస్బిఐ సింగపూర్ 1977లో, ఎస్బిఐసింగపూర్‌లో వాణిజ్య టోకు బ్యాంకింగ్ సేవలను అందించే ఆఫ్‌షోర్ బ్యాంకును స్థాపించింది. అక్టోబర్ 2008లో, ఇది అర్హత కలిగిన పూర్తి బ్యాంకింగ్ లైసెన్స్‌ను పొందింది. దక్షిణ కొరియాలోని ఎస్బిఐ జనవరి 2016లో, ఎస్బిఐతన మొదటి శాఖను దక్షిణ కొరియాలోని సియోల్‌లో ప్రారంభించింది . ఎస్బిఐ దక్షిణాఫ్రికా..ఎస్బిఐ శ్రీలంక 1864లో స్థాపించబ డింది ఇది శ్రీలంకలోని పురాతన బ్యాంకు. దీనికి కొలంబో , కాండీ జాఫ్నాలో మూడు శాఖలు ఉన్నాయి .ఎస్బిఐ యుకె లిమిటెడ్ 1982లో, బ్యాంక్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (కాలిఫోర్నియా) అనే అనుబంధ సంస్థను స్థాపించింది. దీనికి పది శాఖలు ఉన్నాయి28 మార్చి 2011 నాటికి కాలిఫోర్నియా రాష్ట్రంలో తొమ్మిది శాఖలు వాషింగ్టన్, DCలో ఒకటి. మాజీ అనుబంధ బ్యాంకులు సవరించు2017 లో ఎస్బిఐ అనుబంధ బ్యాంకుల విలీనందేశంలో అతి బ్యాంకుగా ఏర్పాటు ముంబైలోని ఎస్బిఐప్రధాన శాఖ1960లో ఎస్బిఐ ఏడు బ్యాంకుల నియంత్రణను సొంతం చేసుకుంది. అవి పూర్వ భారత సంస్థానాలకు చెందిన ఏడు ప్రాంతీయ బ్యాంకులు. వాటి పేరును 'స్టేట్ బ్యాంక్ ఆఫ్'తో కలుపుతూ మార్చారు. ఈ ఏడు బ్యాంకులు స్టేట్ బ్యాంక్ ఆఫ్ బికనీర్ అండ్ జైపూర్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండోర్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ మైసూర్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ పాటియాలా స్టేట్ బ్యాంక్ ఆఫ్ సౌరాష్ట్ర స్టేట్ బ్యాంక్ ఆఫ్ ట్రావెన్‌కోర్ ఈ బ్యాంకులన్నింటికీ మాతృ బ్యాంకు అయిన ఎస్బిఐ లాగానే లోగో ఇవ్వబడింది.

అన్ని అనుబంధ బ్యాంకులను విలీనం చేయడం ద్వారా SBIని ఒకే అతి పెద్ద బ్యాంకుగా మార్చే ప్రణాళికలు 2008లో ప్రారంభమయ్యాయి. దీంతో దేశంలో అతిపెద్ద బ్యాంకింగ్ వ్యవస్థ కలిగిన బ్యాంకుగా ఎస్బిఐ ఏర్పాటు అయింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముంబై ప్రధాన కేంద్రంగా కార్యక్రమాలు అన్ని రకాల కార్యక్రమాలు నేటికీ ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తుంది.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముంబై ప్రధాన కేంద్రం గా బ్యాంకింగ్ కాని అనుబంధ సంస్థలు ఎస్బిఐ యొక్క ముఖ్యమైన బ్యాంకింగ్యేతర అనుబంధ సంస్థలు: ఎస్బిఐ క్యాపిటల్ మార్కెట్స్ లిమిటెడ్. ఎస్బిఐ కార్డ్స్ – పేమెంట్స్ సర్వీసెస్ లిమిటెడ్. ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్. ఎస్బిఐ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్. ఎస్బిఐఫండ్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్. అనుబంధ బ్యాంకులు ఎస్బిఐ నాన్-కంట్రోలింగ్ మైనారిటీ వాటాలను కలిగి ఉన్న బ్యాంకులు ఉన్నాయి.


**అత్యంత ఆస్తులు కలిగిన బ్యాంక్**

ప్రపంచవ్యాప్తంగా గ్లోబల్ మార్కెట్ దేశవ్యాప్తంగా అత్యంత స్థిరాస్తులు చరస్తులు వ్యాపారం కలిగిన బ్యాంక్ దేశంలో నెంబర్ వన్ గా నిలిచింది

–అస శ్రీరాములు
సీనియర్ జర్నలిస్ట్
9440037196

భక్తి

## నీ తోటివాడూ నీలాంటివాడే



**సం**పన్నుడైన ఒక బాటసారి కొండదారిలో ఒంటరిగా ప్రయాణిస్తున్నాడు. అతని దగ్గర డబ్బు, నగలు ఉన్న పెద్ద మూట ఉంది. అది దొంగలు దారికాచి దోచుకోవడానికి అనువైన ప్రదేశమే. కాబట్టి అతను ఆ మూటను జాగ్రత్తగా పట్టుకొని నడుస్తున్నాడు. అతను భయపడినట్టే... చెట్ల చాటు నుంచి, బండల మాటు నుంచి దొంగలు వచ్చారు. అతణ్ణి చుట్టు ముట్టారు. తీవ్రంగా కొట్టారు. అతని దగ్గర ఉన్నదంతా దోచుకుపోయారు. ఆ బాటసారి స్పృహ కోల్పోయాడు. కొద్దిసేపటికి తేరుకున్నాడు. లేవలేని స్థితిలో ఉన్న అతను సాయం కోసం అరిచాడు, అర్థించాడు. అటువైపు పలువురు పలుకుబడి ఉన్న పెద్దమనుషులు, సంఘ సేవకులుగా పేరున్నవారు, సంపన్నులు, మతాచార్యులు ప్రయాణించారు. అందరూ అతణ్ణి దాటుకుంటూ పోయారు తప్ప సహాయం చేయలేదు.

కొంతసేపటికి ఒక సాదాసీదా మనిషి చిన్న గాడిదమీద అటు వచ్చాడు. ఆ బాధితుణ్ణి చూసి, 'అయ్యో పాపం' అని జాలిపడ్డాడు. అతడికి కట్లు కట్టాడు. తన గాడిదమీద ఎక్కించుకొని దగ్గరలో ఉన్న సత్రంలోకి చేర్చాడు, వైద్యం చేయించాడు. సత్రంవారికి మళ్ళీ వస్తానని చెప్పి వెళ్ళాడు. మరుసటిరోజు వచ్చి... సత్రం వారికి చెప్పిన మొత్తం చెల్లించాడు. ఆ బాటసారిని అతని ఇంటికి తీసుకువెళ్ళాడు.

ఆ వచ్చిన వ్యక్తి ఒక సమరేయుడు. అంటే ఆ రోజుల్లో కడజాతివాడుగా, అంటరానివాడుగా పరిగణించే వ్యక్తి. అందరూ ఈ సడించుకొనే వర్గానికి చెందినవాడు. అయితేనేం... బాధలో ఉన్న తోటి కాపాడి తన ఔన్నత్యాన్ని చాటుకున్నాడు. "సాటివాడు శత్రువు కాదు. తోటివాడు తోడేలూ కాదు. వారూ మనలాంటి మనుషులే అని భావించి, ప్రేమించడం నేర్చుకోవాలి. ఎంత సంపద ఉన్నా, అధికారంలో ఉన్నా, జాతిపరంగా ఉన్నతులమని భావించేవారైనా... వారెవరూ గొప్పవారు కాదు. తోటివారికి సాయం చేసేవారు పేదలైనా, నిమ్నవర్గాలవారైనా ఉన్నతులే" అంటూ తన చుట్టూ చేరిన ప్రజలకు ఏసు క్రీస్తు చెపిన్పన కథ ఇది. 'మనల్ని మనం ప్రేమించుకోవడంలో విశేషం ఏముంది? మనల్ని మనం ఎంతగా ప్రేమించుకుంటామో మన చుట్టుపక్కలవారిని కూడా అలాగే ప్రేమించాలి' అనేది బైబిల్ సారాంశం.



## పిల్లి పిల్లను మింగిన నాగుపాము.. వణుకు పుట్టించే వీడియోను మీరు చూసేయండి..!



న్యూఢిల్లీ-నవభూమి: సోషల్ మీడియాలో పాములకు సంబంధించిన వీడియోలు వైరల్ అవుతుంటాయి. చాలా సందర్భాల్లో భారీ సర్పాలు పలు జంతువులను వీడియోలు చూసే ఉంటారు. అయితే, ప్రస్తుతం అలాంటిదే ఓ వీడియో వైరల్ అవుతుంది. దీన్ని చూసిన అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఓ పిల్లి పిల్లను నాగుపాము మింగింది. ఈ వీడియోను చూస్తే మీరు కూడా వణికిపోతారు. ఇప్పటి వరకు కొండచిలువలు వంటివి మాత్రమే జంతువులను మింగడం చూసి ఉంటారు. కానీ, ఓ కోబ్రా జంతువులను పట్టి తినడం అరుదైన ఘటనే. ఇందుకు సంబంధించిన వీడియోను ప్రముఖ స్నేక్ క్యాచర్ మురళీ వాలే హౌస్లా తన తన ఫేస్‌బుక్ అకౌంట్‌లో ఈ వీడియోను షేర్ చేశారు.పిల్లి పిల్లను మింగిన నాగుపాము ఓ ఇంట్లో దాక్కున్నట్లుగా వీడియోలో కనిపిస్తుంది. మురళీ ఆ పామును పట్టుకునేందుకు ఆ ఇంటికి వచ్చారు. ఆ ఇంట్లో మూలన నక్కిన కోబ్రా.. బుసలు కొడుతూ తప్పించుకునేందుకు ప్రయత్నించింది. ఆవేశంగా ఉన్న పాము పడగను విసిరింది. కొద్ది సేపు ప్రయత్నించిన తర్వాత మురళీ నాగుపామును పట్టుకొని ఇంట్లో నుంచి బయటకు తీసుకువచ్చారు. బయటకు వచ్చిన పాము పిల్లిని బయటకు ఉమ్మివేసింది.ఈ వీడియో చూసిన ప్రతి ఒక్కరికీ గుండెల్లో వణుకు పుట్టేలా ఉన్నది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. ఈ వీడియోను దాదాపు 7 కోట్ల మంది వీక్షించగా.. 6 లక్షల మంది లైక్ చేశారు. మురళీవాలే ఉత్తరప్రదేశ్‌లోని జౌన్‌పూర్‌కు చెందిన సామాజిక కార్యకర్త, స్నేక్ క్యాచర్. ఇప్పటి వరకు ఆయన దాదాపు 8వేల వరకు పాములను పట్టుకున్నారు. అదే సమయంలో పలు జంతువులను సైతం కాపాడారు. సోషల్ మీడియాలో ఆయనకు భారీగా ఫాలోవర్స్ ఉన్నారు.

# హ్యాట్సాఫ్ డాక్టర్.. రూ.50కే చికిత్స



న్యూఢిల్లీ-నవభూమి:దేవుడు ప్రాణం పోస్తాడు కానీ.. డాక్టర్ ఆ ప్రాణాన్ని నిలబెడతాడు అని ఒక సామెత ఉంటుంది. ఇంకా కొన్ని సినిమాల్లో అయితే.. చావుబతుకుల మధ్య ఉన్న రోగిని కాపాడే డాక్టర్.. దేవుడి కంటే గొప్పవాడు అని కూడా డైలాగ్ ఉంటుంది. అంటే కనిపించని దేవుడు తెలియదు గానీ.. వైద్యం చేసే డాక్టరే దేవుడు అని నమ్మేవాళ్లు చాలా మంది ఉంటారు. అయితే అలాంటి వైద్యం ఇప్పుడు వ్యాపారంగా మారిపోయింది. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాలంటే అక్కడి ఫీజులు కట్టలేని పరిస్థితి. పోనీ గవర్నమెంట్ ఆస్పత్రుల్లో చికిత్స చేసుకుందామంటే ప్రాణాలతో ఇంటికి రాలేమని చాలా మంది భావిస్తూ ఉంటారు. ఏదైనా రోగం వస్తే.. ఇల్లు, వాకిలి, భూములు, ఆస్తులు అన్నీ అమ్మేసి అప్పుల పాలైనా.. ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీ దాటికి తట్టుకోలేమని భావించేవాళ్లు చాలా మందే ఉంటారు. నాణ్యమైన వైద్యం దొరక్క ప్రాణాలను గాలికి వదిలేసిన వాళ్లు ఎంతోమంది ఉంటారు.'అదిరింది' సినిమాలో హీరో దళపతి విజయ్.. రూ.5 డాక్టర్‌గా చాలా ఫేమస్ అవుతాడు. పేదవారికి తక్కువలో వైద్యం అందించేందుకు ఓ క్లినిక్ పెట్టి.. తన వద్దకు వచ్చే రోగులకు రూ.5కే చికిత్స చేస్తాడు. దీంతో హీరోను అంతా 5 రూపాయల డాక్టర్ అని పిలుచుకుంటారు. అచ్చంగా అలాగే నిజ జీవితంలోనూ ఓ డాక్టర్.. పేద ప్రజలకు వైద్య సహాయం అందిస్తున్నారు. పాము కాటు నుంచి మొదలుపెడితే.. గుండెపోటు వరకు అన్ని రకాల చికిత్సలకు తక్కువ ఫీజు తీసుకుంటూ వైద్యం చేస్తున్నారు. సరైన వైద్యం అందక చనిపోయే వారు.. డబ్బుల్లేక చికిత్స తీసుకోకుండా ఉండేవారిని మనం ఎంతో మందిని చూస్తుంటాం. డబ్బులు లేక.. ఎవరూ వైద్యానికి దూరం కాకూడదు అనే.. బలమైన సంకల్పం, నిస్వార్థ సేవతో ఆ డాక్టర్.. గ్రామాల్లోని నిరుపేదలకు చికిత్స అందిస్తూ.. నేటి తరం డాక్టర్లకు ఒక దిక్సూచిలాగా నిలుస్తున్నారు. ఆయనే డాక్టర్ ఎస్ఎమ్ జియూర్ రహమాన్. ఢిల్లీలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మంచి జీతంతో పనిచేసిన డాక్టర్ ఎస్ఎమ్ జియూర్ రహమాన్.. పేదలకు తక్కువ ధరకే నాణ్యమైన చికిత్స అందించాలనే గొప్ప సంకల్పంతో.. ఢిల్లీ నుంచి తన స్వస్థలం బిహార్‌కు వెళ్లి.. అక్కడి గ్రామస్తులకు రూ.50కే చికిత్స అందిస్తున్నారు. బిహార్‌లోని ఖగారియా జిల్లాకు చెందిన డాక్టర్ ఎస్ఎం జియూర్ రెహమాన్.. ఢిల్లీలోని ఒక పెద్ద ప్రైవేట్ ఆస్పత్రిలోని కార్డియాక్ విభాగంలో పనిచేసేవారు. అయితే ఒక రోజు తన వద్దకు వచ్చిన ఒక రోగి.. తాను వైద్య సహాయం లేని గ్రామం నుంచి వచ్చినట్లు చెప్పాడు. అసలు విషయం తెలుసుకుంటే.. అది ఆయన జిల్లా అయిన ఖగారియా నుంచి వచ్చాడని తెలిపాడు. కేవలం మెరుగైన చికిత్స కోసం బిహార్ నుంచి ఢిల్లీకి ప్రయాణించి వచ్చినట్లు ఆ రోగి చెప్పడంతో డాక్టర్ రెహమాన్ తల్లడిల్లిపోయారు. ఎందుకంటే ఖగారియా జిల్లా నుంచి ఢిల్లీకి దాదాపు 1200 కిలోమీటర్ల దూరం ఉంటుంది.

**50 పడకల ఆస్పత్రి నిర్మాణం**

ఢిల్లీ లాంటి నగరాల్లో అన్ని రకాల రోగాలకు మంచి చికిత్స ఉందని.. కానీ తన సొంత జిల్లాలోని ప్రజలకు మాత్రం సరైన చికిత్స అందడం లేదని గ్రహించిన డాక్టర్ రెహమాన్.. తన వారి కోసం పనిచేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే 2010లో ఖగారియా జిల్లాలో నేషనల్ మెడికేర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. దాన్ని మొత్తం 50 పడకల ఆస్పత్రిగా నిర్మించారు. అక్కడ సాధారణ పరీక్షలతో పాటు అత్యవసర సేవలను కూడా అందిస్తున్నారు. ఇక బిహార్‌లోని గ్రామాల్లో అత్యధికంగా ఉండే పాము కాటుకు కూడా చికిత్స అందిస్తున్నారు.

**తల్లికి జరిగిన అవమానంతో నిర్ణయం**

డాక్టర్ రెహమాన్ నిత్యం దాదాపు 70 మంది రోగులకు చికిత్స చేస్తున్నారు. ఆ ఆస్పత్రికి వచ్చేవారిలో చాలా మంది కనీసం 50 రూపాయల ఫీజు కూడా చెల్లించలేని వారు ఉన్నారు. నగరాల్లో చికిత్స అనేది ఒక వ్యాపారమని.. కానీ తమ గ్రామాల్లో అది చావుబతుకుల మధ్య పోరాటమని డాక్టర్ రెహమాన్ చెబుతున్నారు. ఒక పేద రైతు కుటుంబంలో పుట్టిన.. డాక్టర్ రెహమాన్ పేదరికంలో ఉన్నప్పటికీ తనను తన తల్లిదండ్రులు బాగా చదవాలని ప్రోత్సహించారని పేర్కొన్నారు. తన తల్లిదండ్రులు వ్యవసాయం చేసినప్పటికీ.. తనను ఎప్పుడూ ఆ పనులకు పంపించలేదని తెలిపారు. తాను 6 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు.. తన తల్లి తనతోపాటు తన తమ్ముడిని ఆస్పత్రికి తీసుకువెళ్లినట్లు గుర్తు చేసుకున్నారు. ఇద్దరికీ ఫీజులకు డబ్బులు లేకపోవడంతో.. ఇద్దరికీ ఒకే చీటీపై చికిత్స చేయవచ్చా అని తన తల్లి కాంపౌండర్‌ను అడిగినట్లు చెప్పారు. దానికి ఆ కాంపౌండర్.. కోపంగా తిట్టి అవమానించినట్లు గుర్తు చేసుకున్నారు. తాను చాలా చిన్నవాడిని అయినప్పటికీ.. తనకు ఆ అవమానం గుర్తుందని డాక్టర్ రెహమాన్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు.

**అర్ధరాత్రి వరకు వైద్యం**

ఇలా డబ్బు లేని కారణంగా ఎవరినీ చికిత్స చేయకుండా వెనక్కి పంపకుండా.. వారికి రోగాన్ని నయం చేసే డాక్టర్‌ను కావాలని అదే రోజున తాను నిర్ణయించుకున్నట్లు డాక్టర్ రెహమాన్ తెలిపారు. ఢిల్లీలోని ఒక స్వచ్ఛంద సంస్థ ఇచ్చిన స్కాలర్‌షిప్‌తో పాట్నా మెడికల్ కాలేజీలో మెడిసిన్ చదివి.. రెహమాన్ డాక్టర్ అయ్యారు. ఆ తర్వాత అపోలో హాస్పిటల్‌లో రెసిడెన్సీ పొందిన ఆయన నాన్ ఇన్వాసివ్ కార్డియాక్ విధానంలో స్పెషలైజేషన్ చేశారు. తాను ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఆస్పత్రిలోనే రోగులకు చికిత్స అందిస్తూ.. పని చేస్తామని డాక్టర్ రెహమాన్ వెల్లడించారు. కొన్నిసార్లు మరిన్ని ఎక్కువ పని గంటలు పని చేయాల్సి వస్తుందని.. అప్పుడప్పుడూ అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంటికి వెళ్తామని చెప్పారు.ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాలంటే ఆస్తులు అమ్ముకోవాలి.. నాణ్యమైన వైద్యం చేయించుకోవడానికి పేదలకు అవకాశం లేదనే వాదనలు వినిపిస్తున్న ఇలాంటి రోజుల్లో డాక్టర్ రెహమాన్ లాంటి వాళ్లు ఆస్పత్రులు ఏర్పాటు చేసి.. తక్కువ ధరకే రోగాలను నయం చేస్తుండటం నిజంగా ప్రశంసించాల్సిన విషయమే.

## 5 టీవీలు, 14 ఏసీలు.. ఢిల్లీ సీఎం నివాసానికి రూ.60 లక్షలతో పునరుద్ధరణ పనులు



న్యూఢిల్లీ-నవభూమి:ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాకు గత నెల అధికారిక నివాసాన్ని కేటాయించిన విషయం తెలిసిందే. సీఎంగా బాధ్యతలు చేపట్టిన దాదాపు 100 రోజుల తర్వాత రేఖా గుప్తాకు సివిల్ లైన్స్‌లోని రాజ్ నివాస్ మార్గంలో అధికారిక బంగ్లాను పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ కేటాయించింది. బంగ్లా 1, బంగ్లా 2ను సీఎం కోసం కేటాయించగా.. అందులో బంగ్లా 1లో రేఖా గుప్తా తన ఫ్యామిలీతో కలిసి నివాసం ఉండనున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఆ ఇంటికి అధికారులు పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఇందుకోసం దాదాపు రూ.60 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు తెలిసింది.పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ జారీ చేసిన టెండర్ నోటీసు ప్రకారం.. సీఎం కోసం బంగ్లా 1, 2 కేటాయించగా.. బంగ్లా 1ని నివాసం కోసం ఉపయోగిస్తున్నారు. రెండో బంగ్లా క్యాంప్ ఆఫీస్‌గా ఉపయోగించనున్నారు. ఇక సీఎం నివాసం ఉండే బంగ్లాకు రూ.60 లక్షలతో పునరుద్ధరణ పనులు చేపట్టనున్నారు. అందులో రూ.9.3 లక్షల విలువైన ఐదు టీవీలు, రూ.7.7 లక్షల విలువైన 14 ఏసీలు, రూ.5.74 లక్షల విలువైన 14 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు.అంతేకాదు, రూ.2 లక్షలతో ఆ ఇంటికి నిరంతర విద్యుత్ సరఫరా వ్యవస్థను కూడా ఏర్పాటు చేయనున్నారు. రూ.1.8 లక్షల విలువైన రిమోట్ కంట్రోల్‌తో కూడిన 23 సీలింగ్ ఫ్యాన్లు, రూ.85వేల విలువైన %ాు+% (ఓవెన్ టోస్ట్ గ్రిల్), రూ.77 వేల విలువైన ఆటోమేటిక్ వాషింగ్ మెషీన్, రూ.60 వేల విలువైన డిష్‌వాషర్, రూ.63 వేల విలువైన గ్యాస్ స్టవ్, రూ.32 వేల విలువైన మైక్రోవేవ్, రూ.91 వేల విలువైన ఆరు గీజర్‌లను ఆ ఇంట్లో ఏర్పాటు చేయనున్నారు. రూ.6 లక్షల వ్యయంతో ఇంట్లో మొత్తం 115 లైట్లు, వాల్ లైటర్లు, హ్యాంగింగ్ లైట్లు, మూడు పెద్ద షాండ్లియర్లు ఏర్పాటు చేయనున్నట్లు టెంటర్‌లో పేర్కొన్నారు.ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారాన్ని చేజిక్కించుకున్న విషయం తెలిసిందే. అనంతరం ఢిల్లీ సీఎంగా రేఖా గుప్తా బాధ్యతలు చేపట్టారు. అయితే, అంతకముందు కేజ్రీవాల్ నివాసం ఉన్న సివిల్ లైన్స్‌లోని సీఎం అధికారిక నివాసం వ్యవహారం వివాదాస్పదమైంది. ఆ బంగ్లాను బీజేపీ 'శీష్ మహల్' (%ాప్త్రవవంప్త్రఝుప్త్రుశ్రీ%)గా అభివర్ణిస్తోంది. వివాదాస్పద శీష్ మహల్‌కు దూరంగా ఉండాలని బీజేపీ అప్పుడే నిర్ణయించింది.ఈ నేపథ్యంలో సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రేఖా గుప్తా తన కుటుంబ సభ్యులతో కలిసి షాలిమార్ బాగ్‌లో నివాసం ఉంటున్నారు. దీంతో అక్కడికి వచ్చే సందర్శకులు, వీఐపీలు, సీనియర్ అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాక సచివాలయానికి వెళ్లేందుకు రోజూ 25 కిలోమీటర్లు ఆమె ప్రయాణించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలోనే సీఎంగా బాధ్యతలు చేపట్టిన దాదాపు 100 రోజుల తర్వాత రేఖా గుప్తాకు సివిల్ లైన్స్‌లోని రాజ్ నివాస్ మార్గంలో అధికారిక బంగ్లాను పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ కేటాయించింది. ఆమె సొంత నియోజకవర్గానికి సమీపంలోనే నూతన బంగ్లాను కేటాయించింది. సీఎంకు 1/8, 2/8 నంబర్లతో కూడిన బంగ్లాలను కేటాయించారు.

## పార్లమెంటరీ ప్యానెల్ మీటింగ్‌కు మేధా పాట్కర్, ప్రకాశ్ రాజ్.. వాకౌట్ చేసిన బీజేపీ ఎంపీలు




న్యూఢిల్లీ-నవభూమి: కాంగ్రెస్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక నేతృత్వంలో మంగళవారం పార్లమెంట్‌లో గ్రామీణ అభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ స్టాండింగ్ కమిటీ(సమావేశం జరిగింది. అయితే ఆ మీటింగ్‌కు సామాజిక కార్యకర్త మేధా పాట్కర్, ప్రకాశ్ రాజ్‌లు హాజరయ్యారు. దీంతో వివాదం చెలరేగింది. భూ వనరుల శాఖ, పంచాయతీ రాజ్ శాఖలు రెండు ముసాయిదా తీర్మాలను రూపొందించాయి. దానిపై చర్చించేందుకు చేపట్టింది పార్లమెంటరీ ప్యానెల్ మీట్ రసాభాసగా మారింది. తమ అభిప్రాయాలు వ్యక్తం చేసేందుకు కొన్ని ఎన్జీవోల తరపున సభ్యులు మీటింగ్ హాజరయ్యారు. పునర్ నివాసం హక్కుల గురించి తమ అభిప్రాయాలు వినిపంచేందుకు కొందరు నేతలు వచ్చారు.అయితే లిస్టులో లేని నేతలు మీటింగ్‌కు ఎలా వస్తారని బీజేపీ ఎంపీలు అభ్యంతరం వ్యక్తం చేశారు. మేధా పాట్కర్, ప్రకాశ్ రాజ్ రాక గురించి తమకు వెల్లడించలేదన్నారు. రాజకీయ దురుద్దేశంతో వాళ్లను ఆహ్వానించినట్లు బీజేపీ ఆరోపించింది. బీజేఈ ఎంపీ పురుషోత్తం రూపాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. జాతీయ ప్రయోజనాలకు చెందిన ప్రాజెక్టులను మేధా పాట్కర్ వ్యతిరేకించారని, ఆమెకు ఈ మీటింగ్‌లో మాట్లాడే హక్కు లేదని రూపాలా అన్నారు. బీజేపీ ఎంపీలు డాక్టర్ సంజయ్ జైస్వాల్, రాజు బిస్తా, జుగల్ కిషోర్ కూడా పురుషోత్తం రూపాలాకు సపోర్టు ఇచ్చారు. సాక్షుల జాబితాను పారదర్శకంగా ఇవ్వలేదని, చైర్మెన్ వైఖరిని బీజేపీ ఎంపీలు విమర్శించారు.పార్లమెంటరీ ప్యానెల్ మీటింగ్‌కు ప్రకాశ్ రాజ్ ఎందుకు వచ్చారని పలుమార్లు బీజేపీ ఎంపీలు ప్రశ్నించారు. సభ్యుల వద్ద ఉన్న లిస్టులో అతని పేరులేదన్నారు. లోక్‌సభ స్పీకర్ అనుమతి ఉన్నట్లు చైర్మెన్ చెప్పినా.. బీజేపీ ఎంపీలు ఆమోదించలేదు. కాంగ్రెస్ ఎంపీలు చైర్మెన్‌కు సపోర్టు ఇవ్వగా, బీజేపీ ఎంపీలు దీన్ని వ్యతిరేకించారు. పది ఎన్జీవోలకు చెందిన ప్రతినిధులు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వడంతో.. బీజేపీ ఎంపీలు ఆ మీటింగ్ నుంచి వాకౌట్ చేశారు. దీంతో మీటింగ్‌కు వాయిదా వేశారు.

## తుంగభద్రకు ఇన్‌ఫ్లో తగ్గింది..

బళ్లారి(బెంగళూరు)-నవభూమి: తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. రెండు రోజులుగా ఎగువ నుంచి వరద తాకిడి తగ్గింది. దీంతో ఇప్పుడే క్రస్ట్‌గేట్లు ఎత్తే ఆలోచన లేనట్లు బోర్డు అధికారులు అభిప్రాయపడుతున్నారు. రెండు, మూడు రోజుల్లో నీటి ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు వారు తెలిపారు. రెండు రోజులుగా జలాశయంలోకి ఇన్‌ఫ్లో 60,000 క్యూసెక్కులకు పైగా ఉంది.మంగళవారం సగటు ప్రవాహం 33.916 క్యూసెక్కులకు తగ్గింది. ప్రస్తుత నీటి మట్టం 1.624.38 అడుగులు , జలాశయం నిల్వ సామర్థ్యం 74.48 టీఎంసీలు. జూలై, ఆగస్టు నెలల్లో సాధారణంగా అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. ఈసారి గరిష్ట స్థాయిలో నీటిని నిల్వ చేయకూడదని నిర్ణయించినందున, వీలయినంత త్వరగానే క్రస్ట్ గేట్లు ఎత్తి అదనపునీటిని నదిలోకి విడుదల చేసే అవకాశం ఉంది.

# క్యాబ్ ప్రయాణికులకు కేంద్రం షాక్



న్యూఢిల్లీ-నవభూమి:క్యాబ్ సర్వీసులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రైడ్ ధరల పెంపుకు ఆమోదం తెలిపింది. డిమాండ్ ఎక్కువగా ఉన్న సమయంలో అనగా పీక్ అవర్స్‌లో క్యాబ్ కంపెనీలు ధరలను పెంచుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. అలానే డైనమిక్ ప్రైసింగ్ (డిమాండ్‌ను బట్టి ధరల్లో హెచ్చుతగ్గులు)కు కూడా అనుమతించింది. కొత్త నిబంధనల ప్రకారం.. ఆఫ్ పీక్.. రద్దీ తక్కువగా ఉన్న సమయంలో బేస్ ఛార్జ్ కన్నా 50 శాతం తక్కువగా ఉండాలని.. అలానే పీక్ అవర్స్‌లో ఈ మొత్తాన్ని 200 శాతం వరకు అనగా రెట్టింపు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతించింది.అలానే 3కిలో మీటర్ల లోపు దూరానికి ఎలాంటి అదనపు ఛార్జీలు విధించకూడదని తెలిపింది. అలానే రాపిడో, ఓలా, ఉబర్ వంటి రైడ్ బుకింగ్ ప్లాట్‌ఫామ్స్.. ప్రైవేట్ మోటార్ సైకిల్స్‌ను వినియోగించుకునేందుకు అనగా బైక్ ట్యాక్సీలకు కేంద్రం పచ్చ జెండా ఊపింది.కొత్త నిబంధనల ప్రకారం.. రైడ్ ఛార్జీలు పికప్ పాయింట్ నుంచి డ్రాప్ లోకేషన్ వరకు మాత్రమే వర్తించేలా ఉండాలి. ఎలాంటి అదనపు ఛార్జీలు వసూలు చేయకూడదని కేంద్రం సూచించింది. అలానే యాప్‌లో డ్రైవర్ రైడ్ అంగీకరించిన తర్వాత.. సరైన కారణం లేకుండా దాన్ని క్యాన్సిల్ చేస్తే.. రైడ్ ఛార్జీలో సుమారు 10 శాతం పెనాల్టీ విధిస్తారు. ఇది గరిష్ఠంగా 100 రూపాయలు ఉండనుంది. ఈ మొత్తాన్ని రైడ్ ప్లాట్‌పామ్, డ్రైవర్ మధ్యన సమానంగా షేర్ చేస్తారు. అలానే సరైన కారణం లేకుండా రైడ్ యాక్సెప్ట్ చేసిన తర్వాత క్యాన్సిల్ చేస్తే.. ప్రయాణికుడికి కూడా ఇదే పెనాల్టీ వర్తిస్తుందని కేంద్రం తెలిపింది.అలానే డ్రైవర్ల సంక్షేమం కోసం కేంద్రం కీలక ప్రతిపాదనలు చేసింది. రైడింగ్ ప్లాట్‌ఫామ్ ఓనర్లు.. తమతో జాయిన్ అయిన ప్రతి డ్రైవర్‌కు కనీసం రూ.5 లక్షల ఆరోగ్య బీమా, రూ.10 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్ కవరేజీని కచ్చితంగా అందించాలని సూచించింది. అలానే కొత్త నిబంధనల ప్రకారం, ఆటో రిక్షాలు, బైక్ టాక్సీలు సహా వివిధ వర్గాల వాహనాలకు సంబంధించి బేస్ ఛార్జీలను నిర్ణయించే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు కల్పించింది. ప్రస్తుతం ఇవి అధికారికంగా అగ్రిగేటర్ పాలసీ ఆయా యాప్స్ యాజమాన్యాం కింద ఉన్నాయి.ఇదిలా ఉంటే ప్రస్తుతం ప్రధాన నగరాలైన ఢిల్లీ,ముంబైలో ప్రస్తుత బేస్ ఛార్జీలు కిలోమీటరుకు రూ.20-రూ.21 వద్ద ఉండగా, పూణేలో ఇది కిలోమీటరుకు రూపాయలుగా ఉంది. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం బేస్ ఛార్జీలను నిర్ణయించకపోతే.. అప్పుడు రైడింగ్ ప్లాట్‌ఫామ్స్ బేస్ ఛార్జీని నిర్ణయించుకోవచ్చు. కాకపోతే దీని గురించి రాష్ట్ర ప్రభుత్వానికి ముందుగానే సమాచారం అందించాలని కేంద్రం వెల్లడించింది. మారిన నిబంధనలు త్వరలోనే అమల్లోకి రానున్నాయి.

# బ్రిటన్ వెళ్లాలనుకునే వారికి షాక్




లండన్-నవభూమి:చాలా మంది భారతీయులు ఉపాధి నిమిత్తం అమెరికా, బ్రిటన్, జర్మనీ సహా పలు దేశాలకు వెళ్తుంటారు. పెద్ద పెద్ద ఉద్యోగాలు మాత్రమే కాక.. పలు రకాల సేవలు అందించడం కోసం కూడా విదేశాలకు వెళుతుంటారు. ఈక్రమంలో బ్రిటన్ ప్రభుత్వం విదేశీ వలసదారులకు భారీ షాక్ ఇచ్చింది. వేర్వేరు దేశాల నుంచి ఉపాధి, ఉద్యోగాల నిమిత్తం బ్రిటన్ వచ్చే వారికి సంబంధించిన వీసా నిబంధనలను కఠినతరం చేసేందుకు రెడీ అయ్యింది. ఈ విషయంలో బ్రిటన్ కూడా అమెరికా బాటలోనే నడుస్తుంది. దీనిలో భాగంగా విదేశీ నిపుణుల వీసా నిబంధనలను కఠినతరం చేసే బిల్లును బ్రిటన్ ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టింది.ఈ కొత్త నిబంధనల ద్వారా వలసలను తగ్గించి, బ్రిటన్ పౌరులకు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. జులై 22 నుంచి ఈ కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. వీసా నిబంధనలు కఠినతరం చేయడం చాలా మంది భారతీయులపై ప్రభావం చూపుతుంది అంటున్నారు. అయితే బ్రిటన్ వలస విధానాన్ని పూర్తిగా మార్చేందుకే ఈ కొత్త నిబంధనలు తీసుకొచ్చామని హోం మంత్రి యెవెట్ కూపర్ తెలిపారు. వలసలను క్రమబద్ధీకరించి, తమ పౌరులకు ఉద్యోగ అవకాశాలు కల్పించుకునేందుకే ఈ నిబంధనలు అని ఆమె తెలిపారు. గత ప్రభుత్వం వలసలను ప్రోత్సహించడంతో నాలుగేళ్లలోనే అవి నాలుగు రెట్లు పెరిగాయని ఆమె విమర్శించారు.

ఈ సందర్భంగా కూపర్ మాట్లాడుతూ.. 'మా ప్రభుత్వం వలస విధానాన్ని క్రమబద్ధీకరించి, నియంత్రణలోకి తీసుకొస్తుంది. బ్రిటన్ పౌరులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి, విదేశీ వలసలను తగ్గిస్తాము. ఉద్యోగుల నైపుణ్యాలకు విలువ ఇస్తాము, వారిని శ్రమ దోపిడీకి గురి కాకుండా చూస్తామ'ని కూపర్ స్పష్టం చేశారు. అలానే బ్రిటన్‌కు వచ్చే విదేశీయులు సరైన రీతిలో వచ్చి సేవలు అందించేలా చూస్తామని, ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ఆమె తేల్చి చెప్పారు.ఈ ఏడాది మే నెలలో బ్రిటన్ ప్రభుత్వం కొత్త వీసా నిబంధనల గురించి ఒక శ్వేతపత్రం విడుదల చేసింది. ఇప్పుడు వాటిని చట్టంగా మార్చేందుకు పార్లమెంటులో ప్రవేశపెట్టారు. పార్లమెంటు ఆమోదం తర్వాత జులై 22 నుంచి ఈ నిబంధనలు అమల్లోకి వస్తాయి. దీని ప్రభావం భారతీయులపై ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే చాలా మంది భారతీయులు పర్సనల్ కేర్ సెంటర్లు, హోటళ్లు, నిర్మాణ సంస్థలు, ఆసుపత్రుల్లో తక్కువ స్థాయి ఉద్యోగాల కోసం బ్రిటన్ వెళ్తుంటారు.


ఆహా ఎన్నాళ్లకి కనిపించిందో.. యాంకర్ శిల్పా చక్రవర్తి డ్యాన్స్ చూశారా? కొత్త నిబంధనల ప్రకారం, బ్రిటన్‌లో ఉద్యోగం చేయాలంటే విదేశీ నిపుణులకు ఎక్కువ నైపుణ్యాలు ఉండాలి. తక్కువ జీతం వచ్చే ఉద్యోగాలను విదేశీయులతో భర్తీ చేయకూడదు. ఇంటి పనులు, పర్సనల్ కేర్, వృద్ధులు, పిల్లలు, దివ్యాంగులకు సేవ చేసే పనులకు విదేశీయులను తీసుకోకూడదు. గతంలో వంట మనుషులు, ప్లాస్టరింగ్ చేసేవారు వంటి 100 రకాలకు పైగా పనులకు వీసా మినహాయింపు ఉండేది. ఇకపై ఆ మినహాయింపు ఉండదు.అయితే, ఇప్పటికే యూకేలో పని చేస్తున్న విదేశీయులకు కొన్ని మినహాయింపులు ఉంటాయని హోంశాఖ సహాయ మంత్రి సీమా మల్హోత్రా తెలిపారు. కొత్త నిబంధనల ప్రకారం, జులై 22 నుంచి బ్యాచిలర్ డిగ్రీ లేదా సమానమైన విద్యార్హత ఉన్నవారికే బ్రిటన్ వీసా వస్తుందన్నారు.

# ఊరంతా ఏకమై.. చిరుతను బంధించారు..




బాగేపల్లి-నవభూమి: గ్రామస్థులంతా కలిసి చిరుతను బంధించారు. మంగళవారం బాగేపల్లి తాలూకా పరిధిలోని వర్లకొండ గ్రామం వరాహగిరి కొండపై కరేనహళ్ళికి చెందిన రైతుపై చిరుత దాడి చేసింది. అయితే గాయాలతో ఆయన బయట పడ్డారు. ఇటీవల కొన్నిరోజులుగా వరాహగిరి కొండపై చిరుతసంచారం, బండపై విశ్రాంతి తీసుకున్న దృశ్యాలు డ్రోన్‌కెమెరాకు చిక్కాయి. వర్లకొండ పక్కన ఉన్న కరేనహళ్ళికి చెందిన రైతు రామకృష్ణప్ప గొర్రెలు మేపేందుకు వెళ్లగా చిరుత దాడి చేసింది.వీపుపై గాయాలు కావడంతో రైతు కేకలు వేశారు. చుట్టుపక్కలవారు రావడంతో చిరుత అక్కడనుంచి పరుగులు తీసింది. అయితే విషయం తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామస్థులు దండుకర్రలతో అక్కడికి చేరుకున్నారు. ఆర్ఎఫ్ఓ రాజశేఖర్, అటవీశాఖ సిబ్బంది సహకారంతో కొండల్లోనున్న చిరు తను బంధించేశారు.

## ఊటీలో సినిమా షూటింగ్‌లకు అనుమతి




చెన్నై-నవభూమి: నీలగిరి జిల్లా ఊటీలో షూటింగ్‌లకు అనుమతిస్తున్నట్లు జిల్లా యంత్రాంగం ప్రకటించింది. ప్రముఖ పర్యాటక కేంద్రంగా పేరొందిన ఊటీని ఏడాదికి సుమారు 30 లక్షల మంది పర్యాటకులు సందర్శిస్తుండగా, వేసవి సీజన్‌లో మాత్రమే పర్యాటకుల సంఖ్య 8 లక్షలుంటుంది.వేసవి సీజన్ పర్యాటకులకు ఇబ్బందులు కలుగకుండా ఊటీ బొటానికల్ గార్డన్, రోజా పార్క్, కున్నూర్ సిమ్స్ పార్క్ తదితర పర్యాటక ప్రాంతాలో ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు నెలలు సినిమా షూటింగ్‌లకు నిషేధం విధించారు.ప్రస్తుతం సీజన్ ముగియడంతో సినిమా షూటింగ్‌లకు అనుమతించినట్లు, ఉద్యానవన శాఖ కార్యాలయాన్ని సంప్రదించి తగిన రుసుము చెల్లించి షూటింగ్‌లకు అనుమతి పొందవచ్చని అధికారులు తెలిపారు.

## సినిమాను తలపించే బ్యాంకు దోపిడి..



విజయ్‌పూర్-నవభూమి:కర్ణాటకలోని విజయ్‌పూర్ జిల్లాలో బ్యాంకు దోపిడీ జరిగింది. దొంగలు బ్యాంకు లాకర్‌లోని బంగారాన్ని ఎత్తుకెళ్లిపోయారు. బంగారం దొంగిలించిన లాకర్‌లో ఓ బొమ్మ పెట్టి వెళ్లారు. దొంగలు ఎత్తుకెళ్లిన ఆ బంగారం విలువ 53 కోట్ల రూపాయలు కావటంతో.. పోలీసులు కేసును సవాల్‌గా తీసుకున్నారు. దర్యాప్తు మొదలెట్టారు. అయితే, దొంగతనానికి కారణం అయిన వ్యక్తి.. పోలీసులు ఊహించిన దానికంటే ఈజీగా దొరికిపోయాడు. కేసు సాల్వ్ అయింది. ఇంతకీ లాకర్‌లో ఉంచిన బొమ్మకు దొంగతనానికి ఏంటి సంబంధం?.. పోలీసులు దొంగల్ని ఎలా పట్టుకున్నారు?...

2025, మే 25.. విజయ్‌పూర్ జిల్లా మనగొలిలోని కెనరా బ్యాంకులో దొంగతనం జరిగింది. దొంగలు బ్యాంకు లాకర్‌లోంచి 53 కోట్ల రూపాయలు విలువ చేసే బంగారాన్ని దోచుకెళ్లారు. అంతేకాదు.. బంగారం దోచిన లాకర్‌లో క్షుద్రపూజలు చేసే బొమ్మను ఉంచి వెళ్లారు. బ్యాంకు మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అయితే, ఆ దొంగతనానికి.. లాకర్‌లో ఉంచిన బొమ్మకు సంబంధం ఏంటన్నది పోలీసులకు అర్థం కాలేదు. దొంగతనం జరిగిన రోజు బ్యాంకు చుట్టు పక్కల ఉన్న అన్ని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను తెప్పించుకున్నారు.

## సీఎం స్టాలిన్ ధీమా.. 200 సీట్లకంటే ఎక్కువే గెలుస్తాం

చెన్నై-నవభూమి:వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ కూటమి 200 సీట్లకన్నా ఎక్కువ స్థానాలు గెలుచుకోవటం ఖాయమని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన ధీమా వ్యక్తం చేశారు. తేనాంపేటలోని అన్నా అరివాలయంలో మంగళవారం ఉదయం 'ఏకతాటిపై తమిళనాడు' అనే పేరుతో ప్రతి పోలింగ్ కేంద్రంలోను 30 శాతం మంది ఓటర్లకు డీఎంకే సభ్యత్వం కల్పించే కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 'ఏకతాటిపై తమిళనాడు' పేరుతో 45 రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపోలింగ్ పరిధిలో 30 శాతం మంది ఓటర్లను పార్టీలో చేర్చుకునే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పార్టీకి చెందిన స్థానిక నాయకులు ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారి ఇళ్లకు కూడా వెళ్ళి, ద్రావిడ తరహా డీఎంకే పాలన అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించి వారిని ఆకట్టుకుని పార్టీలో చేరేలా ప్రేరేపించనున్నట్లు ఆయన చెప్పారు.

తమిళ భాషా సంస్కృతి, సంప్రదాయాలకు హాని కలిగించడమే పనిగాపెట్టుకున్న బీజేపీ కపటనాటకాలను గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వివరించి, వారికి డీఎంకే సభ్యత్వం కల్పించాలని పిలుపునిచ్చారు. 2026 అసెంబ్లీ ఎన్నికలకు డీఎంకే సిద్ధంగానే ఉందని, ఆ ఎన్నికల్లో గెలుపు ఖాయమని, గతంలో తాను చెప్పినట్లు 200 సీట్ల కంటే అధిక సీట్లలోనే గెలుస్తామని పేర్కొన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లోగా డీఎంకే కూటమి లో కొత్త పార్టీలు కూడా చేరే అవకాశం ఉందని స్టాలిన్ పేర్కొన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన వెంటనే కొత్త పార్టీలు కూటమిలో చేరుతాయని ఆయన తెలిపారు.



## పులిస్తేనే ప్రయోజనం

అయితే వాటిలోని యాంటీ ఆక్సిడెంట్ మోతాదులను పెంచుకుని, మధుమేహంతో పోరాడాలనుకుంటే, వాటిని పులియబెట్టుకుని తినాలని ఆహార శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. చిక్కుడు గింజలు, పప్పుధాన్యాలను పులియబెట్టి వాడుకోవడం వల్ల, వాటిలోని యాంటీ ఆక్సిడెంట్ మోతాదులు, మధుమేహ వ్యతిరేక లక్షణాలు, నీటిలో కరిగే మాంసకృత్తుల మోతాదులు పెరుగుతాయని అమెరికా, ఇల్లినాయిస్ యూనివర్శిటీ ఆహార శాస్త్రవేత్తలు అంటున్నారు. వీళ్లు అధ్యయనంలో భాగంగా, మినుములు, అలసందలు, పచ్చి బఠాణీలు, ఎర్ర కందులను లాక్టిప్లాంటిబాసిల్లస్ ప్లాంటారమ్ అనే బ్యాక్టీరియా సహాయంతో పులియబెట్టినప్పుడు, వాటిలో యాంటీ ఆక్సిడెంట్ చర్య 83 శాతం మేరకు పెరగడం, టైప్2 మధుమేహ మార్గర్లను క్రమబద్ధీకరించే సామర్థ్యం 70 శాతానికి పెరగడాన్ని గమనించారు. అలాగే పులియబెట్టే ప్రక్రియ వల్ల, ఆయా పదార్థాల్లోని నీళ్లలో కలిసే ప్రొటీన్ పరిమాణం కూడా పెరిగినట్టు వాళు తెలుసుకున్నారు. ఈ చిక్కుడు జాతి గింజల్లో 18 నుంచి 25 శాతం మేరకు అత్యంత నాణ్యమైన ప్రొటీన్ ఉంటుంది కాబట్టి ఇడ్లీ, దోసెల పిండ్ల మాదిరిగా వీటిని నానబెట్టి, పిండి రుబ్బి, పులియబెట్టి వండుకుని తినడం లేదా ఇతర పదార్థాలతో కలిపి తినడం అలవాటు చేసుకోవాలని వారు అంటున్నారు. ప్రపంచ ఆహార అభద్రత, సహజ వనరుల కొరత, వాతావరణ మార్పులతో ప్రజానీకం సతమతమవుతున్న ప్రస్తుత తరుణంలో వృక్షాధారిత ఆహారాల సుస్థిరతను అన్వేషించవలసిన అవసరం ఉందని పరిశోధకులు అంటున్నారు.

నవతార



# నా కష్టం... వేరొకరికి రాకూడదని



పదిహేనేళ్లకే పెళ్లి. పద్దెనిమిదేళ్లు నిండకుండానే ఒక బిడ్డకు తల్లి. వద్దు వద్దని మొత్తుకున్నా పుట్టింటివాళ్లు బరువు వదిలించుకున్నారు. అత్తింటి వారు మాఇంటికి రావద్దని అన్నారు. అందరూ ఉండి ఒంటరి అయ్యారు 24 ఏళ్ల రోషిణీ పర్వీన్. కానీ ఆమె కుంగిపోలేదు. విపత్కర పరిస్థితులకు ఎదురొడ్డి ఆత్మవిశ్వాసంతో నిలబడ్డారు. బాల్య వివాహాలను అరికడుతూ... ఎందరో బాలికల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్నారు."నా బాల్యం అంతా ముళ్ల బాటలోనే సాగింది. బాగా చదువుకొని... ఒకరిపై ఆధారపడకుండా నా బతుకు నేను బతుకుదామని అనుకున్నా. కానీ ఆ సంకల్పానికి మా అమ్మానాన్నలే విఘాతం కలిగించారు. బీహార్ రాష్ట్రం కిషన్‌గంజ్ జిల్లాలోని మారుమూల పల్లె సిమల్‌బారీలో ఓ సాధారణ కుటుంబం మాది. ఎనిమిదో తరగతి వరకు అంతా బాగానే సాగింది. ఎప్పుడైతే తొమ్మిదో తరగతిలోకి అడుగుపెట్టానో అప్పటి నుంచీ ఊహించని కష్టాలు వచ్చిపడ్డాయి. మా ఇంట్లోవాళ్లు పెళ్లి సంబంధాలు చూడడం మొదలుపెట్టారు. 'ఇంకా పదో తరగతి కూడా పూర్తవ్వలేదు. అప్పుడే పెళ్లేంటి?' అని అడిగాను. నాకు ఇంకా చదువుకోవాలని ఉందని, అప్పటివరకు ఓపిక పట్టమని ప్రాధేయపడ్డాను. అమ్మానాన్న వినలేదు. రోజూ ఎవరూ ఒకరు నన్ను చూడ్డానికి వచ్చేవారు. చాలా సంబంధాలు తిప్పి పంపాను. అయినా వాళ్ల ప్రయత్నం ఆగలేదు. చివరకు నా పోరాటం వృథా అయింది. బలవంతంగా పెళ్లి చేశారు. అది కూడా నాకంటే వయసులో మూడు రెట్లు పెద్దవాడితో. అప్పుడతనికి 45 సంవత్సరాలు. అత్తింటికి వెళ్లేవరకు అతని వయసు నాకు తెలియదు. వివాహ బంధం అంటే ఏంటో కూడా అవగాహన లేదు. వేధింపులు ఎక్కువయ్యాయి. దాంతో భయం వేసి మూడు నెలలకే మా ఇంటికి వెళ్లిపోయాను.

పుట్టింటివారూ పట్టించుకోలేదు...కొన్నాళ్లకు తెలిసింది... నేను గర్భవతిని అని. తరువాత బాబు పుట్టాడు. భర్త దగ్గరకు వెళ్లమని అమ్మానాన్న చెప్పారు. నేను ఆ నరకంలోకి మళ్లీ వెళ్లాలనుకోలేదు. కానీ ఇంట్లోవాళ్లు బలవంతం చేశారు. వెళితే... అత్తింటివాళ్లు నన్ను లోపలికి రానివ్వలేదు. ఏడాది దూరంగా ఉన్నానని, అందుకే నేను తనకు వద్దని నా భర్త తెగేసి చెప్పాడు. మా ఇంట్లోవాళ్లు కూడా నన్ను రానివ్వలేదు. అందరూ ఉండి ఎవరూ లేని అనాథనయ్యాను. చంకలో పసి బిడ్డతో రోడ్డున పడ్డాను. అలాగని బాధతో కూర్చోలేదు. నా కాళ్ల మీద నేను నిలబడాలని ఆ క్షణమే బలంగా నిర్ణయించుకున్నాను.

**బంధాలు తెంచుకుని...** నన్ను వద్దనుకున్న భర్త, నాకు ఆశ్రయం ఇవ్వని తల్లిదండ్రులు, సామాజిక కట్టుబాట్లు... బంధాలన్నిటినీ తెంచుకొని ధైర్యంగా అడుగు బయటకు వేశాను. నా కోసం, నా బిడ్డకు బంగారు భవిష్యత్తు కోసం కృషి చేయాలని సంకల్పించాను. తొలుత ఒక షోరూమ్‌లో హెల్పర్‌గా చేరాను. అదే సమయంలో 'చైల్డ్‌లైన్ ఇండియా ఫౌండేషన్'లో వాలంటీర్‌గా పని చేశాను. అక్కడ నాలా భయంకరమైన కథలున్న మహిళలు చాలామందిని చూశాను. బాల్య వివాహానికి బలయింది నేనొక్కదాన్నే కాదని అప్పుడు అర్థమైంది. అలాంటి మహిళల గళం నేనెందుకు కాకూడదనే ఆలోచన వచ్చింది. నాటి నుంచి మహిళల హక్కుల సాధన, సాధికారత దిశగా అడుగులు వేశాను. ముఖ్యంగా బాల్య వివాహాలను నియంత్రించడంపై దృష్టి పెట్టాను.

**పాఠశాలల్లో పునాది...**

సమాజంలో రుగ్మతలు రూపుమాపి, బాల్య వివాహాలు అరికట్టాలంటే తల్లిదండ్రులతో పాటు బాలికలకు కూడా అవగాహన కల్పించాలి. ఆ ఉద్దేశంతోనే పలు గ్రామాల్లోని బాలికలతో పదిహేను బృందాలు ఏర్పాటు చేశాను. స్థానిక పెద్దలు, నాయకుల సాయం కూడా తీసుకున్నాను. వారందరి సహకారంతో ఎక్కడైనా బాల్య వివాహాలకు సంబంధించిన సమాచారం సేకరిస్తాను. ఎక్కడైనా అందుకు ఏర్పాట్లు జరుగుతుంటే తక్షణం వెళ్లి, పెద్దలతో మాట్లాడి ఆపడానికి ప్రయత్నిస్తాను. ఒకవేళ వినకపోతే తదనంతర పరిణామాల గురించి వివరిస్తాను. అప్పటికీ దారికి రాకపోతే పోలీసుల సహాయం తీసుకొంటాను.

**ఇక్కడే ఎక్కువ...**

'నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే' (ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస)-5 నివేదిక ప్రకారం... 20 నుంచి 24 ఏళ్ల మధ్య వయసుగల ప్రతి ఐదుగురు మహిళల్లో ఇద్దరు 18 ఏళ్లు నిండకుండా పెళ్లి చేసుకున్నవారే. అంత చిన్న వయసులో వివాహ బంధంలోకి అడుగుపెట్టడంవల్ల వాళ్లు విలువైన జీవితాన్ని కోల్పోతున్నారు. అది వారికి జీవితాంతం ఒక మాయని గాయంలా మిగిలిపోతోంది. అలాగే మహిళల అక్రమ రవాణా కూడా పెద్ద సమస్యగా మారింది. వీటన్నిటిపైనా ఒక యుద్ధమే చేస్తున్నా. అమ్మాయిలు నిర్భయంగా తమ జీవితానికి ఏంకావాలో నిర్ణయించుకొనే స్వేచ్ఛను కల్పించేందుకు కృషి చేస్తున్నా. స్వయంసాధికారత దిశగా వారిని నడిపించేందుకు నావంతు ప్రయత్నం ఇది." 'యునిసెఫ్'తో కలిసి...'సేవ్ ది చిల్డ్రన్, యునిసెఫ్' తదితర స్వచ్ఛంద సంస్థలతో కలిసి పని చేస్తూ వచ్చాను. ఆ క్రమంలో బీహార్‌లోని చాలా గ్రామాలు తిరిగాను. బాల్య వివాహాలవల్ల కలిగే అనర్థాలను తల్లిదండ్రులకు చెప్పాను. అది వారి భవిష్యత్తును మొగ్గలోనే చిదిమేస్తుందని, అది చట్టవిరుద్ధమని వివరించాను. ఫలితంగా ఇప్పటికి పదుల సంఖ్యలో బాల్య వివాహాలు ఆపగలిగాను. నా ప్రయత్నానికి ప్రోత్సాహకంగా రెండేళ్ల కిందట జెనీవాలో జరిగిన సదస్సులో 'యునైటెడ్ నేషన్స్' నాకు ప్రతిష్ఠాత్మక అవార్డునిచ్చి సత్కరించింది. సమాజంలో పాతుకుపోయిన కట్టుబాట్లను దాటి, మహిళల జీవితాల్లో మంచి మార్పునకు కృషి చేస్తున్నందుకుగానూ నన్ను కొనియాడింది.

# కంటి ఆరోగ్యం జాగ్రత్త



అత్యంత ప్రధానమైనవే అయినప్పటికీ రోజువారీ పనుల్లో పడిపోయి కండ్ల ఆరోగ్యం గురించి మనం అంతగా పట్టించుకోం. అయితే, గంటల తరబడి డిజిటల్ తెరలకు అతుక్కుపోవడం, బల్బుల కాంతిలో గడపడం, ఆధునిక జీవనశైలి మన కండ్ల ఆరోగ్యానికి హాని చేస్తున్నాయి. మొదట్లో ఏమంత ఇబ్బందిగా అనిపించక పోయినా ఈ అలవాట్లు దీర్ఘకాలంలో కంటి సమస్యలకు అంటుకడతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కంటి సమస్యలకు కారణమయ్యే కొన్ని అలవాట్ల పట్ల శ్రద్ధ చూపాలని సలహా ఇస్తున్నారు.

**డిజిటల్ తెరల దెబ్బ**

స్మార్ట్‌ఫోన్లు, టీవీలు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌ల తెరలను గంటల తరబడి చూస్తుండటంతో కండ్లు ఒత్తిడికి గురవుతాయి. దీంతో పొడిబారడం, మంట, చూపులో సమస్యలు మొదలైనవి తలెత్తుతాయి. ఇవన్నీ అలా ఉంచితే తెరల నుంచి సోకే బ్లూ లైట్ మన నిద్రా చక్రం మీద దుష్ప్రభావం చూపుతుంది. డిజిటల్ పరికరాల వాడకం తప్పనిసరి కాబట్టి, 20 20 20 నియమాన్ని పాటించాలి. ప్రతి ఇరవై నిమిషాలకోసారి ఇరవై సెకండ్లు విరామం తీసుకోవాలి. ఓ ఇరవై అడుగుల దూరంలో ఉన్న వస్తువును చూడటమే ఈ విధానం. చిన్న పిల్లలు అదేపనిగా డిజిటల్ తెరలకు అతుక్కుపోతే హ్రస్వ దృష్టి సమస్య తలెత్తుతుంది. కాబట్టి, ఆరుబయట ఆటలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

**సమస్య నిర్లక్ష్యం**

తలనొప్పి, ఎక్కువ రోజులు కండ్లు పొడిబారడం, అలసిపోయినట్టు ఉండటం మొదలైనవి తీవ్రమైన కంటి సమస్యలకు తొలి సంకేతాలు. వీటిని నిర్లక్ష్యం చేస్తే మరిన్ని సమస్యలు తలెత్తుతాయి. కాబట్టి కండ్లలో అసౌకర్యంగా ఉన్నా, చూపులో ఇబ్బందిగా అనిపించినా కండ్ల డాక్టర్‌ను సంప్రదించడం మంచిది. నిర్లక్ష్యం చేయకూడదు.

**రక్తంలో చక్కెర.. రక్తపోటు**

ఆరోగ్యకరమైన శరీరంతోనే ఆరోగ్యకరమైన కండ్లు సాధ్యమవుతాయి. ఒకవేళ మధుమేహం, అధిక రక్తపోటు ఉంటే కండ్ల మీద దుష్ప్రభావం పడుతుంది. మధుమేహ రోగుల్లో కంటి శుక్లాలు, గ్లకోమా, డయాబెటిక్ రెటినోపతీ, కంటి ఇన్ఫెక్షన్లు తలెత్తే ముప్పు ఎక్కువ. కాబట్టి రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలు, కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో పెట్టుకోవడం అత్యవసరం.

**సొంతవైద్యం వద్దు**

కండ్లకు ఏదైనా ఇబ్బంది వస్తే డాక్టర్ దగ్గరికి వెళ్లకుండా మనకు తెలిసిన వైద్యమో, తెలిసినవాళ్లు చెప్పిందో చేసేసుకుంటూ ఉంటాం. ఇక స్థానిక మందుల దుకాణానికి వెళ్తే కంటిమంట, అసౌకర్యానికి మామూలు డ్రాప్స్ ఇస్తాడు. అయితే, వీటిలో స్టెరాయిడ్స్ ఉండే అవకాశం ఉంటుంది. దీర్ఘకాలంలో ఇవి కండ్లకు హానిచేస్తాయి. కాబట్టి, కంటి డాక్టర్ సూచించిన డ్రాప్స్ మాత్రమే వాడాలి.

**అల్ట్రావయొలెట్ కిరణాలు**

సూర్యుడి కాంతిలో అల్ట్రావయొలెట్ (యూవీ) కిరణాలు కూడా ఉంటాయి. తగిన జాగ్రత్తలు తీసుకోకుండా ఎండలో తిరిగితే కాలం గడిచేకొద్దీ కండ్లలో శుక్లాలు, మాక్యులర్ డిజనరేషన్ (వయసు పెరిగే కొద్ది తలెత్తే దృష్టిలోపం) లాంటి సమస్యలు తలెత్తుతాయి. సన్ గ్లాసెస్ వాడటం వల్ల అల్ట్రావయొలెట్ కిరణాల నుంచి కండ్లను రక్షించుకోవచ్చు. మనం వాడే సన్‌గ్లాసెస్ కూడా యూవీ ఏ, యూవీ బీ రేడియేషన్ నుంచి కూడా రక్షణను ఇచ్చేవై ఉండాలి.

**సిఫారసు చేయని అద్దాలు**


కంటి చూపు బాగుండాలన్నా, కంటి సమస్యల తొలి సంకేతాలను గుర్తించాలన్నా క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలి. అయితే, చాలామంది వీటి గురించి అంతగా పట్టించుకోరు. తమ చూపు బాగానే ఉందనుకుని కంటి అనారోగ్య లక్షణాలను నిర్లక్ష్యం చేస్తారు. మరో విషయం డాక్టర్లు సూచించిన కళ్లద్దాలు వాడకపోతే సమస్య ముదిరిపోతుంది. కాబట్టి, కంటి ఆరోగ్యం కాపాడుకోవడానికి నలభై లోపువాళ్లయితే రెండేండ్లకోసారి, నలభై దాటితే ఏడాదికోసారి పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి.

# డైనమిక్ ఐపీఎస్ ఆఫీసర్



ఇరవై ఏళ్లలో నలభై బదిలీలు ఉమాభారతి మాజీ సీఎం, మాజీ మంత్రి. హుబ్లీలో ఆమెను అరెస్టు చేయవలసి వచ్చింది! ఎవరున్నారు అరెస్ట్ చెయ్యడానికి?! రూప, ఐపీఎస్! శశికళ శక్తిమంతురాలైన ఖైదీ. పరప్పన జైల్లో ఆమెను వీవీఐపీలా చూస్తున్నారు. ఈ విషయాన్ని ధైర్యంగా బయటపెట్టిందెవరు? రూప, ఐపీఎస్! బెంగళూరు 'సేఫ్ సిటీ'.. వందల కోట్ల ప్రాజెక్ట్. టెండర్‌లలో గోల్‌మాల్ జరుగుతోంది. ఆ అవినీతి గుట్టును రట్టు చేసిందెవరు? రూప, ఐపీఎస్. ఏం పోలీస్ ఆఫీసర్! ఎంత పవర్‌ఫుల్!! ఆ పవర్‌కు ప్రతిఫలం ఏంటో తెలుసా? ఇరవై ఏళ్లలో నలభై ట్రాన్స్‌ఫర్‌లు!! జనవరి ఒకటిన మళ్లీ ఇంకో బదిలీ. నేరస్థులకు హ్యాండ్‌కఫ్స్ వేయవలసిన రూప..'హ్యాండ్లూమ్స్' ఎండీ సీట్లో కూర్చున్నారు. రూప 2000 బ్యాచ్ ఐపీఎస్ ఆఫీసర్. కర్ణాటక క్యాడర్. యూపీఎస్సీలో ఆలిండియాలో 5వ ర్యాంకు. హైదరాబాద్‌లోనే.. 'సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషల్‌పోలీస్ అకాడమీ'లో ట్రైనింగ్ తీసుకున్నారు. ఎం.ఎ. సైకాలజీ చేసి ఐపీఎస్ వైపు వచ్చారు. నేరాన్ని, అవినీతిని తేలిగ్గా పసిగట్టేయడం ఆమె సహజ నైజమేమో అనిపిస్తుంది. అందుకే సైబర్ క్రైమ్ డిపార్ట్‌మెంట్‌కి దేశంలోనే తొలి లేడీ బాస్ అయ్యారు రూప! యువతలో స్ఫూర్తిని నింపడానికి తరచు 'టెడెక్స్' టాక్స్ (టెక్నాలజీ, ఎంటర్‌టైన్‌మెంట్, డిజైన్) కూడా ఇస్తుంటారు. ఇరవై ఏళ్ల క్రితమే ఆమె ఐపీఎస్ ఆఫీసర్ అయినా, ఇప్పటికీ కొత్తగా జాయిన్ అయిన ఆఫీసర్‌లానే చురుగ్గా, వేగంగా ఉంటారు. ఉండకూడదని కాదు. ఇరవై ఏళ్లల్లో నలభైసార్లు ఆమె బదిలీ అయ్యారు. ప్రమోషన్ మీద కొన్నిసార్లు, ప్రమోషన్ పేరుతో చాలాసార్లు. ఆమె తెగింపు కొన్నిసార్లు ప్రభుత్వానికి ఉపయోగపడింది. చాలాసార్లు తలనొప్పి అయింది. హుబ్లీ అల్లర్ల కేసులో విచారణ కోసం వచ్చిన ఉమాభారతిని అరెస్ట్ చేయడానికి ప్రభుత్వానికి రూప అవసరం అయ్యారు. జైళ్ల శాఖ డీఐజీగా ఉన్నప్పుడు శశికళకు ప్రత్యేక సదుపాయాలు అందుతున్నాయని బయటపెట్టినందుకు మాత్రం ప్రభుత్వానికి ఆమె తలనొప్పి అయ్యారు. నెల తిరగ్గానే అక్కడి నుంచి ఆమెను 'ట్రాఫిక్, రోడ్ సేఫ్టీ' కమిషనర్‌గా బదిలీ చేశారు. తాజా ట్రాన్స్‌ఫర్ కూడా అటువంటిదే. నగర మహిళల భద్రత కోసం సౌకర్యాలు కల్పించే 'సేఫ్ సిటీ ప్రాజెక్టు' టెండర్‌లో ఒక ఏసీపీ డబ్బు మూట కట్టుకుంటున్నాడని ఆరోపించినందుకు అతడిపై ఎంక్వయరీ చెయ్యకుండా (అతడిపై సీబీఐ చార్జిషీటు ఉన్నప్పటికీ) ఆమెను హస్తకళల వస్తూత్పత్తి విక్రయ కేంద్రానికి ఎండీగా బదిలీ చేశారు! బదలీకి ముందు ఆమె కర్ణాటక రాష్ట్రానికి తొలి మహిళా హోంశాఖ కార్యదర్శి! అంతెత్తు నుంచి కిందికి తోసేశారు. అయితే రూప ఎప్పుడూ హోదాలను ఉన్నత స్థానాలుగా భావించలేదు. ఎంత ఐపీఎస్ అయినా, ఐఏఎస్ అయినా మనిషిగా ఉండటం కన్నా పెద్ద డిజిగ్నేషన్ లేదంటారు ఆమె. "ప్రభుత్వం నియమించుకున్న ఒక ప్రజాసేవకురాలిని మాత్రమే నేను' అంటారు. ఇరవై ఏళ్ల క్రితం ధార్వాడ్ జిల్లా ఎస్పీగా ప్రారంభమైన రూప కెరియర్ అనేక మలుపులు తిరుగుతూ, అనేక శాఖలను తాకుతూ ప్రస్తుతానికి కర్ణాటక హస్తకళాకేంద్రం 'కావేరీ ఎంపోరియం'కి చేరుకుంది. "నేనేమీ చిన్నతనంగా భావించడం లేదు. బాధ్యత ఏదైనా బాధ్యతే. తక్కువ ఎక్కువ ఉండదు. కర్ణాటక హొయసల సాంస్కృతిక హస్త కళలకు దేశవ్యాప్త గుర్తింపు ఉంది. లక్షలాది మంది చందనశిల్ప, బిద్రీ లోహ కళాకారుల సంక్షేమం కోసం కృషి చేస్తాను" అంటున్నారు రూప. అయితే మరొకసారి ఆమెను బదిలీ చేయవలసిన అనివార్యతల్ని ప్రభుత్వం ఎదుర్కొనేలా ఉంది! రెండుసార్లు రాష్ట్రపతి అవార్డు పొందిన ఈ పవర్‌ఫుల్ సీనియర్ పోలీస్ ఆఫీసర్‌ను కక్ష సాధింపుగా మాత్రమే ప్రాధాన్యంలేని పోస్టులోకి మార్చారన్న అసంతృప్తి కర్ణాటక ప్రజల్లోనే కాదు, దేశవ్యాప్తంగానూ వ్యక్తం అవుతూ ఉండటమే అందుకు కారణం. రూప, ఐపీఎస్ ఈ నెలలోనే తన పోలీస్ డ్యూటీలోకి తను మళ్లీ వెనక్కి వచ్చేయొచ్చు. ఈసారి మరింత శక్తిమంతంగా! మ్యూజిక్ ఇష్టం రూప తండ్రి దివాకర్ రిటైర్డ్ ఇంజినీర్. తల్లి హేమావతి గృహిణి. కర్ణాటకలోని దావణగెరె వారి స్వస్థలం. ఇద్దరే సంతానం. రూప, రోహిణి. ఆమె చెల్లెలు రోహిణి ఐఆర్‌ఎస్ ఆఫీసర్. రూప పెళ్లి 2003లో మునీష్ మౌద్గిల్‌తో జరిగింది. ఆయన ఐఏఎస్ ఆఫీసర్. ఇద్దరు పిల్లలు అనఘ, రోషిల్. రూపకు మ్యూజిక్ అంటే ఇష్టం. లలిత సంగీతంలో కొంత ప్రవేశం కూడా ఉంది. 2018లో మహిళా దినోత్సవం కోసం ఒక స్ఫూర్తిదాయకమైన మ్యూజిక్ వీడియోను కూడా రూపొందించారు. 2019 లో రిలీజ్ అయిన 'బయలాతడ భీమన్న' చిత్రంలో 'కెంపానే సూర్య' అనే పాట పాడారు.

# అక్కలూ.. ఇవీ మీ హక్కులు!



యావత్ దేశాన్నీ కుదిపేసిన 'కోల్‌కతా జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటన' నేపథ్యంలో బెంగాల్ ప్రభుత్వం 'అపరాజిత' బిల్లును తీసుకొచ్చింది. మహిళలు %-% పిల్లలపై లైంగిక నేరాలు, వేగవంతమైన విచారణ, దోషులకు కఠిన శిక్షలు విధించడమే లక్ష్యంగా.. బెంగాల్ అసెంబ్లీలో ఈ బిల్లు ఆమోదం పొందింది. అప్పుడెప్పుడో 2012లో జరిగిన 'ఢిల్లీ హత్యాచార ఘటన' సందర్భంగా 'నిర్భయ' చట్టం అమల్లోకి వచ్చింది. ఇప్పుడు బెంగాల్ ప్రభుత్వం 'అపరాజిత' బిల్లును ఆమోదించింది.

ఈ క్రమంలో ఎన్నో ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. అసలు.. మహిళలు %-% చిన్నారులపై వేధింపులు, వారి రక్షణ కోసం జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ఎలాంటి చట్టాలు అమలులో ఉన్నాయి? వాటిలో ముఖ్యమైనవి ఏవి? మహిళలను రక్షించడానికి జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో అనేక చట్టాలు రూపొందాయి. అయితే, ఆయా చట్టాలపై సరైన అవగాహన లేకపోవడంతో బాధితులు వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో భారతదేశంలోని ప్రతి మహిళా తెలుసుకోవాల్సిన ఏడు ముఖ్యమైన చట్టపరమైన హక్కుల గురించి ఇప్పుడు తెలుసుకుందాం!

**1 గృహహింసకు వ్యతిరేకంగా..**

గృహహింస నిరోధక చట్టం %-% 2005.. మహిళలను ఇంట్లో ఎదురయ్యే హింస నుంచి రక్షిస్తుంది. గృహిణిపై చేయి చేసుకోవడమే కాదు.. ఆమెను మాటల ద్వారా, ఆర్థికంగా, భావోద్వేగాలపరంగా, లైంగికంగా వేధించినా.. 498 సెక్షన్ ప్రకారం దోషులను కఠినంగా శిక్షించవచ్చు.

**2 పనికి తగ్గ జీతం**

సమాన పనికి సమాన వేతనం పొందడం మహిళల హక్కు. మహిళా కూలీలు మొదలుకొని.. ఉన్నతోద్యోగాలు చేసే మహిళల కోసం 'సమాన వేతన చట్టం' అమలులో ఉన్నది. పనిచేసే మహిళలు.. వారి సహోద్యోగులతో సమానమైన వేతనాన్ని ఈ చట్టం ద్వారా డిమాండ్ చేయొచ్చు. కూలీలు, ఉద్యోగినులకు వేతనాలు, ఇతర అలవెన్సుల విషయంలో లింగ వివక్ష చూపడం నేరం కూడా!

**3 పని ప్రదేశాల్లో రక్షణ**

పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు ప్రత్యేకమైన చట్టం ఉన్నది. ఈ చట్టం ప్రకారం.. పనిలో లైంగిక వేధింపులకు గురైతే.. ఉన్నతాధికారులకు నివేదించే హక్కు మహిళలకు ఉంది. ఈ చట్టం ప్రకారం.. పనిలో లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించడానికి, వాటిపై విచారణ చేపట్టడానికి సంస్థలు అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటుచేయాలి. పది లేదా అంతకంటే ఎక్కువమంది ఉద్యోగులు ఉన్న ప్రతి కంపెనీ.. ఈ కమిటీని ఏర్పాటు చేసుకోవాల్సిందే! ఎవరైనా మహిళా ఉద్యోగి వేధింపులకు గురైతే.. సదరు బాధితురాలు ఈ అంతర్గత ఫిర్యాదుల కమిటీకి ఫిర్యాదు చేయవచ్చు.

**4 రాత్రిపూట అరెస్టు వద్దు**

సూర్యాస్తమయం తర్వాత, సూర్యోదయానికి ముందు.. మహిళలను అరెస్టు చేయకూడదు. ఏవైనా తప్పనిసరి పరిస్థితులు ఎదురైతే.. ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఆదేశంతో మాత్రమే రాత్రి సమయంలో మహిళలను అరెస్టు చేయడానికి అవకాశం ఉంటుంది. అంతేకాకుండా, మహిళా ఖైదీని ప్రశ్నించే సమయంలో మహిళా కానిస్టేబుల్‌తోపాటు మహిళకు చెందిన కుటుంబసభ్యులు లేదా స్నేహితులు కూడా ఆమె పక్కన ఉండొచ్చు.

**5 అజ్ఞాతం.. మీ హక్కు**

లైంగిక వేధింపులకు గురైన మహిళలకు.. 'గోప్యత హక్కు' ఉంటుంది. దీని ప్రకారం.. బాధితురాలి పేరు, ఇతర వివరాలను బయటికి వెల్లడించకూడదు. మేజిస్ట్రేట్ ఎదుట ఒంటరిగా లేదా మహిళా పోలీసు అధికారి సమక్షంలో తన వాంగ్మూలాన్ని నమోదు చేసుకునే హక్కు బాధితురాలికి ఉంటుంది.

**6ఉచిత న్యాయ సేవ**

లీగల్ సర్వీసెస్ అథారిటీస్ యాక్ట్.. అత్యాచార బాధితులకు ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తుంది. మహిళలు ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు న్యాయ సహాయం పొందడానికి ఈ చట్టం హామీ ఇస్తుంది.

**7గౌరవానికి భంగం వద్దు!**

లైంగిక వేధింపుల బాధితురాలికి.. తన గౌరవానికి భంగం కలగకుండా చూసుకొనే హక్కు ఉంటుంది. దీని ప్రకారం.. ఏదైనా వైద్య పరీక్షలు అవసరమైతే కేవలం మహిళా వైద్యురాలి ద్వారానే పరీక్షలు నిర్వహించాలి. ఇతరుల సమక్షంలో ఏ విధమైన శారీరక/

# ఇంటి పనీ వర్కవుట్ అవుతుంది



మనం ఇంట్లో రకరకాల పనులు చేస్తూ ఉంటాం. ప్రతి పనికీ కొన్ని క్యాలరీలు ఖర్చవుతూ ఉంటాయి. రోజూ శ్రద్ధగా ఇంటి పనులు చేస్తూ సులువుగా బరువు తగ్గవచ్చు అంటున్నారు...

ఇంటి పనీ వర్కవుట్ అవుతుంది

మనం ఇంట్లో రకరకాల పనులు చేస్తూ ఉంటాం. ప్రతి పనికీ కొన్ని క్యాలరీలు ఖర్చవుతూ ఉంటాయి. రోజూ శ్రద్ధగా ఇంటి పనులు చేస్తూ సులువుగా బరువు తగ్గవచ్చు అంటున్నారు నిపుణులు. ఆ వివరాలు...

పనులన్నింటిలోకి సులువైనది ఇల్లు ఊడవడం. కొద్దిగా వంగి మెల్లగా నడుస్తూ చీపురుతో ఇల్లు ఊడవడం అలాగే తడిగుడ్డతో ఇల్లు, ఫర్నిచర్ తుడవడం వల్ల తెలియకుండానే శారీరక శ్రమ చేసినట్లవుతుంది. తేలికపాటి వ్యాయామం చేసిన ఫలితం దక్కుతుంది.

నిలబడి వంట చేయడం, కూరగాయలు తరగడం, వంట సామాగ్రి కోసం అటూ ఇటూ తిరగడం వల్ల కూడా అధికంగానే క్యాలరీలు ఖర్చవుతాయి. వంట పాత్రలను రుద్ది కడిగినా శరీరం శ్రమ పడుతుంది. ఈ పనులన్నీ బరువు తగ్గడానికి తోడ్పడతాయి.

ఇంట్లో పంపు కింద బకెట్లో నీళ్లు పట్టి బట్టలు నానబెట్టి ఉతికితే శరీరానికి వ్యాయామం చేసినట్లే అవుతుంది. నేలమీద పీటపై కూర్చుని వంగి బట్టలకు సబ్బురాసి బ్రష్‌తో రుద్దుతూ ఉతకడం వల్ల వెన్నెముక, నడుము భాగాలకు శ్రమ కలుగుతుంది. బట్టలను నీళ్లలో ముంచి తీయడం, వాటినుంచి నీళ్లను పిండడం, నిటారుగా నిలబడి బట్టలు ఆరేయడం వల్ల అధికంగా క్యాలరీలు ఖర్చవుతాయి.

నిలబడి దుస్తులు ఇస్త్రీ చేయడం కూడా మంచి వర్కౌటే. దీనివల్ల కళ్లు, చేతులు, మెడ భాగాలకు పని పెరిగి శక్తి వినియోగమవుతుంది.

తోటపని చేయడం వల్ల కూడా క్యాలరీలు ఖర్చవుతాయి.

# శిరోజాల కోసం తులసి

తులసి ఆకులను ఎండబెట్టి పొడి చేయాలి. కొబ్బరి నూనెలో రెండు స్పూన్లు ఈ పొడిని వేసి సన్నని మంట మీద పెట్టాలి. నూనె వేడయ్యాక కొన్ని మెంతులు వేసి మరికొంతసేపు వేడి చేయాలి. చల్లారాక ఆ నూనెను మాడుకు పట్టించాలి. రెండు గంటల తరువాత తలస్నానం చేయాలి. దీనివల్ల చుండ్రు, తలలో ఉండే చిన్న కురుపులు, దురద వంటి సమస్యలు దూరమవుతాయి.

రెండు టేబుల్ స్పూన్ల మెంతులను రాత్రంతా నానబెట్టాలి. ఉదయం తులసి ఆకులు, టేబుల్ స్పూన్ పెరుగు వేసి ఆ మెంతులను మెత్తని పేస్టులా రుబ్బి తలకు మాస్క్ వేయాలి. అరగంట తరువాత మైల్డ్ షాంపూతో తలస్నానం చేస్తే కుదుళ్లు బలంగా మారుతాయి.

కొన్ని తులసి ఆకులను రుబ్బి, అందులో కలబంద గుజ్జును కలిసి మాడుకు, జుట్టుకు పట్టించి అరగంట తరువాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. దీని వలన చుండ్రు తగ్గడంతో పాటు కేశాలు మృదువుగా మారుతాయి.కొన్ని తులసి ఆకులు, కొన్ని వేప ఆకులు తీసుకుని మెత్తగా రుబ్బాలి. ఆ పేస్టులో ఒక స్పూన్ నిమ్మరసం కలిసి తలకు బాగా పట్టించి అయిదు నిమిషాలు మర్దన చేయాలి. పావుగంట తరువాత గోరువెచ్చని నీటితో తలస్నానం చేస్తే మాడుకు అంటి ఉన్న బ్యాక్టీరియా తొలగిపోయి దురద వంటి సమస్యలు తగ్గుతాయి.






## స్వల్ప లాభంతో సరి..90 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

**ముంబై-నవభూమి:** మార్కెట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లలో కొనుగోళ్ల ప్రామాణిక సూచీలను మంగళవారం లాభాల్లో నడిపించాయి. ఒక దశలో 267.83 పాయింట్లు ఎగబాకిన సెన్సెక్స్.. చివరికి 90.83 పాయింట్ల స్వల్పలాభంతో 83,697.29 వద్ద ముగిసింది. నిఫ్టీ 24.75 పాయింట్లు పెరిగి 25,541.80 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 13 లాభపడగా.. మిగతా 17 నష్టపోయాయి. భారత్ ఎలక్ట్రానిక్స్ షేరు 2.51 శాతం ఎగిసి




సూచీ టాప్ గెయినర్‌గా నిలవగా.. రిలయన్స్ స్టాక్ 1.84 శాతం పెరిగింది. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు మాత్రం 0.18 శాతం వరకు నష్టపోయాయి.సిగాచీ షేరు మరో 6 శాతం పతనం: హైదరాబాద్‌కు చెందిన ఫార్మా కంపెనీ సిగాచీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ షేరు వరుసగా రెండో రోజూ భారీ పతనాన్ని చవిచూసింది. బీఎస్ఈలో కంపెనీ షేరు మరో 6 శాతం మేర క్షీణించి రూ.46.07 వద్ద ముగిసింది.

# మధ్య తరగతికి కేంద్రం మరో శుభవార్త..?



**ముంబై-నవభూమి:** మధ్యతరగతి ప్రజలకు కేంద్ర ప్రభుత్వం త్వరలో ఒక తీపి కబురు చెప్పనుంది. నిత్యావసర వస్తువులపై జీఎస్టీ తగ్గించే ఆలోచనలో ఉంది. దీని ద్వారా సామాన్యులపై ఆర్థిక భారం తగ్గించాలని చూస్తోంది. ఆదాయపు పన్ను పరిమితిని పెంచిన తర్వాత, ఇప్పుడు జీఎస్టీ తగ్గింపుతో మరింత ఊరట కలిగించనుంది. ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వానికి దాదాపు రూ. 40 వేల కోట్ల భారం పడుతుంది. అయితే, వినియోగం పెంచడం ద్వారా ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచాలని ప్రభుత్వం భావిస్తోంది. జీఎస్టీ కౌన్సిల్ ఆమోదం తర్వాత ఈ మార్పులు అమల్లోకి వస్తాయి. మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా ఉపయోగించే వస్తువులపైనే జీఎస్టీ తగ్గించాలని కేంద్రం యోచిస్తోంది. ప్రస్తుతం 12 శాతం జీఎస్టీ ఉన్న వస్తువులను 5 శాతం శ్లాబ్‌లోకి మార్చాలని చూస్తోంది. కొన్ని వస్తువులపై జీఎస్టీని పూర్తిగా తొలగించే అవకాశం కూడా ఉంది.

జీఎస్టీ తగ్గింపు జాబితాలో చాలా వస్తువులు ఉన్నాయి. టూత్‌పేస్టు, టూత్ పౌడర్, గొడుగులు, కుట్టుమిషన్లు వంటి వాటిపై జీఎస్టీ తగ్గించవచ్చు. ప్రెజర్ కుక్కర్లు, వంటగది పాత్రలు, గీజర్లు, వాషింగ్ మెషీన్లు, ఎలక్ట్రిక్ ఐరన్‌లు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. సైకిళ్లు, వాక్యూమ్ క్లీనర్‌లు, రూ. 1000 పైబడిన రెడీమేడ్ దుస్తులు, ఫుట్‌వేర్, స్టేషనరీ వస్తువులపై కూడా జీఎస్టీ తగ్గించే అవకాశం ఉంది. వ్యాక్సిన్లు, హెచ్‌ఐవి హెపటైటిస్, టీబీ డయాగ్నస్టిక్ కిట్‌లు, సిరామిక్ టైల్స్, వ్యవసాయ పనిముట్లు, కండెన్స్‌డ్ మిల్క్, ఫ్రోజెన్ కూరగాయలు, సోలార్ వాటర్ హీటర్‌లపై కూడా జీఎస్టీని తగ్గించే ఆలోచనలో కేంద్రం ఉన్నట్లు సమాచారం.ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వ ఖజానాపై రూ. 40,000 కోట్ల నుంచి రూ. 50,000 కోట్ల వరకు భారం పడుతుంది. కానీ, ఈ భారాన్ని భరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ధరలు తగ్గడం వల్ల ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేస్తారని ప్రభుత్వం భావిస్తోంది. దీని ద్వారా ఆర్థిక వ్యవస్థకు మేలు జరుగుతుందని ఆశిస్తోంది. పన్ను పరిధి పెరగడంతో జీఎస్టీ వసూళ్లు కూడా పెరుగుతాయని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడారు. "దిగువ, మధ్య తరగతికి ఊరట కల్పించే దిశగా జీఎస్టీ రేట్లు హేతుబద్ధీకరించాలని భావిస్తున్నట్లు" ఆమె చెప్పారు. ఈ మార్పులు చేయాలంటే జీఎస్టీ కౌన్సిల్ ఆమోదం తప్పనిసరి. ప్రతి రాష్ట్రానికి జీఎస్టీ కౌన్సిల్‌లో ఓటు హక్కు ఉంటుంది. కొన్ని రాష్ట్రాలు ఈ మార్పులను వ్యతిరేకిస్తున్నాయి. పంజాబ్, కేరళ, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలు వ్యతిరేకించే అవకాశం ఉంది. జీఎస్టీ కౌన్సిల్ చరిత్రలో ఇప్పటివరకు ఒక్కసారి మాత్రమే ఓటింగ్ జరిగింది. మిగిలిన అన్ని నిర్ణయాలు అందరి అంగీకారంతోనే తీసుకున్నారు.

ఈ నెలాఖరులో 56వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరిగే అవకాశం ఉంది. సమావేశానికి కనీసం 15 రోజుల ముందు నోటీసు ఇవ్వాలి. ఈ సమావేశంలో మధ్యతరగతికి ఊరట కల్పించే ప్రతిపాదనలపై చర్చించే అవకాశం ఉంది. ఈ ప్రతిపాదనలు ఆమోదం పొందితే, సామాన్యులకు నిత్యావసర వస్తువులు తక్కువ ధరకే అందుబాటులోకి వస్తాయి. తద్వారా వారి ఆర్థిక భారం కొంత వరకు తగ్గుతుంది.

## రూ.15 వేల పెట్టుబడితో రూ.12 కోట్ల రాబడి.. ఎలాగో తెలుసా..



**న్యూఢిల్లీ-నవభూమి:** అనేక మంది కూడా కోటీశ్వరులు కావాలని భావిస్తుంటారు. కానీ దాని కోసం ఏం చేయాలి, ఎలా చేయాలనే విషయాలు మాత్రం తెలియవు. అలాంటి వారు దీర్ఘకాలంలో పెట్టుబడులు చేయాలని చూస్తే మాత్రం, సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ బెస్ట్ ఆప్షన్ అని చెప్పవచ్చు. దీనిలో చిన్న మొత్తాలతో మొదలుపెట్టి, సమయానుకూలంగా పెద్ద మొత్తాలుగా మార్చుకోవచ్చు. అయితే సంపదను సృష్టించుకోవడం ఒకేసారి సాధ్యం కాదు. కానీ క్రమంగా పొదుపు చేస్తూ పెట్టుబడులు పెడితే మాత్రం దీర్ఘకాలంలో తప్పకుండా కోటీశ్వరులు అవుతారని నిపుణులు చెబుతున్నారు.ఈ నేపథ్యంలో మీరు ప్రతి నెలా రూ. 15,000 చొప్పున క్రమంగా పెట్టుబడి చేస్తే, కొన్నేళ్లలోనే రూ.12 కోట్లు సంపాదించడం ఈజీగా సాధ్యమవుతుందని అంటున్నారు నిపుణులు. గతంలో పలు రకాల ఈక్విటీ ఫండ్లు సగటున 12% నుంచి 21% వరకు వార్షిక వృద్ధిరేటును అందించాయి. దీని ప్రకారం ఇక్కడ 15% %జూా+= (జశీఎజూశీబఅఎ ాూఅఅబఝశ్రీ +తీశీష్ట్ర ఞ్వ%) పరిగణలోకి తీసుకుంటే కేవలం 33 ఏళ్లలోనే రూ.12 కోట్లు దక్కించుకోవచ్చు. ఈ క్రమంలో చేసిన మొత్తం పెట్టుబడి రూ. 59,40,000 కాగా, వచ్చే రాబడి మాత్రం దాదాపు రూ.12,91,53,034గా ఉంటుంది. అంటే ఇక్కడ వడ్డీ రూపంలోనే రూ.12,32,13,034 రానున్నాయి.

## పసిడి ప్రియులకు షాక్.. మళ్లీ పెరిగిన బంగారం ధరలు..



**న్యూఢిల్లీ-నవభూమి:** నిన్న 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 90,200 రూపాయల దగ్గర..10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 98,400 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర 73,800 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది.

గత కొన్ని రోజుల నుంచి బంగారం ధరలు బాగా తగ్గుతూ వచ్చాయి. గత నెలలో స్వచ్ఛమైన బంగారం లక్ష దగ్గర ట్రేడ్ అయింది. దిగువ, మధ్య తరగతి వాళ్లకు షాక్ ఇచ్చింది. అయితే, తర్వాతి నుంచి ధరలు తగ్గుతూ వచ్చాయి. ప్రస్తుతం 24 క్యారెట్ల బంగారం 98 వేల దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇప్పటికి బంగారం ధరలు తగ్గినా.. భవిష్యత్తులో లక్ష దాటే అవకాశం కనిపిస్తోంది.భాగ్య నగరంలో నిన్న 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 90,200 రూపాయల దగ్గర..10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 98,400 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర 73,800 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. నిన్నటితో పోల్చుకుంటే పది గ్రాముల బంగారంపై.. గ్రాముకు ఒక రూపాయి చొప్పున 10 రూపాయలు పెరిగింది. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 98,410 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 90,210 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర .. 73,810 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది.

## రూ.11. 65 లక్షల కోట్లు.. రెమిటెన్స్‌ల్లో సరికొత్త రికార్డు



**న్యూఢిల్లీ-నవభూమి:** గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ప్రవాస భారతీయులు స్వదేశానికి రికార్డు స్థాయిలో 13,546 కోట్ల డాలర్ల (దాదాపు రూ.11.65 లక్షల కోట్లు) నిధులు పంపారు. ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం.. అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2023-24)తో పోలిస్తే, దేశంలోకి రెమిటెన్స్‌లు 14 శాతం పెరిగాయి. 8 ఏళ్ల క్రితం (2016-17 ఆర్థిక సంవత్సరం) వచ్చిన 6,100 కోట్ల డాలర్ల (రూ.5.25 లక్షల కోట్లు) రెమిటెన్స్‌లతో పోలిస్తే రెట్టింపునకు పైగా పెరిగాయి. మరిన్ని విషయాలు..ప్రపంచంలో అత్యధిక రెమిటెన్స్‌లు అందుకున్న దేశాల్లో భారత్ మరోసారి తన అగ్రస్థానాన్ని కొనసాగించింది. ఈ విషయంలో భారత్ పదేళ్లకు పైగా కాలంగా నం.1 స్థానంలో ఉంది.గత ఆర్థిక సంవత్సరంలో లక్ష కోట్ల డాలర్లుగా నమోదైన కరెంట్ ఖాతా నిధుల రాకలో 10 శాతానికి పైగా వాటా రెమిటెన్స్‌లదే.ఆర్‌బీఐ రీసెర్చ్ ప్రకారం.. మొత్తం రెమిటెన్స్‌లో 45 శాతం అమెరికా, బ్రిటన్, సింగపూర్ వంటి అభివృద్ధి చెందిన దేశాల నుంచే వస్తున్నాయి. గతంలో అధిక రెమిటెన్స్‌లు సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, ఖతార్ వంటి గల్ఫ్ దేశాల నుంచి వచ్చేవి. గడిచిన కొన్నేళ్లలో గల్ఫ్ దేశాల వాటా క్రమంగా తగ్గుతూ వస్తోంది. భారత వృత్తి నిపుణులు అభివృద్ధి చెందిన దేశాలకు వలస పోతుండటం ఇందుకు కారణం.రెమిటెన్స్‌లు మన వాణిజ్య లోటును తగ్గించడంలో, ఆర్థిక వ్యవస్థ బలోపేతంలోనూ ముఖ్య భూమిక పోషిస్తున్నాయి. 2024-25లో మన వాణిజ్య లోటు 28,700 కోట్ల డాలర్లు. ఈ లోటులో 47 శాతం వరకు రెమిటెన్స్‌లతో పూడ్చుకోవచ్చన్నమాట.

## హైదరాబాద్‌లో ఎస్‌బీఐ గ్లోబల్ ట్రేడ్ ఫైనాన్స్ సెంటర్

**హైదరాబాద్-నవభూమి:** దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) 70వ వార్షికోత్సవం సందర్భంగా అంతర్జాతీయ వాణిజ్య లావాదేవీలపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా హైదరాబాద్ సహా కోల్‌కతాలో రెండు గ్లోబల్ ట్రేడ్ ఫైనాన్స్ సెంటర్స్ (జీటీఎఫ్‌సీ)ను ప్రారంభించింది. ఈ కేంద్రాల ద్వారా ఎగుమతి, దిగుమతిదారులకు త్వరితగతిన అవసరమైన అందించనున్న ట్లు ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి వెల్లడించారు. అంతర్జాతీయ బ్యాంకింగ్ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వ్యూహాత్మకంగా ఈ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. అంతర్జాతీయ వాణిజ్యం రోజురోజుకి డిజిటలైజ్ అవుతోంది. దీంతో మారుతున్న జాతీయ, అంతర్జాతీయ వాణిజ్య అవసరాలకు అనుగుణంగా బ్యాంక్ ఫైనాన్స్ సామర్థ్యాలను పునర్ వ్యవస్థీకరించాల్సిన అవసరం ఏర్పడిందని, ఈ రెండు కేంద్రాల ద్వారా ఆ లక్ష్యం నెరవేరుతుందని శెట్టి తెలిపారు.

# భారీగా పెరిగిన పెట్రోల్ వినియోగం..

## ధరలపై కేంద్ర మంత్రి కీలక ప్రకటన



**ముంబై-నవభూమి:** దేశంలో పెట్రోల్ వినియోగం భారీగా పెరిగింది. గత జూన్ నెలలో ఇయర్ ఆన్ ఇయర్ ప్రాతిపదికన చూసుకుంటే పెట్రోల్ సేల్స్ 6.4 శాతం మేర పెరిగాయి. ఇదే సమయంలో డీజిల్ విక్రయాలు 1.20 శాతం మేర వృద్ధి నమోదు చేశాయి. పెట్రోలియం, నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ అధికారిక గణాంకాల ప్రకారం పెట్రోల్, డీజిల్ సేల్స్ పెరిగినట్లు స్పష్టమవుతోంది. వీటితో పాటు విమానాల్లో ఉపయోగించే ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ( సేల్స్ సైతం 3.6 శఆతం మేర పెరిగాయి. ఇక వంటింట్లో ఉపయోగించే కుకింగ్ గ్యాస్ లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ వినియోగం ఏకంగా 10.2 శాతం పెరిగింది.ఇక త్రైమాసిక ప్రాతిపదికన చూస్తే ఏప్రిల్- జూన్ క్వార్టర్‌లో పెట్రోల్ సేల్స్ 6.9 శాతం పెరిగాయి. డీజిల్ సేల్స్ 2.50 శాతం, జెట్ ఫ్యూయల్ వినియోగం 3.90 శాతం, వంట గ్యాస్ సేల్స్ 10.1 శాతం చొప్పున పెరిగాయి. అయితే, పెట్రోల్, డీజిల్ సేల్స్ పెరిగేందుకు వేసవి సెలవులు దోహదపడినట్లు పెట్రోలియం విభాగం వర్గాలు తెలిపాయి. అయితే, వర్షాకాలం ముందుగా రావడంతో డీజిల్ విక్రయాలు ఒక్కసారిగా తగ్గిపోవచ్చని పేర్కొంటున్నాయి.ముడి చమురు ధరలపై కేంద్రం పెట్రోలియం, నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి మంగళవారం కీలక ప్రకటన చేశారు. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ బ్యారెల్ ధర 67 డాలర్ల స్థాయికి దిగివచ్చిందని ప్రకటించారు. మరి కొన్ని రోజుల పాటు అదే స్థాయిలో కొనసాగవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా 77వ వ్యవస్థాపక దినోత్సవానికి హాజరైన క్రమంలో చమురు ధరలపై మాట్లాడారు కేంద్ర మంత్రి. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్‌లో బయోఫ్యూయల్ కలపడాన్ని పెంచిందని, ముడి చమురు దిగుమతులు గతంలో 27 దేశాల నుంచి ఉంటే దానిని 40 దేశాలకు పెంచినట్లు గుర్తు చేశారు. 'ఏం జరగదని నేను చెప్పాను. ఆయిల్ ధరలు స్థిరంగానే ఉంటాయి. ఎలాంటి ఆందోళన అవసరం లేదు. ప్రస్తుతం బ్యారెల్ ముడి చమురు ధర 67 డాలర్ల స్థాయికి దిగివచ్చింది. నేను ఇది ఎందుకు చెప్తున్నాను అంటే ప్రపంచంలో సరిపడ ఆయిల్ ఉంది. గతంలో మనం 27 దేశాల నుంచి చమురు కొనుగోలు చేసేవాళ్లం. ఇప్పుడు 40 దేశాల నుంచి కొంటున్నాం. మనం బయో ఫ్యూయల్ కలుపుతున్న దేశాల్లో ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉన్నాం. దానిని 20 శాతం నుంచి 25-30 శాతానికి ఎప్పుడైనా పెంచవచ్చు.' అని పేర్కొన్నారు.

## ఇది కదా అదృష్టమంటే.. ఏడాదికే లక్షకు రూ.62 లక్షలు




**ముంబై-నవభూమి:** స్టాక్ మార్కెట్ పెట్టుబడులు చాలా రిస్క్‌తో కూడుకుని ఉంటాయి. అయితే, సరైన సమయంలో సరైన స్టాక్‌ను ఎంచుకుని ఇన్వెస్ట్ చేస్తే ఊహించని విధంగా లాభాలు అందుకోవచ్చని కొన్ని కంపెనీల స్టాక్స్ నిరూపిస్తుంటాయి. తమ ఇన్వెస్టర్లను తక్కువ సమయంలోనే మల్టీ మిలియనీర్లను చేసి మల్టీబ్యాగర్ స్టాక్స్‌లో ఒకటిగా నిలుస్తుంటాయి. అలాంటి ఓ స్టాక్ గురించి ఇప్పుడు మనం తెలుసుకుందాం. అదే ఎలైట్ కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ షేరు. గత మూడు రోజులుగా వరుస సెషన్లలో ఈ స్టాక్ అప్పర్ సర్క్యూట్ కొడుతూ ఇన్వెస్టర్లపై కాసుల వర్షం కురిపిస్తోంది. ఇవాళ జులై 2వ తేదీన మార్కెట్ ట్రేడింగ్‌లోనూ 5 శాతం పెరిగి అప్పర్ సర్క్యూట్‌లో రూ.69.67 వద్ద లాక్ అయింది.నిధుల సమీకరణపై నిర్ణయం తీసుకునేందుకు కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశం తేదీని కంపెనీ ప్రకటించిన క్రమంలో ఈ స్టాక్ పరుగులు పెడుతోంది. ఎలైట్ కాన్ ఇంటర్నేషనల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు జులై 1వ తేదీన సమావేశమయ్యారు. వచ్చే బోర్డు సమావేశంలో నిధుల సమీకరణపై నిర్ణయం, ఆమోదంచేందుకు జులై 4, 2025 రోజున మళ్లీ సమావేశం అవుతున్నట్లు నిర్ణయించారు. ఆ విషయాన్ని కంపెనీ వెల్లడించిన క్రమంలో ఈ స్టాక్స్ కొనేందుకు మదుపరులు ఎగబడుతున్నారు. జులై 4వ తేదీన సమావేశంపై రూ.75 కోట్లు మేర నిధుల సమీకరణకు ఏ విధానాన్ని ఎంచుకోవాలనే విషయంపై స్పష్టత ఇవ్వనున్నారు. కన్వర్టబుల్ వారంట్స్, ఫారెన్ కరెన్సీ కన్వర్టిబుల్ బాండ్స్, క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ లేదా ఏదైనా ఇతర మార్గాన్ని అనుసరించాలా అనే విషయంపై క్లారిటీ రానుంది.ఎలైట్ కాన్ ఇంటర్నేషనల్ షేరు ధర ఇవాళ 5 శాతం అప్పర్ సర్క్యూట్ కొట్టింది. అలాగే గత నెల రోజుల్లో ఈ స్టాక్ 48 శాతం పెరిగింది. అలాగే గత 3 నెలల్లోనే 106 శాతం పెరిగి పెట్టుబడులను రెండింతలకు పైగా చేసింది. అలాగే ఈ స్టాక్ ఈ 2025 తొలి ఆరు నెలల కాలంలో ఏకంగా 572 శాతం మేర లాభపడింది. లక్ష పెట్టిన వారికి రూ.6.72 లక్షల మేర ఇచ్చింది. ఇక గత ఏడాది కాలంలో చూసుకుంటే ఈ స్టాక్ ఏకంగా 6200 శాతం మేర పెరిగింది. అంటే ఏడాది క్రితం ఇందులో లక్ష పెట్టి షేర్లు కొని ఇప్పటి వరకు వేచి ఉన్న వారికి ఇప్పుడు ఆ విలువ రూ.62 లక్షలు అవుతుంది.ఈ కంపెనీ స్టాక్ 52 వారాల గరిష్ఠ స్థాయి రూ.69.67 సైతం ఈరోజే తాకడం గమనార్హం. ఇక 52 వారాల కనిష్ఠ స్థాయి రూ.1.10గా ఉంది. ఈ కంపెనీ స్టాక్ పీఈ రేషియో 259.16గా ఉంది. ప్రస్తుతం ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ.11140 కోట్లుగా ఉంది.

# హైదరాబాద్‌లో ఇళ్ల ధరలు పెరుగుతాయ్



**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్ నగరం వేగంగా విస్తరిస్తోంది. అన్ని వైపులా మౌలిక వసతులు అందుబాటులోకి వస్తున్న క్రమంలో భూములు, ఇళ్ల ధరలకు రెక్కలొస్తున్నాయి. నగర శివారు ప్రాంతాల్లోనూ ధరలు మండిపోతున్నాయ. ఇప్పుడు బడ్జెట్ ధరలో ఇల్లు కావాలంటే ఔటర్ రింగ్ రోడ్డు దాటి చాలా దూరం వెళ్లాల్సి వస్తోంది. సిటీకి దూరమైనా అక్కడా భారీగానే కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఇళ్లు, ఫ్లాట్లకు గిరాకీ క్రమంగా పెరుగుతున్న క్రమంలో ధరలు సైతం పెంచేస్తున్నారు. హైదరాబాద్ సహా దేశంలోని ప్రధాన నగరాల్లో ఇళ్లు, ఫ్లాట్ల ధరలు మరింత పెరుగుతాయని షాకింగ్ న్యూస్ చెప్పింది ప్రముఖ రేటింగ్స్ ఏజెన్సీ క్రిసిల్ రేటింగ్స్. దేశంలో ఇళ్లు, ఫ్లాట్ల ధరలపై కీలక నివేదిక విడుదల చేసింది.ఇళ్లు లేదా ఫ్లాట్ల ధరలు మీడియం టర్మ్‌లో సగటున 4 శాతం నుంచి 6 శాతం వరకు పెరిగే అవకాశాలు ఉన్నట్లు క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. గడిచిన 2 ఆర్థిక సంవత్సరాల కాలంలో ఇళ్లు, ఫ్లాట్ల ధరల పెరుగుదల రెండంకెల మేర ఉన్నట్లు తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరం 2025-26 సహా వచ్చే ఆర్థిక సంవత్సరం 2026-27లో స్థిరాస్తి డెవలపర్లు స్థిరమైన విక్రయాలు చేయగలుగుతారని తెలిపింది. కరోనా మహమ్మారి పరిణామాల నుంచి రికవరీ అయిన మూడు సంవత్సరాల తర్వాత ఇళ్లకు గిరాకీ స్థిరంగా కొనసాగుతున్నట్లు తెలిపింది. దీంతో ఇళ్లు, ఫ్లాట్ల విక్రయాల పరిమాణంలో 5 శాతం నుంచి 7 శాతం, ఇళ్ల ధరలు సగటున 4 శాతం నుంచి 6 శాతం పెరగవచ్చని అంచనా వేసింది.

ఇక ఈ ఆర్థిక ఏడాది 2025-26 సహా వచ్చే ఏడాది 2026-27ల్లోనూ గిరాకీని మించి ఇళ్లు, ఫ్లాట్ల సరఫరా కొనసాగేందుకు అవకాశాలు ఉన్నాయని క్రిసిల్ రేటింగ్స్ నివేదిక తెలిపింది. మరోవైపు.. దేశంలో సుమారు 35 శాతం మేర ఇళ్లు, ఫ్లాట్లు విక్రయిస్తున్న 75 రియల్ ఎస్టేట్ కంపెనీల విశ్లేషించినట్లు తెలిపింది. ఆయా కంపెనీల బ్యాలెన్స్ షీట్లు, రుణ చెల్లింపుల సామర్థ్యాలు ఆరోగ్యకరంగానే ఉన్నట్లు క్రిసిల్ రేటింగ్స్ నివేదిక వివరించింది. గత ఆర్థిక సంవత్సరం 2024-25లో ఇళ్ల గిరాకీలో పెద్దగా మార్పు లేదని తెలిపింది.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక వడ్డీ రేట్లను ఏకంగా 100 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. దీంతో హోమ్ లోన్స్ వడ్డీ రేట్లను బ్యాంకులు తగ్గిస్తున్నాయి. ఈ రుణ వడ్డీ రేట్లు దిగిరావడం సహా ఇళ్ల ధరల్లో పెరుగుదల స్వల్పంగానే ఉండడం రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు కలిసి రావచ్చని క్రిసిల్ రిపోర్ట్ అంచనా వేసింది. హోమ్ లోన్స్ తీసుకునే వారి సంఖ్య పెరగవచ్చని, దీంతో గిరాకీ పెరుగుతుందని పేర్కొంది.

## ఐపీఓల జోరు.. భారత క్యాపిటల్ మార్కెట్‌కు కొత్త కంపెనీల వెల్లువ!




**హైదరాబాద్-నవభూమి:** భారత క్యాపిటల్ మార్కెట్‌లో ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్స్ (ఐపీఓ) సందడి కొనసాగుతుంది. కేటరింగ్, ఆహార సేవలు, బాస్మతి బియ్యం, పునరుత్పాదక ఇంధనం, ఆటోమోటివ్ విడిభాగాలు ఆర్థిక సేవలు వంటి వివిధ రంగాలకు చెందిన ప్రముఖ కంపెనీలు తమ ఐపీఓల కోసం సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌లు సమర్పించాయి.

**1. ఫుడ్‌లింక్ ఎఫ్ అండ్ బీ హెూల్డింగ్స్:**
కేటరింగ్, ఫుడ్ రిటైల్ చెయిన్ రంగంలోని ఈ సంస్థ రూ. 160 కోట్ల విలువైన తాజా షేర్లు, 1.19 కోట్ల షేర్ల ఆఫర్ ఫర్ సేల్ తో ఐపీఓకు సిద్ధమైంది. సేకరించిన నిధులను కొత్త కిచెన్‌లు, రెస్టారెంట్లు ఏర్పాటు చేయడానికై, రుణాల చెల్లింపునకై వినియోగించనున్నారు.

**2. క్యూర్‌ఫుడ్స్ ఇండియా లిమిటెడ్:**
ఇంటర్నెట్ ఆధారిత మల్టీ-బ్రాండ్ ఫుడ్ సేవల కంపెనీ క్యూర్‌ఫుడ్స్ ఇండియా, రూ. 800 కోట్ల తాజా షేర్లు, 4.85 కోట్ల ఈక్విటీ షేర్ల %ాఖీూ%తో కూడిన సమర్పించింది. తమ కార్యకలాపాలను విస్తరించడానికై, కొత్త కిచెన్‌లు స్థాపించడానికై, బ్రాండ్‌లను విస్తరించడానికై ఈ నిధులను ఉపయోగిస్తారు.

**3. అమీర్‌చంద్ జగదీష్ కుమార్ (ఎక్స్‌పోర్ట్స్) లిమిటెడ్:**
బాస్మతి బియ్యం, ఎఫ్ఎంసీజీ ఉత్పత్తుల వ్యాపారం నిర్వహించే ఈ సంస్థ రూ. 550 కోట్ల ఐపీఓకు డీఆర్‌హెచ్‌పీ సమర్పించింది. నిధులను నిర్వహణ మూలధన అవసరాలకై, సాధారణ కార్పొరేట్ అవసరాలకై వినియోగించనున్నారు.

**4. జునిపర్ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్:**
పునరుత్పాదక విద్యుదుత్పత్తి రంగంలో ఉన్న జునిపర్ గ్రీన్ ఎనర్జీ, రూ. 3,000 కోట్ల తాజా షేర్ల ఐపీఓ కోసం దాఖలు చేసింది. సేకరించిన నిధులను రుణాల చెల్లింపునకై, కార్పొరేట్ అవసరాలకై కేటాయిస్తారు. 2024 డిసెంబర్ నాటికి ఇది భారత్‌లోని టాప్ 10 పునరుత్పాదక విద్యుదుత్పత్తి దిగ్గజాలలో ఒకటిగా నిలిచింది.

**5. టెన్నెకో క్లీన్ ఎయిర్ ఇండియా లిమిటెడ్:**
యూఎస్‌లో ప్రధాన కార్యాలయం కలిగిన టెన్నెకో గ్రూప్‌లో భాగమైన టెన్నెకో క్లీన్ ఎయిర్ ఇండియా లిమిటెడ్, తమ ఐపీఓ కోసం సెబీకి సమర్పించింది. ప్రమోటర్ టెన్నెకో మారిషస్ హెూల్డింగ్స్ లిమిటెడ్ ద్వారా రూ. 3000 కోట్ల వరకు ఆఫర్ ఫర్ సేల్ ఉంటుంది.

**6. గజా ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్:**
గజా క్యాపిటల్ బ్రాండ్ కింద కార్యకలాపాలను నిర్వహించే గజా ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్, తమ ఐపీఓ కోసం సెబీ వద్ద రహస్య DRHP దాఖలు చేసింది. విద్య, వినియోగదారు ఆర్థిక సేవల రంగాలకు ఇది మూలధనాన్ని అందిస్తుంది. ఈ నెల ప్రారంభంలో కంపెనీ ప్రీ-ఐపీఓ నిధుల సేకరణలో రూ. 125 కోట్లు సేకరించింది. కొత్త ఇష్యూ ఆదాయం ఫండ్ మేనేజర్ల మూలధనాన్ని కొత్త నిధులను సీడ్ చేయడానికై, పంపిణీ సామర్థ్యాలను విస్తరించడానికై ఉపయోగిస్తారు.

7. షాడోఫాక్స్ టెక్నాలజీస్ లిమిటెడ్...షాడోఫాక్స్ టెక్నాలజీస్ లిమిటెడ్, తమ ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ కోసం సెబీ వద్ద గోప్యమైన రీతిన డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్(ను దాఖలు చేసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ ఐపీవో పరిమాణం రూ. 2,000 – రూ. 2,500 కోట్ల పరిధిలో ఉండనుంది. ఇందులో ప్రస్తుత వాటాదారుల తాజా ఇష్యూ, ఆఫర్ ఫర్ సేల్ కలిపి వుంటాయి . కంపెనీ విలువ దాదాపు రూ. 8,500 కోట్లు ఉంటుందని అంచనా.

## మహీంద్రా జోరు... జూన్‌లో వాహన, ట్రాక్టర్ల విక్రయాల్లో బలమైన వృద్ధి!

**హైదరాబాద్-నవభూమి:** ప్రముఖ వాహన తయారీ సంస్థ మహీంద్రా మహీంద్రా, జూన్ 2025లో తమ మొత్తం వాహన విక్రయాల్లో గణనీయమైన వృద్ధిని నమోదు చేసింది. ట్రాక్టర్ల అమ్మకాల్లోనూ కంపెనీ అద్భుతమైన పనితీరు కనబరిచింది. మొత్తం మీద ఆటోమొబైల్, వ్యవసాయ పరికరాల విభాగాల్లో బలమైన వృద్ధిని సాధించినట్లు సంస్థ వెల్లడించింది.మహీంద్రా మహీంద్రా జూన్ 2025లో మొత్తం 78,969 వాహనాలను విక్రయించింది. ఇది గతేడాదితో పోలిస్తే 14 శాతం వృద్ధిని సూచిస్తుంది. ఇందులో ఎగుమతులు కూడా కలిసి ఉన్నాయి. ఈ వృద్ధికి ప్రధాన కారణం యుటిలిటీ వెహికల్స్ (ఎస్‌యూవీ) విభాగం. దేశీయ మార్కెట్‌లో ఎస్‌యూవీ విక్రయాలు 18 శాతం పెరిగి 47,306 యూనిట్లకు చేరాయి. ఈ త్రైమాసికం ఎస్‌యూవీలకు సంబంధించి అత్యధిక విక్రయాలు నమోదైన త్రైమాసికం అని కంపెనీ ఆటోమోటివ్ విభాగం సీఈఓ నళినీకాంత్ తెలిపారు. వాణిజ్య వాహనాల దేశీయ విక్రయాలు 20,575 యూనిట్లుగా నమోదయ్యాయి. 3 చక్రాల వాహనాల (ఎలక్ట్రిక్ 3వీలతో సహా) విక్రయాలు 37 శాతం పెరిగి 8,454 యూనిట్లకు చేరాయి. మొత్తం ఎగుమతులు గత ఏడాదితో పోలిస్తే 1 శాతం పెరిగి 2,634 యూనిట్లుగా నమోదయ్యాయి.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 | హైదరాబాద్ | గురువారం | 03। జూలై। 2025

## ఫ్యాన్సీ రేటుకి వార్-2 తెలుగు స్టేట్ రైట్స్ దక్కించుకున్న ప్రముఖ నిర్మాత..

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ 'వార్ 2 చిత్రంతో హిందీ చలన చిత్రసీమకు పరిచయం అవుతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో ఎన్టీఆర్‌తో పాటు గ్రీక్ గాడ్ ఆఫ్ బాలీవుడ్ హృతిక్ రోషన్ కూడా నటిస్తున్నారు. ఎన్టీఆర్ వలన ఈ సినిమాకి సౌత్ ఇండియాలో ఫుల్ క్రేజ్ రాగా, నార్త్‌లో హృతిక్ రోషన్ వలన వచ్చింది. దేవర తర్వాత ఎన్టీఆర్ నటిస్తున్న వార్ 2 సినిమా కోసం తెలుగు ప్రేక్షకులు సైతం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాలలో ఈ సినిమాని డిస్ట్రిబ్యూట్ చేయడానికి చాలా మంది పోటీ పడ్డారు. అయితే అందరి కంటే నాగ వంశీ ఒక అడుగు ముందుకి వేసి రైట్స్



దక్కించుకున్నాడు.సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ కి సంబంధించిన ఎస్. నాగవంశీ ఈ సినిమా తెలుగు హక్కులను రూ.80 కోట్లకు సొంతం చేసుకున్నట్లు సినీ వర్గాల్లో టాక్. ఇది ఈ మధ్య కాలంలో ఒక హిందీ సినిమా తెలుగు రైట్స్‌కు దక్కిన అత్యధిక ధరగానే చెప్పాలి. సౌత్ మార్కెట్‌పై బాలీవుడ్ నిర్మాతలకు ఉన్న నమ్మకాన్ని ఇది మరోసారి రుజువు చేస్తోంది. ఇదే సమయంలో సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తున్న 'కూలీ' చిత్రం కూడా అదే రోజు విడుదల కానుంది. ఈ సినిమా తెలుగు హక్కులు రూ.50 కోట్లు పలికినట్టు సమాచారం. ఈ రెండు భారీ సినిమాలకి ఆగస్ట్ 14న బాక్సాఫీస్ దగ్గర గట్టి ఫైటే



## 'కన్నప్ప' బ్యూటీ.. అలాంటి రోల్స్ కోసం వెయిట్ చేస్తుందట!




అయితే సినిమాలో తన గ్లామర్‌తో ఆకట్టుకుంది అమ్మడు. తాను పోషించిన రోల్ లో ధైర్యంగా కనిపించిన ప్రీతి.. పాత్రకు న్యాయం చేసిందనే చెప్పాలి. టాలీవుడ్ హీరో మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ కన్నప్ప రీసెంట్ గా ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. కన్నప్ప జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన ఆ సినిమాకు ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. మోహన్ బాబు భారీ బడ్జెట్‌తో నిర్మించగా.. కోలీవుడ్ అమ్మాయి ప్రీతి ముకుందన్ ఫిమేల్ లీడ్ రోల్‌లో యాక్ట్ చేసింది. అయితే కన్నప్ప మూవీలో హీరోయిన్‌గా ముందు బాలీవుడ్ హీరోయిన్ కృతి సనన్ చెల్లెలు నుపుర్ సనన్‌ను తీసుకున్నారు. కానీ నుపుర్ సనన్ కన్నప్ప నుంచి ఆ తర్వాత తప్పుకున్నారు. ఆ సమయంలో ప్రీతి ముకుందన్ కు ఛాన్స్ వచ్చింది. పాన్ ఇండియా రేంజ్ లో భారీ స్థాయిలో రిలీజ్ అయిన సినిమాలో యాక్ట్ చేసింది. అయితే సినిమాలో తన గ్లామర్‌తో ఆకట్టుకుంది అమ్మడు. తాను పోషించిన రోల్‌లో ధైర్యంగా కనిపించిన ప్రీతి.. పాత్రకు న్యాయం చేసిందనే చెప్పాలి. అలా హైలెట్‌గా నిలిచి.. యూత్ ను తన అందచందాలతో బాగా అట్రాక్ట్ చేసింది అమ్మడు. అదే సమయంలో పలువురు టాలీవుడ్ మేకర్స్ దృష్టిలో కూడా ఆమె పడినట్లు తెలుస్తోంది. ఇప్పుడు కొందరు మేకర్స్.. ఆమెను తమ సినిమాల్లోకి తీసుకోవాలని చూస్తున్నారని ప్రచారం జరుగుతోంది. అయితే తన అప్ కమింగ్ సినిమాల్లో గ్లామరస్ రోల్స్ చేయాలని ప్రీతి ముకుందన్ భావిస్తున్నట్లు సమాచారం. అందుకు అనుగుణంగా స్క్రిప్ట్ లను సెలెక్ట్ చేసుకుంటుందని టాలీవుడ్ సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కాగా, కోలీవుడ్ కు చెందిన ప్రీతి.. టాలీవుడ్ మూవీతోనే తెరంగేట్రం చేసింది. ఆ సినిమా కన్నప్ప కాదు.. యంగ్ హీరో శ్రీవిష్ణు లీడ్ రోల్‌లో నటించిన శ్రీ విష్ణు కామెడీ సినిమాతో ఓం భీమ్ బుష్‌తో డెబ్యూ ఇచ్చింది. ఆ సినిమాతో అనుకున్నంత పేరు రాలేదు. ఆ తర్వాత కోలీవుడ్ లో స్టార్ అనే మూవీతో అరంగేట్రం చేసింది. ఇప్పుడు కన్నప్పతో సందడి చేయగా.. ప్రస్తుతం ఆమె లైనప్ లో రెండు సినిమాలు ఉన్నాయి. మలయాళంలో మైనే ప్యార్ కియా, తమిళంలో ఇదయం మురళి సినిమాల్లో యాక్ట్ చేస్తోంది. ప్రస్తుతం ఆ చిత్రాల షూటింగ్స్ శరవేగంగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. మరి ఫ్యూచర్ లో ప్రీతి ఎలాంటి ఛాన్సులు అందుకుంటుందో.. తెలుగులో ఎలా మెప్పిస్తుందో వేచి చూడాలి.

## 'రామాయణ' షూటింగ్ పూర్తి.. జూలై 3న క్రేజీ అప్‌డేట్



బాలీవుడ్‌లోని ప్రముఖ దర్శకుల్లో ఒకరైన నితేష్ తివారీ దర్శకత్వంలో రూపొందుతోన్న పాన్-ఇండియా మైథలాజికల్ మూవీ 'రామాయణ' .తొలి భాగం షూటింగ్ పూర్తి చేసుకున్నట్లు సమాచారం. భారీ స్థాయిలో రూపొందుతోన్న ఈ సినిమా దేశవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానుల్లో భారీ అంచనాలు పెంచుతుంది. ఇందులో రణబీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతగా కనిపించనుండగా, కన్నడ రాక్‌స్టార్ యష్ రావణుడి పాత్రలో నటిస్తున్నారు. అలాగే కాజల్ అగర్వాల్ మండోదరి పాత్రలో నటించనుందన్న వార్తలు వెలువడుతున్నాయి. తాజాగా షూటింగ్ పూర్తి చేసుకున్న సందర్భంగా సినిమా యూనిట్ కేక్ కట్ చేస్తూ జరుపుకున్న సంబరాలు సోషల్ మీడియాను హీటెక్కిస్తున్నాయి.ఫోటోలు, వీడియోలు ఇంటర్నెట్‌లో వైరల్ అవుతున్నాయి. ఈ చిత్రం రెండు భాగాలుగా తెరకెక్కుతోంది. తొలి భాగాన్ని 2026 దీపావళికి, రెండో భాగాన్ని 2027 దీపావళికి విడుదల చేయాలని మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. షూటింగ్ పూర్తయినందున, సినిమాకు సంబంధించిన గ్లింప్స్ వీడియోను జూలై 3, 2025న విడుదల చేయనున్నట్లు సమాచారం. ఈ ఈవెంట్‌కు టీమ్ మొత్తం హాజరుకానున్నారు. బెంగళూర్‌లో జరగనున్న ఈ కార్యక్రమం కోసం తారలంతా అక్కడికి బయల్దేరుతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. చిత్రంలో లక్ష్మణుడిగా రవి దూబే కనిపించనుండగా, కైకేయిగా లారా దత్తా, శూర్పణఖగా రకుల్ ప్రీత్ సింగ్, హనుమాన్‌గా సన్నీ డియోల్, దశరథుడిగా అరుణ్ గోవిల్ కనిపించి అలరించనున్నారు. ఇక యష్ ఈ చిత్రంలో నటించడమే కాకుండా, తన Monster Mind Creations బ్యానర్‌తో పాటు Prime Focus Studiosతో కలిసి సినిమాని నిర్మిస్తున్నారు. ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషలతో పాటు పలు ఇతర భారతీయ భాషల్లో విడుదల కానుంది. భారీ స్థాయిలో నిర్మితమవుతున్న ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి మరిన్ని అప్‌డేట్స్ త్వరలో వెల్లడించనున్నట్టు చిత్ర బృందం తెలిపింది. రామాయణం రూపంలో భారతీయ సినీ చరిత్రలో మరో విజువల్ వండర్ రాబోతుందన్న ఊహలు జోరుగా వినిపిస్తున్నాయి.

## హాలీవుడ్ చేతికి చిరు 'విశ్వంభర'.!



తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ నుంచి వస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియన్ మూవీలలో 'విశ్వంభర' ఒకటి. అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో త్రిష కథానాయికగా నటిస్తుండగా.. వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం వీఎఫ్ఎక్స్ పనుల్లో బిజీగా గడుపుతుంది. సినిమా టీజర్‌పై విపరీతంగా ట్రోల్స్ రావడంతో గ్రాఫిక్స్‌పై మరింత కష్టపడుతున్నారు మేకర్స్. అయితే ఈ సినిమా గ్రాఫిక్స్‌కి సంబంధించి తాజాగా ఒక వార్త వైరల్‌గా మారింది. ఈ సినిమా గ్రాఫిక్స్ పనులను హాలీవుడ్‌కి చెందిన వీఎఫ్ఎక్స్ స్టూడియోకి అప్పగించినట్లు తెలుస్తుంది. ఈ హాలీవుడ్ స్టూడియో విశ్వంభర సినిమాకు సాలిడ్ అవుట్ పుట్‌ని అందించబోతున్నట్లు తెలుస్తుంది. ఈ పనులు కంప్లీట్ అయిన అనంతరం సినిమా విడుదల తేదీని మేకర్స్ అనౌన్స్ చేయబోతున్నట్లు సమాచారం.మరోవైపు అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరు ఒక సినిమా చేస్తున్నాడు. కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతుంది. సోషియో ఫాంటసీ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ విక్రమ్ తెరకెక్కిస్తున్నారు.

## పూజా ఫ్యాన్స్‌ని వాటితో సరిపెడుతుందా?



బుట్ట బొమ్మ పూజా హెగ్డే తెలుగులో పూర్తిగా ఖాళీ అయ్యింది. మహేష్ బాబు గుంటూరు కారం నుంచి బయటకు వెళ్లడమే ఆమె చేసిన పొరపాటు అన్నట్టుగా ఆ తర్వాత ఒక్కటంటే ఒక్క ఛాన్స్ కూడా అమ్మడికి రాలేదు. పూజా హెగ్డేకి తెలుగులో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. అమ్మడి గ్లామర్ షోకి ఇక్కడ ఆడియన్స్ ఫిదా అయిపోతారు. అలాంటిది తన ఫ్యాన్స్ తనను మిస్ అవుతున్నారన్న భావన అమ్మడిలో కూడా ఉంది. అందుకే పూజా హెగ్డే తన ప్రతి అప్డేట్ ని సోషల్ మీడియాలో ఉంచుతుంది. ముఖ్యంగా ఇన్ స్టా ఫోటో షూట్స్ వల్ల పూజా హెగ్డే ఎక్కువమంది ఆడియన్స్ కు రీచ్ అవుతుంది. బాలీవుడ్‌లో అమ్మడు క్లిక్ అవ్వకపోయినా సౌత్ సినిమాల్లో ముఖ్యంగా తెలుగు సినిమాలు ఆమెకు స్టార్ డం తెచ్చి పెట్టాయి. టాలీవుడ్ లో స్టార్ సినిమాలు చేసిన పూజా హెగ్డే ఇక్కడ సూపర్ పాపులారిటీ సంపాధించింది. ఐతే సడెన్‌గా ఆమెకు తెలుగులో కూడా అవకాశాలు రావడం ఆగిపోయాయి. దీని వెనక రీజన్ ఏదైనా సరే టాలీవుడ్‌పై పూజా పెట్టుకున్న ఆశలనీ ఆవిరి అయ్యాయి. ఈమధ్యనే సూర్య సరసన రెట్రో చేసిన పూజా హెగ్డే ఆ సినిమా తనకు మంచి కంబ్యాక్ ఇస్తుందని ఆశించింది. కానీ ఆమెను ఎక్కువా కాదు కాదు పూర్తిగా ఇప్పటివరకు గ్లామర్ రోల్స్ లో చూసిన వాళ్లు సడెన్ గా డీ గ్లామర్ రోల్ అనేసరికి కాస్త షాక్ అయ్యారు. ఐతే ఆ సినిమా వల్ల పూజాకి యాడ్ అయ్యింది అయితే ఏమి లేదని చెప్పొచ్చు. రెట్రో ప్రమోషన్స్ లోనే తెలుగు నుంచి ఒక ఆఫర్ వచ్చిందని అది త్వరలో తెలుస్తుందని వెల్లడించిన పూజా హెగ్డే చూస్తుంటే ఆ ప్రాజెక్ట్ నుంచి కూడా బయటకు వెళ్లినట్టు తెలుస్తుంది. అందుకే సినిమాల అవకాశాలు వచ్చే వరకు ఫోటో షూట్స్ తో సోషల్ మీడియాలో ఫ్యాన్స్ తో టచ్ లో ఉంటుంది అమ్మడు. తెలుగులో ప్రస్తుతం పాన్ ఇండియా సినిమాల హవా నడుస్తుంది కాబట్టి కొద్దిగా ప్రయత్నించి ఒక్క పాన్ ఇండియా ఛాన్స్ అందుకుంటే మళ్లీ కెరీర్ సెట్ రైట్ అవుతుందనే ఆలోచనలో ఉన్నట్టుంది పూజా హెగ్డే. అందుకే తెలుగు ఛాన్స్ కోసం ఈగర్‌గా ఎదురుచూస్తుంది. మరి ఆ ఛాన్స్ ఇచ్చేది ఎవరన్నది చూడాలి.

## వెండితెర అరంగేట్రం చేయబోతున్న మోహన్ లాల్ కూతురు.. దర్శకుడు ఎవరు



ఇండస్ట్రీకి వారసుల ఎంట్రీ కొత్తేమి కాదు. ఎప్పటి నుండో ఈ సంప్రదాయం నడుస్తుంది. అయితే ఎక్కువగా సినీ ప్రముఖుల వారసులు ఎంట్రీ ఇస్తుండడం మనం చూస్తున్నాం. అయితే స్టార్ హీరోల తనయలు వెండితెర అరంగేట్రం చేయడం చాలా తక్కువ. ఇప్పుడు మలయాళ సినీ పరిశ్రమలో స్టార్ వారసురాలి ఎంట్రీ జరగబోతోంది. మలయాళ మెగాస్టార్ మోహన్‌లాల్ కుమార్తె విస్మయ మోహన్‌లాల్. తెరలో నటిగా వెండితెరపె అరంగేట్రం చేయనుంది.

విస్మయ 'తుడక్కం' అనే చిత్రంతో హీరోయిన్‌గా స్క్రీన్‌కు పరిచయం కాబోతోంది. ఈ చిత్రానికి జూడే ఆంథనీ జోసెఫ్ దర్శకత్వం వహించనున్నారు. జూడే ఆంథనీ జోసెఫ్ గతంలో సారాస్, 2018 వంటి విజయవంతమైన సినిమాలకు దర్శకత్వం వహించి గుర్తింపు పొందారు. ఈ ప్రాజెక్ట్‌ను మోహన్‌లాల్‌కు అత్యంత సన్నిహితుడైన ఆంటోనీ పెరుంబవూర్ తన ఆశీర్వాద్ సినిమాస్ బ్యానర్‌పై నిర్మించనున్నాడు. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ అధికారికంగా సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. "విస్మయ మోహన్‌లాల్‌ను వెండితెరకు పరిచయం చేయడం మా సంస్థకు గర్వకారణం" అని ఆశీర్వాద్ సినిమాస్ పేర్కొంది.తన కుమార్తె తొలి సినిమా గురించి సూపర్‌స్టార్ మోహన్‌లాల్ కూడా సోషల్ మీడియాలో స్పందించాడు. "తుడక్కం సినిమా మీద నీ ప్రేమకు ఇది మొదటి అడుగు. నీ కొత్త ప్రయాణానికి నా తరపున శుభాకాంక్షలు, విస్మయ" అంటూ మోహన్‌లాల్ ట్వీట్ చేశాడు. ఆయన అభిమానులూ ఈ ప్రకటనపై ఆనందం వ్యక్తం చేస్తూ విస్మయకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. విస్మయ ఇప్పటికే రచయితగా తన ప్రతిభను చాటుకుంది. 2021లో ఆమె రచించిన 'Grains of Stardust అనే పుస్తకం ప్రముఖ పబ్లిషింగ్ హౌస్ అయిన Penguin Books ద్వారా విడుదలైంది. ఆమె రచనా శైలి విశ్లేషకుల ప్రశంసలు అందుకుంది. విస్మయ కేవలం సాహిత్యంలోనే కాదు, మార్షల్ ఆర్ట్స్ లోనూ ప్రావీణ్యం సంపాదించింది. ఆమె థాయ్‌లాండ్‌లో శిక్షణ తీసుకొని ఫిజికల్ ఫిట్‌నెస్, యాక్షన్ ప్రిపరేషన్ లో ముందడుగు వేసింది. ఈ ప్రతిభను తెరమీద ఎలా చూపించబోతుందో అన్న ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది.

## వెంటిలేటర్‌పై ఫిష్ వెంకట్.. సాయం కోసం వేడుకుంటున్న భార్య



తెలుగు సినిమాల్లో కమెడియన్‌గాను, విలన్‌గాను నటించి మెప్పించాడు ఫిష్ వెంకట్ . మెయిన్ విలన్ పక్కన ఉంటూ తనదైన తెలంగాణ పంచ్‌లతో అలరించేవాడు.అయి తే ఇటీవల ఆయన ఆరోగ్య పరిస్థితి ఏమి బాగుండడం లేదు. ఇప్పటికే కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న వెంకట్ గతంలో డయాలసిస్ తీసుకున్నారు. అప్పట్లో ఆరోగ్యం కొంత మెరుగైనట్లే కనిపించినా, ఇటీవల మళ్లీ ఆరోగ్యం క్షీణించడంతో ఆసుపత్రిలో చేరారు. ప్రస్తుతం ఆయన ఎవరినీ గుర్తుపట్టే స్థితిలో కూడా లేరు అన్న వార్తలు అభిమానులను ఆందోళనకు గురి చేస్తున్నాయి.ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో వెంటిలేటర్‌పై ఉంచి వైద్యం అందిస్తున్నారు. వెంకట్ కుటుంబం ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. చికిత్స ఖర్చులు భరించలేక దాతల సహాయం కోరుతోంది. ఆయన భార్య, కూతురు మీడియా ద్వారా "దయచేసి మా ఫ్యామిలీని ఆదుకోండి" అంటూ ప్రజలకు, సినీ ప్రముఖులకు వేడుకుంటున్నారు. గతంలో గాంధీ ఆసుపత్రిలో ఉచితంగా వైద్యం చేయించుకున్న వెంకట్‌కు పవర్ స్టార్ పవన్ కల్యాణ్ రూ.2 లక్షల ఆర్థిక సా యం చేసి అండగా నిలిచిన సంగతి తెలిసిందే. ఇప్పు డు మళ్లీ ఆరోగ్యం విషమించడంతో సాయం అవసం మైంది.వైద్యుల సమాచారం ప్రకారం, ప్రస్తుతం వెంకట్ డయాలసిస్‌పై ఉన్నారు, కానీ ఇది తాత్కాలిక పరిష్కారం మాత్రమే. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ అవసర మని చెబుతున్నారు. ఇది ఖరీదైన ప్రక్రియ కావడంతో కుటుంబం తీవ్ర ఆందోళనలో ఉంది. ఫిష్ వెంకట్ పరిస్థితిని చూసి అభిమానులు తీవ్రంగా కలత చెందుతున్నారు.

## టీమిండియా బస చేస్తున్న హెూటల్ వద్ద అనుమానాస్పద ప్యాకెట్.. గదులకే క్రికెటర్లు



**బర్మింగ్‌హామ్-నవభూమి:** టీమిండియా క్రికెటర్లు( బస చేస్తున్న హెూటల్ సమీపంలో అనుమానాస్పద ప్యాకెట్ దొరకడంతో అక్కడ పోలీసులు కార్డన్ సెర్చ్ చేపట్టారు. ఆ సమయంలో క్రికెటర్లు ఎవరూ హెూటల్ గదుల నుంచి బయటకు వెళ్లరాదు అని ఆదేశాలు ఇచ్చారు. దీంతో ప్లేయర్లు హెూటల్‌కే పరిమితం అయ్యారు. బర్మింగ్‌హామ్‌లోని సెంటనరీ స్క్వేర్ వద్ద అనుమానాస్పద ప్యాకెట్‌ను గుర్తించారు. దీంతో అక్కడకు చేరుకున్న పోలీసులు సమీప బిల్డింగ్‌ల్లో ఉన్న నివాసితులను చెక్ చేశారు. టీమిండియా క్రికెటర్లు బస చేస్తున్న హెూటల్‌ను కూడా సీజ్ చేశారు. బర్మింగ్‌హామ్ సిటీ సెంటర్ పోలీసులు ఇచ్చిన సోషల్ మీడియా పోస్టు ఆధారంగా క్రికెటర్లకు హెచ్చరిక జారీ చేసినట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి.ఇవాళ్టి నుంచి ఇంగ్లండ్‌తో రెండో టెస్టు ప్రారంభం కానున్నది. ఈ నేపథ్యంలో క్రికెటర్లు మంగళవారం ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. ఎడ్జ్‌బస్టన్‌లో గిల్‌తో పాటు కొందరు ఆటగాళ్లు ట్రైనింగ్‌లో పాల్గొన్నారు. మరో పది మంది సభ్యులు మాత్రం దూరంగా ఉన్నారు. సెంటనరీ స్క్వేర్ వద్ద కార్డెన్ సెర్చ్ జరుగుతోందని, అనుమానాస్పద ప్యాకేజీపై దర్యాప్తు చేపట్టినట్లు బర్మింగ్‌హామ్ పోలీసులు ఓ పోస్టు చేశారు. మధ్యాహ్నం మూడు గంటలకు తమకు అలర్ట్ ఇచ్చారని, దాంతో అక్కడ ఉన్న బిల్డింగ్‌లను ఖాళీ చేయించినట్లు ఓ మెసేజ్‌లో తెలిపారు. గంట పాటు జరిగిన కార్డన్ సెర్చ్ తర్వాత సీజ్ ఎత్తివేశారు.

## ప్రతి నెలా భార్య, కూతురుకు 4 లక్షలు ఇవ్వండి.. క్రికెటర్ షమీకి హైకోర్టు ఆదేశం



**కోల్‌కతా-నవభూమి:** టీమిండియా క్రికెటర్ మొహమ్మద్ షమీకి.. కోల్‌కతా హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. భార్య హసిన్ జహాన్‌తో పాటు కూతురికి ప్రతి నెలా నాలుగు లక్షలు ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. మెయింటేనెన్స్‌లో భాగంగా ఆ అమౌంట్ ఇవ్వాలని కోర్టు తన తీర్పులో పేర్కొన్నది. భార్యకు నెలా 1.5 లక్షలు, కూతురుకు 2.5 లక్షలు ఇవ్వాలని కోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. జస్టిస్ అజయ్ కుమార్ ముఖర్జీ బెంచ్ ఈ తీర్పును వెలువరించింది.హసిన్ జహాన్ కోర్టులో పిల్ దాఖలు చేసింది. ప్రతి నెలా నాలుగు లక్షల మెయింటేనెన్స్ ఇవ్వడం వల్ల వాళ్లకు ఆర్థిక స్థిరత్వం ఏర్పడుతుందని కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది. జూలై ఒకటో తేదీన ఈ తీర్పు వెల్లడైంది. తాము ఇచ్చిన ఆదేశాలతో పాటు కూతురు చదువు కోసం లేదా ఇతర ఖర్చుల కోసం షమీ డబ్బులు ఇవ్వవచ్చు అని కూడా కోర్టు తెలిపింది.2023లో ఇదే కేసులో జిల్లా సెషన్స్ కోర్టును జహాన్ ఆశ్రయించింది. భార్యకు 50వేలు, కూతురికి 80 వేలు ఇవ్వాలని సెషన్స్ కోర్టు ఆదేశించింది. అయితే ఆ తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టును జహాన్ ఆశ్రయించింది. ప్రతి నెలా తనకు ఏడు లక్షలు, కూతురికి మూడు లక్షలు ఇవ్వాలని జహాన్ కోర్టులో పిటీషన్ వేసింది.

## వాళ్లకు బ్యాటింగ్ చేతకాదు.. గాలి తీసేసిన అశ్విన్!



**న్యూఢిల్లీ-నవభూమి:** లీడ్స్ టెస్ట్ ఓటమి నుంచి పాఠాలు నేర్చుకున్న భారత జట్టు.. ఎడ్జ్‌బాస్టన్‌లో తడాఖా చూపించాలని అనుకుంటోంది. రెండో టెస్ట్‌లో ఆతిథ్య జట్టుకు గట్టి షాక్ ఇవ్వాలని భావిస్తోంది. ఈసారి బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్ యూనిట్‌ను బలోపేతం చేసుకోవడం మీద దృష్టి సారించిన భారత్.. అన్ని రంగాల్లోనూ రాణించి విజయంతో సిరీస్‌ను సమంతో చేయాలనే పట్టుదలతో ఉంది. ఈ తరుణంలో వాళ్లకు బ్యాటింగ్ చేతగాదంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్. ఇంతకీ అతడు ఎవర్ని ఉద్దేశించి ఇలా అన్నాడో ఇప్పుడు చూద్దాం..'బ్యాటర్లు బాధ్యత తీసుకొని ఆడాలి. లీడ్స్ టెస్ట్‌లో మన జట్టు బ్యాటర్లు అద్భుతంగా బ్యాటింగ్ చేశారు. పరుగుల వర్షం కురిపించారు. ఏకంగా 5 సెంచరీలు బాదారు. కానీ భారీ శతకాలు నమోదు కాలేదు. 150 ప్లస్ స్కోర్లు రాలేదు. మరో విషయం గుర్తుంచుకోవాలి. బ్యాటింగ్‌లో లోయరార్డర్ నుంచి ఎలాంటి సహకారం అందడం లేదు. మన జట్టు ఫాస్ట్ బౌలర్లు బ్యాటింగే చేయలేరు. వాళ్లకు పరుగులు చేయడం రాదు' అని అశ్విన్ స్పష్టం చేశాడు. టెయిలెండర్ల దగ్గర నుంచి పరుగులు ఆశించొద్దని వెటరన్ స్పిన్నర్ చెప్పుకొచ్చాడు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**